# దారి దీపం

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

మాసపత్రిక

సంపుటి 4 - సంచిక 1 | అక్టోబరు 2025 | వెల : రూ.15

బీహార్ ఎన్నికలలో రణతంత్రం

ఆధునిక ముసుగుల్లో కులం !

ఆర్ఎస్ఎస్ - స్వాతంత్ర్య పోరాటం

గాంధీజీ - ప్రజలు

ఆర్ఎస్ఎస్ అసలు స్వభావం

ఆర్ఎస్ఎస్ విద్వేష చరిత్రకు వందేండ్లు!

నూరు వసంతాల వేళ విభిన్న భావాల సంఘర్షణ

ప్రత్యేక మతం కోసం కదంతొక్కిన లింగాయత్‌లు

పాకిస్థాన్‌ను ముంచిన మతమౌఢ్యం

ఉదారవాదం తిరోగమిస్తున్న శకంలో భారతీయ ఫాసిజమ్

కార్పొరేట్ల చేతుల్లోకి 'సహకారం'!

బెడిసి కొడుతున్న పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం!

ఎన్ని సవరణలతో దెబ్బతీసినా ఆర్టీఐలో జీవం ఉంది

గోత్రాలు, వాటి పుట్టు పూర్వోత్తరాలు

జాషువా విశ్వకవి ఎందుకయ్యాడు?

అంబేద్కర్ బౌద్ధ దీక్ష - నైతికత, సమానత

తలవంచని గాన సరస్వతి తల వాల్చిన వేళ

శ్రమ విలువను చాటిన కవితా సిందూరం ఉన్నం, ఉష దంపతుల కావ్యగానం

'మృతజీవులు' నవలా పరిచయం

అక్టోబరు - 2025

పేజీలు : 48

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 1


డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. బీహార్ ఎన్నికలలో రణతంత్రం
- సంపాదకీయం 3
2. ఆధునిక ముసుగుల్లో కులం !
- యోగేంద్ర యాదవ్ 4
3. ఆర్ఎస్ఎస్ - స్వాతంత్ర్య పోరాటం
- మృదులా ముఖర్జీ 5
4. గాంధీజీ - ప్రజలు
- వి.రాంభూపాల్ 10
5. ఆర్ఎస్ఎస్ అసలు స్వభావం
- ఎ.జి. నూరాని 12
6. ఆర్ఎస్ఎస్ విద్వేష చరిత్రకు వందేండ్లు!
- డాక్టర్ దేవరాజు మహారాజు 15
7. నూరు వసంతాల వేళ విభిన్న భావాల సంఘర్షణ - మానవేంద్ర బసు 17
8. ప్రత్యేక మతం కోసం కదంతొక్కిన లింగాయత్‌లు - ఎంఏ అరుణ్ 19
9. పాకిస్థాన్‌ను ముంచిన మతమౌఢ్యం - మొహమ్మద్ ఇర్ఫాన్ 23
10. ఉదారవాదం తిరోగమిస్తున్న శకంలో భారతీయ ఫాసిజమ్ - శివసుందర్ 24
11. కార్పొరేట్ల చేతుల్లోకి 'సహకారం'! - మూడ్ శోభన్ 28
12. బెడిసి కొడుతున్న పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం! - ఆర్.లక్ష్మయ్య 30
13. ఎన్ని సవరణలతో దెబ్బతీసినా ఆర్టీఐలో జీవం ఉంది - మాడభూషి శ్రీధర్ 31
14. గోత్రాలు, వాటి పుట్టు పూర్వోత్తరాలు - పి.బి.చారి 34
15. జాషువా విశ్వకవి ఎందుకయ్యాడు? - ప్రసాదమూర్తి 36
16. అంబేద్కర్ బౌద్ధ దీక్ష - నైతికత, సమానత - మోకా సత్తిబాబు 38
17. తలవంచని గాన సరస్వతి తల వాల్చిన వేళ - ఇంటర్వ్యూ : రాఘవ 40
18. శ్రమ విలువను చాటిన కవితా సిందూరం ఉన్నం, ఉష దంపతుల కావ్యగానం 42
19. 'మృతజీవులు' నవలా పరిచయం - పి.యస్.ప్రకాశరావు 45
20. కార్టూన్స్ 47 - కొత్త పుస్తకాలకు శ్రీకారం 48




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM



# బీహార్ ఎన్నికలలో రణతంత్రం

బీహార్ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం మొదలైంది. ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య సూత్రాలు పక్కకుపోయి ఎన్నికల రణతంత్రాలు ముందుకు వచ్చాయి. ఎన్నికలు ఒక ప్రజాస్వామ్య ప్రక్రియ. సరైన ఓటర్ల జాబితాలు, కొత్త ఓటర్లకు అవకాశాలు, ఎన్నికల్లో పాలక పార్టీల అధికార దుర్వినియోగాల నియంత్రణ, అందరికీ స్వేచ్ఛగా, పారదర్శకంగా సమాన అవకాశాలతో ఎన్నికలు నిర్వహించాలి. ఈ బాధ్యత స్వతంత్ర ప్రతిపత్తిగల ఎన్నికల కమిషన్ నిర్వహించాలి. బీహార్ ఎన్నికలలో ఎన్నికల కమిషన్ కంచే చేను మేసిన చందంగా వ్యవహరిస్తున్నది. ఇష్టానుసారం 65 లక్షల ఓటర్లను తొలగించింది . సున్నా ఇంటి నంబర్లతో వేలాది మందిని ఓటర్లను చేసింది. ఇదంతా ప్రత్యేక సమగ్ర సర్వే పేరుతో సాగించింది .ఇది "ఓట్ చోరీ" ఉద్యమానికి దారితీసింది. చివరికి సుప్రీంకోర్టు జోక్యంతో కొంత ఊరట లభించినా తుది జాబితా కూడా తప్పుల తడకగా బీజేపీ పాలకులకు సాయపడేదిగానే వుందని పలువురు భావిస్తున్నారు.

బీహార్ ఎన్నికలు మోదీ సర్కార్‌కు పెద్ద సవాలుగా మారింది. గత పార్లమెంట్ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్‌లో ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తర భారతంలో మరో పెద్ద రాష్ట్రం బీహార్‌లో పరాజయం పొందితే వారి విజయ పరంపర తిరోగమనంలో పడుతుంది. అందుకే అడ్డదారుల ఎన్నికల రణతంత్రానికి ద్వారాలు తెరిచింది. ముందుగా ఎన్నికల కమిషన్‌ను పావుగా వాడుకునే ప్రయత్నం చేసింది. బీహార్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ మీద ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వుంది. నీతీష్ పాలన అంటే అవినీతి పాలన అన్న పేరు తెచ్చుకుంది . బీహార్‌కు ఎవరు సరైన ముఖ్యమంత్రి అన్న సర్వేలలో ఇండియా కూటమి తేజస్వీయాదవ్ ముందుండగా, నితీష్‌కుమార్ వెనుకపడుతున్నారు.

బీహార్‌లో మార్పు తథ్యం అన్న ప్రచారం నేపథ్యంలో మోదీ సర్కార్ అక్కడ విజయం సాధించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ధరలకు ఉపశమనంగా ఈ ఎన్నికల ముందు జీఎస్టీ తగ్గింపు ప్రకటించారు. మోదీ తరచుగా బీహార్‌లో పర్యటిస్తూ ఆ రాష్ట్రానికి వరాల వర్షం కురిపిస్తున్నారు. ఈ డబుల్ ఇంజన్ సర్కారు ప్రభుత్వ సొమ్ముతో ప్రత్యక్షంగా ఓట్ల కొనుగోలుకు దిగింది. మోదీనే రంగంలోకి దిగి 75 లక్షల మంది మహిళలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో పది వేల రూపాయలు నగదు బదిలీ చేయించారు. ఇక నితీష్‌కుమార్ ఆ రాష్ట్రంలో రకరకాల ఉద్యోగులకు జీతాల పెంపు చేశారు. అనేక ఆర్థిక ప్రలోభాలను రోజూ ప్రకటిస్తూ వచ్చారు.

2019లో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎన్నికలను ఎదుర్కోనేందుకు 90 లక్షల మంది మహిళలకు "పసుపు-కుంకుమ" పథకం పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి పది వేల కోట్ల నగదు బదిలీ చేశారు. అప్పుడు కూడా సరిగ్గా ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ప్రభుత్వం సొమ్ముతో ప్రత్యక్షంగా ఓటర్లను ప్రలోభపెట్టారు. కాని, ఆ ఎన్నికల రణతంత్రం ఆయనకు కలిసి రాలేదు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు పార్టీని కేవలం 23 సీట్లకే పరిమితం చేసి ఘోరంగా ఓడిరచారు. ఇలాంటి ప్రలోభాలు అన్ని వేళలా పని చేయవని తేలింది. బీహారు ప్రజలు ఈ ఎన్నికల కుతంత్రాలపై ఎలాంటి తీర్పునిస్తారో వేచి చూడాల్సిందే ! ❑

- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977

# ఆధునిక ముసుగుల్లో కులం !



- యోగేంద్ర యాదవ్

ఇటీవలి మూడు సంఘటనలు నాకు పాతికేళ్ళ క్రితం విన్న 'గుడ్‌చనా'(పల్లీబెల్లం) కథనాన్ని గుర్తుచేశాయి. నాకు పరిచయం ఉన్న ఒక ఉత్సాహవంతుడైన దళిత విద్యార్థి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణుడై అధికారిగా చేరాడు. అతని వివాహం తర్వాత కొంత కాలానికి అతన్ని నేను కలుసుకున్నాను. అతని భార్య సాపేక్షంగా ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి. 'ఎస్సీ' ట్యాగ్ వదిలేసి అధికారుల సాధారణ సమాజంలో కలిసిపోవాలని ఆమె ఆసక్తి చూపింది. అతనూ బహుశా అలాగే అనుకొని ఉండవచ్చు. నేను అతని మారిన స్వభావంపై వ్యాఖ్యానించే ముందే, అతను సిగ్గుపడుతూ "అడ్జస్ట్‌మెంట్ చేసుకున్నాను సార్" అన్నాడు. ఈ మాట పైకి సాధారణంగా కనిపించినా – ఇది సర్దుబాటు, అనుసరణ, లొంగిపోవడం వరకు దేనినైనా కవర్ చేస్తుంది.

రెండేళ్ళ తరువాత అతని ఇంటికి మళ్ళీ వెళ్ళాను. డ్రాయింగ్ రూమ్‌లో అంబేడ్కర్ చిత్రపటం చూసి ఆశ్చర్యపోయాను. నా కళ్లలోని ప్రశ్నను గమనించి, నేను అడగకముందే అతను ఆ పల్లీ చెక్క కథ చెప్పాడు. వారి మొదటి బిడ్డ నడవడం మొదలుపెట్టిన రోజు అధికారుల కాలనీలోని వారితో అతనూ, అతని భార్యా తమ సంతోషాన్ని పంచుకున్నారు. వారి ఆచారం ప్రకారం ఆ తీపిపదార్థాన్ని పంచారు. సాయంత్రం నడకకు వెళ్లినప్పుడు, ఒకరిద్దరు పొరుగువారు వీరు ఇచ్చిన 'గుడ్–చనా'ను బయట చెత్తకుప్ప మీద పడేసినట్టు గమనించారు. ఎవరూ ఏమీ అనలేదు, ఏ కుల దూషణా లేదు. అయినా, ఒక్క క్షణంలో ఈ దంపతులకు సామాజిక సత్యం తెలిసిపోయింది. వదిలించుకోవాలనుకున్నా ఆ ట్యాగ్ వారిని వదలదు. కాబట్టి, వారు దాన్ని మళ్ళీ ఆలింగనం చేసుకున్నారు.

ఈ ఘటన మూడు విషయాలు స్పష్టం చేస్తున్నది. మొదటిది, కులం మన గతం మాత్రమే కాదు. అది మన ప్రస్తుత జీవిత వాస్తవికత. అంతేకాదు, భవిష్యత్తులో కూడా భాగమయ్యేది. రెండవది, ఇది గ్రామీణ లేదా 'వెనుకబడిన' ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాదు. ఆధునిక సమాజంలో కులం కొత్త ముసుగులు ధరిస్తోంది. కుల ఆధారిత వివక్ష, అణచివేత అనేక పొరల్లో చుట్టబడి వస్తున్నది. మూడవది, కులం అంటిపెట్టుకొని ఉంటుంది, దాని ప్రభావాలను తొలగించడం అంత సులభం కాదు. కుల అసమానతలను ఎదుర్కోవడానికి విద్య, ఉద్యోగాలు అవసరమే కానీ, అవి మాత్రమే సరిపోవు.



ఈ మూడు పాఠాలూ ఇటీవలి మూడు ఘటనల తర్వాత నాకు మళ్లీ గుర్తొచ్చాయి. రాయ్‌బరేలీలో హరిఓమ్ వాల్మీకి హత్య, చండీగఢ్‌లో ఐపీఎస్ అధికారి వై.పూరన్‌కుమార్ ఆత్మహత్య, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ మీద బూటు విసిరే ప్రయత్నం. ఈ మూడూ భిన్నమైన సంఘటనలు. ఈ ముగ్గురు వ్యక్తులూ చాలా భిన్నస్థాయిల్లో ఉన్నవారు.. వారందరూ దళితులు అనేది తప్ప. అయితే, బాధితులు దళితులు అనే వాస్తవం ఒక్కటే ఈ మూడు వేర్వేరు ఘట్టాలను 'కుల ఆధారిత అణచివేత' కేటగిరీలోకి తేలేదు. హరి ఓమ్‌ను దళితుడు అని కాక, దొంగగా అతడిని అనుమానించిన గుంపునకు సరిగ్గా సమాధానాలు చెప్పలేకపోయాడు కాబట్టి చంపేశారు. గవాయ్ మీద దాడి చేసినవాడు కూడా ఎదుటివారి కులాన్ని ప్రస్తావించలేదు, కానీ హిందూత్వానికి అవమానం అని అన్నాడు. అధికారవర్గం గుసగుసల ప్రకారం, ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ అతను తన ఆత్మహత్య లేఖలో పేర్కొన్న కుల వివక్షకంటే, వృత్తిగత, అంతర్గత పోటీకి ఎక్కువగా బలైపోయాడు. ఇదీ, ప్రధాన, ప్రాబల్య ఆలోచనాధోరణి మనల్ని నమ్మమని చెబుతున్నది. ఈ మోసపు పొరను తొలగించాలంటే మనం ఒక కాల్పనిక ప్రశ్న వేయాలి. ఈ వ్యక్తులు దళితులు కాక పోతే వారు అదే గతిని పొందేవారా ? తనను దొంగ అని అనుమానించిన గుంపు మధ్యలో హరిఓమ్ నిలబడి, నేను ఠాకూర్‌ని అని అరిచాడను కుందాం. అవమానం, దెబ్బల నుంచి అతను తప్పించుకోలేకపో వచ్చు కానీ, ఏకంగా చంపేస్తారా ? ఎవరూ రక్షించడానికి ముందుకురాని స్థితి ఉంటుందా ? అతని శరీరం

**(మిగతా తొమ్మిదో పేజీలో)**

# ఆర్‌ఎస్‌ఎస్ - స్వాతంత్ర్య పోరాటం



- మృదులా ముఖర్జీ

**ఒక సంస్థగా 1925 నుంచి 47 మధ్య కాలంలో ఆర్‌ఎస్‌ఎస్ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన ఏ ఉద్యమంలోనూ భాగస్వామి కాలేదు. నేడు తిరుగులేని దేశభక్తులుగా తమకు తాము కితాబులిచ్చుకుంటున్న రాజకీయ పక్షం దేశంలో ఉత్తుంగతరంగంలా ఎగిసిన వలస ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో వీసమెత్తు పాత్ర పోషించలేదని తెలిస్తే విస్మయం చెందక తప్పదు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త గోల్వాల్కర్ ఏకంగా బ్రిటిష్ వ్యతిరేక జాతీయవాదం హానికరమని ప్రకటించారు.**

"భౌగోళిక జాతీయవాదం, ఉమ్మడి శత్రువు అన్న భావనల పునాదిగా నిర్మితమైన భారత జాతీయత హిందూ జాతీయతలోని సానుకూల అంశాలు, ప్రేరణ పొందాల్సిన అంశాలను మరు గున పడేసింది. దాంతో దేశంలో జరుగుతున్న "అనేక జాతీయో ద్యమాలు" బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలుగా మిగిలి పోయాయి. బ్రిటిష్ వ్యతిరేకతే దేశభక్తిగా, జాతీయవాదంగా గుర్తించబడింది. ఈ ప్రతీఘాత జాతీయవాదమే యావత్ స్వాతంత్ర్యోద్యమం నడకనూ, దానికి నాయకత్వం వహించిన వారినీ, ప్రజలనూ ప్రభావితం చేసింది. (బంచ్ ఆఫ్ థాట్స్, పే. 152-153)"

కానీ నిజాలు ఇలా ఉన్నాయి : హిందూ మహాసభకు, జన సంఘ్‌కు, ఆ తర్వాత భారతీయ జనతా పార్టీకి సైద్ధాంతికంగా, నిర్మాణపరంగా వెన్నుదన్నుగా ఉన్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను కేబీ హెగ్డేవార్ 1925 సెప్టెంబరు 25న ప్రారంభించారు. అప్పటి నుంచి 1947 వరకూ దేశంలో కాంగ్రెస్, మరో పార్టీ లేదా స్వాతంత్ర్యోద్యమంలో బలిదానాలు గావించిన ఏ బృందమైనా ఇచ్చిన బ్రిటిష్ వ్యతిరేక పోరాటాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నడూ భాగస్వామి కాలేదు.

తనంతట తానుగా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ ఉద్యమానికి పిలుపు ఇవ్వలేదు. ఏ ఒక్క ఉద్యమాన్ని నిర్మించలేదు. కనీసం అకాలీలు 1924-25లో గురుద్వారాల సంస్కరణ ఉద్యమానికైనా సిద్ధమైంది. కానీ ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం కార్యాచరణకు కూడా సిద్ధం కాలేదు. లేదా ఆ కాలంలో



విప్లవకారులు చేపట్టినట్లు బ్రిటిష్ అధికారులను హతమార్చే చర్యలకు కాని, గదర్ వీరుల తరహాలో తిరుగుబాటు కోసం కాని, వలసదారుల్లోనూ, సైన్యంలోనూ ప్రభుత్వ వ్యతిరేకత పెంపొందించేందుకు కాని ప్రయత్నం కూడా లేదు. జాతీయతే తమ ధర్మమని చెప్పుకుంటున్న వీరి గత చరిత్రను చూస్తే తలెత్తే ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి.

**జాతీయోద్యమానికి దూరంగా ఉండి కూడా జాతీయ వాదులమని చెప్పుకోగల ఘనత..**

ఆర్‌ఎస్‌ఎస్ ఆశయం, ఆచరణ అంతా ఒంటెత్తు పోకడతో కూడిన ధార్మిక జాతీయవాదమన్న వాస్తవాన్ని గ్రహించినప్పుడు పై ప్రశ్నలకు సమాధానాలు గుర్తించటం తేలికే. మన వారసత్వమైన జాతీయోద్యమం ఈ ధార్మిక జాతీయవాదాన్నే మతోన్మాదమని గుర్తించింది. అది భారత జాతీయవాదం కాదని స్పష్టం చేసింది.

ఆర్‌ఎస్‌ఎస్ మౌలిక లక్ష్యం ఒక్కటే. ముస్లిం ఆధిపత్యం బూచిని చూపించి హిందూ సమాజాన్ని ఐక్యం చేయటం, ఆ పేరుతో హిందూ సమాజాన్ని తన మతోన్మాద రాజకీయాల వైపు ఆకర్షించటం. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు కేబీ హెగ్డేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రారంభించటానికి ముందు నాగపూర్‌లో కాంగ్రెస్‌లో ఓ మధ్యంతర శ్రేణికి చెందిన నాయకుడు కూడా. సహాయ నిరాకరణ ఉద్యమంలో జైలుకు కూడా వెళ్లారు. అయితే అప్పట్లో హిందూ మహాసభ నాయకుడుగా ఉన్న బీఎస్ మూంజేకు గట్టి అనుయాయులుగా హెగ్డేవార్ ఉన్నారు. మూంజే ఇటలీ వెళ్లి ముస్సోలిని కూడా కలిసి వచ్చారు. ఇటలీలోని ఫాసిస్టు సంస్థలను అధ్యయనం చేశారు. వాటి నిర్మాణం, పనితీరు చూసి స్ఫూర్తి పొందారు. మూంజే 1923లో వీడీ

సావర్కార్ ప్రచురించిన హిందూత్వ గ్రంథం నుంచి స్ఫూర్తి పొందారన్న అభిప్రాయం ఉంది. ఆ పుస్తకం 1923లో పుస్తక రూపంలో వచ్చినా అంతకుముందే చెలామణిలో ఉంది. ఈ పుస్తకంలోనే హిందూత్వ మౌలిక సిద్ధాంతం వివరించారు సావర్కార్. భారతదేశం హిందువులకు మాత్రమే చెందిన దేశం, పుణ్యభూమి, పితృభూమి భారతదేశం అయిన వారే హిందువులు, ముస్లింలకు ఈ దేశంలో స్థానం లేదు. క్రైస్తవులకు స్థానం లేదు. ఈ ప్రమాణాల్లో ఇమిడే వాళ్లే భారతీయులు.

ఆర్ఎస్ఎస్ ఏర్పడిన రెండేళ్లకే దేశంలో సైమన్ వ్యతిరేక ఉద్యమం పెల్లుబికింది. కానీ ఈ ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ మచ్చుకు కూడా కనిపించలేదు. మరికొంత కాలం తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడిగా లాహోర్‌లో జరిగిన వార్షిక కాంగ్రెస్ సమావేశాల్లో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యమని ప్రకటించారు. 1930 జనవరి 26వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకోవాలని, దేశంలో గ్రామ గ్రామాన త్రివర్ణపతాకాన్ని ఎగురవేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ సందర్భంగా ప్రజలందరూ ప్రతిజ్ఞ పూనాలని కూడా నిర్ణయించబడింది. ఆర్ఎస్ఎస్ కూడా సంపూర్ణ స్వాతం త్ర్యం లక్ష్యానికి కట్టుబడి ఉంది కాబట్టి జెండా ఎగురవేస్తామని అయితే తాము ఎగురవేసే జెండా త్రివర్ణపతాకం కాదని, కాషాయ ధ్వజమని హెగ్డేవార్ ప్రకటించారు. తాము జాతీయవాదులమని చెప్పుకుంటూనే అసలైన జాతీయోద్యమాని కి దూరంగా ఉండే ఆర్ఎస్ఎస్ స్వభావానికి ఇది చక్కని ఉదాహరణ. Insult to Freedom Struggle, Says Opposition as Modi Glorifies RSS in Independence Day Speech.

ఇదేవిధంగా అదే సంవత్సరం శాసనోల్లంఘనోద్యమం జరుగుతున్నప్పుడు – ఈ ఉద్యమంలో తాను వ్యక్తిగా పాల్గొంటానని, ఓ సంస్థగా ఆర్ఎస్ఎస్ ఈ ఉద్యమానికి దూరంగా ఉంటుందని హెగ్డేవార్ ప్రకటించారు. తన నిర్ణయానికి అనుగుణంగానే హెగ్డేవార్ ఆర్ఎస్ఎస్ అధినేత పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగతంగా తాను జాతీయవాదిని అని చెప్పుకోవడానికి తాను జైలుకు కూడా వెళ్లారు. ఆ విధంగా జైళ్లల్లో ఉన్న కాంగ్రెస్ శ్రేణులను ఆర్ఎస్ఎస్ వైపు ఆకర్షించేందుకు హెగ్డేవార్ ప్రయత్నించారని ఆయన జీవిత చరిత్ర రచయిత రాశారు.

దేశంలో బ్రిటిష్ పాలనను వ్యతిరేకించేందుకు హెగ్డేవార్ సుముఖంగా లేకపోగా వలస పాలనను ఓ అనూహ్య ఘటనగా వర్ణించారని చెప్పేందుకు ఆధారాలు వున్నాయి. 1939లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి సుభాష్ చంద్రబోస్‌ను కలవడానికి కూడా హెగ్డేవార్ సిద్ధం కాలేదన్నది కూడా వాస్తవమే. సుభాష్ చంద్రబోస్ 1939లో హెగ్డేవార్ మిత్రుడైన గోపాల్ ముకుంద్ హుద్దార్‌ను బొంబాయిలో కలిసి తనకు హెగ్డేవార్‌తో భేటీకి అవకాశం కల్పించమని కోరారు. సుభాష్ కోరిక మేరకు హుద్దార్ దియోలాలి వెళ్లారు. ఆ సమయంలో హెగ్డేవార్ తన ఓ సంపన్నుడైన మిత్రుని ఆశ్రయంలో ఉన్నారు. హెగ్డేవార్‌కు సుభాష్ కోరిక తెలియచేసి వెనక్కు వచ్చిన హుద్దార్ చూడ్డానికి ఆయన చాలా మందితో ఉల్లాసంగా మాట్లాడుతూ ఆరోగ్యపరంగా కుశలంగానే ఉన్నట్లున్నారు. కానీ ఆరోగ్యం బాగాలేదు అన్న సాకుతో బోసు అభ్యర్ధనను తిరస్కరించారని తెలిపారు. ఈ మధ్యకాలంలో వెలువడుతున్న హిందూత్వ నేతల గురించిన వ్యాఖ్యానాల్లో ఈ విషయానికి ఎక్కడా తావుండదు.

**హిందూ మహాసభను విమర్శించిన సుభాష్ చంద్రబోస్..**

సుభాష్ చంద్రబోస్‌ను 1940ల్లో హిందూ మహాసభ అధ్యక్షుడుగా ఉన్న సావర్కార్ కలిసిన విషయం గురించి చిలువలు పలువలుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారం ఎక్కడి వరకూ వెళ్లిందంటే, అప్పట్లో రెండో ప్రపంచ యుద్ధంలో ఓ శిబిరంగా ఉన్న జర్మనీ, జపాన్‌లను కలిసి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు సిద్ధం కావాల్సిందిగా సావర్కారే సుభాష్ చంద్రబోస్‌కు సలహా ఇచ్చారని చెప్పేదాకా. పైగా బోసుకు, భగత్‌సింగ్‌కు, ఖుదీరాం బోసుకు కూడా సావర్కారే ప్రేరణ అని కూడా వింత వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. సుభాష్ చంద్రబోస్ కుటుంబ సభ్యులు, ఇతర విప్లవకారుల వారసులు, మరి కొంత మంది వ్యాఖ్యాతలు ఈ ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టారు. సావర్కార్ పట్ల సుభాష్ చంద్రబోస్ ఎంత కటువుగా ఉండేవాడో బోస్ చరిత్ర నుంచి కొన్ని పేజీలు, అధ్యాయాలు తిరగేసి మరీ హిందూత్వవాదుల ప్రచారానికి అడ్డుకట్ట వేశారు.

**చారిత్రక వాస్తవాలు ఇలా ఉన్నాయి :**

1940ల్లో బోస్ అరెస్టు కావడానికి ముందు సావర్కార్‌ను, జిన్నాను కలిశారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐక్య సంఘటన నిర్మిద్దామని ప్రతిపాదించారు. ఈ విషయాన్ని బోస్ తన స్వీయ చరిత్ర నా పోరాట చరిత్ర రెండో భాగంలో వివరించారు. ఆ సమయంలో జిన్నా బ్రిటిష్ సహకారంతో స్వతంత్ర పాకిస్తాన్ కలను సాకారం చేసుకునే విషయం ఆలోచిస్తుంటే సావర్కార్ మాత్రం ప్రపంచ పరిణామాల గురించి ఏ మాత్రం ధ్యాస లేకుండా ఆర్ఎస్ఎస్ శ్రేణులు బ్రిటిష్ సైన్యంలో చేరటం ద్వారా సాయుధ శిక్షణ పొందవచ్చన్న ఆలోచనతో ఉండిపోయారని స్పష్టం చేశారు. ఖైదీగా వున్న కాలంలో సావర్కార్ రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు. జైలు నుంచి 1937లో విడుదల కాగానే ఆయన్ను హిందూ మహాసభ అధ్యక్షుడిగా

ఎన్నుకోవటం, ఆరేళ్లపాటు ఆయన ఆ బాధ్యతల్లో కొనసాగటం ఈ విషయాన్ని ధృవీకరిస్తుంది. చివరికి అనారోగ్యంతో ఆయన తన బాధ్యతలు విడనాడాల్సి వచ్చింది. తొలుత అండమాన్ జైలు నుంచి తర్వాత ఎరవాడ జైలు నుంచి సావర్కార్‌ను విడుదల చేయటానికి ముందు ఆయన విస్పష్టంగా తాను బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఏ రాజకీయ కార్యాచరణలోనూ భాగస్వామిని కానని రాతపూర్వక హామీ ఇచ్చారన్నది చరిత్ర నమోదు చేసిన సత్యం.

**సావర్కార్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతం..**

ఆయన తన దైనందిన కార్యకలాపాలు నడుపుకోవడానికి పారితోషికం కూడా ముట్టేది. హిందూ మహాసభ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సావర్కార్ ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. హిందువులు, ముస్లింలు రెండు వేర్వేరు జాతులని ఆయన తీర్మానించారు. ఈ విషయంలో జిన్నాకంటే ముందే సావర్కార్ ఈ రాగం అందుకున్నారు. తర్వాతనే జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని అనుసరించటం మొదలుపెట్టారు. హిందూ మహాసభ అధ్యక్షుడిగా ఆయన చేసిన ఉపన్యాసాలన్నింటా ముస్లిం వ్యతిరేకత, కాంగ్రెస్ వ్యతిరేకత, గాంధీ వ్యతిరేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి.

రెండో ప్రపంచయుద్ధం మొదలైన తర్వాత బ్రిటిష్ పాలన పట్ల ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ అభిప్రాయాల్లోని తేడాలు, వైరుధ్యాలు స్పష్టంగా వెల్లడయ్యాయి. దేశంలో రాజకీయ పక్షాల అభిప్రాయాలు తెలుసుకోకుండానే భారతదేశాన్ని యుద్ధంలో భాగస్వామిని చేస్తూ బ్రిటిష్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ మంత్రి మండలులు రాజీనామా చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీలను మతోన్మాద శక్తులు భర్తీ చేశాయి. తన స్వభావానికి తగ్గట్టుగానే ముస్లిం లీగ్ కూడా ప్రభుత్వాల ఏర్పాటులో సహకరించేందుకు సిద్ధమైంది.

ఈ ప్రయత్నంలో తాను కూడా వెనకంజ వేసేది లేదన్నట్లు హిందూ మహాసభ అధ్యక్షుడిగా ఉన్న సావర్కార్ 1939లోనే ఒకవేళ కాంగ్రెస్ మంత్రి వర్గాల నుంచి వైదొలగితే తాము ఆ స్థానాన్ని భర్తీ చేయానికి సిద్ధమని, హిందువులు, బ్రిటిష్ ప్రభుత్వం మిత్రులని ప్రకటించారు. (అప్పటి వైస్రాయి బ్రిటిష్ ప్రభుత్వంలో హోం మంత్రికి జెట్‌లాండ్‌కు రాసిన లేఖ, 7 అక్టోబరు 1939, జెట్‌లాండ్ పత్రాలు, 18వ సంపుటి. రీల్ 9).

బ్రిటిష్ వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని, ఈ నిర్ణయాన్ని సామ్రాజ్యవాదంతో మిలాఖత్ కావటంగా ప్రచారం చేసే మూర్ఖుల మాటలు వినొద్దని సావర్కార్ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. సైన్యంలో కూడా చేరాలని ఆయన హిందువులకు పిలుపునిచ్చారు. సైన్యంలో ముస్లింల పాత్ర ఆహ్వానించదగినది కాదని, హిందువులను సైనిక విద్యల్లో సిద్ధహస్తులను చేయాలన్న తన సైద్ధాంతిక అవగాహనకు కొనసాగింపుగానే సావర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ అవగాహనకు లోబడే హిందూమహాసభ ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాల్లో చేరింది. కొన్నిచోట్ల ముస్లిం లీగ్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేయటానికి వెనకాడలేదు.

బెంగాల్‌లో ఫజులుల్ హక్ నేతృత్వంలోని ప్రభుత్వంలో హిందూమహాసభ నేత శ్యాం ప్రసాద్ ముఖర్జీ మంత్రిగా కూడా వ్యవహరించారు. 1940 ముస్లిం లీగ్ వార్షిక సమావేశాల్లో ఫజులుల్ హక్ స్వతంత్ర పాకిస్తాన్ తీర్మానం ప్రతిపాదించిన నాయకుడు. 1942లో కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం జాతీయోద్యమాన్ని దారుణంగా అణచివేసి నాయకులందరినీ జైళ్లల్లో కుక్కుతున్న తరుణంలో అటు హిందూ మహాసభ, ఇటు ముస్లిం లీగ్‌లు రెండూ అధికార భాగస్వామ్యంలో తలమునకలై ఉన్నాయి.

నిజానికి క్విట్ ఇండియా ఉద్యమం తరహాలో కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తుందని ఊహించిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ బ్రిటిష్ ప్రభుత్వానికి రాసిన లేఖలో "అటువంటి ఉద్యమాన్ని ఏ ప్రభుత్వమైనా విచక్షణ లేకుండా అణచివేయాలి. కాంగ్రెస్ ఎంతగా ప్రయత్నించినా బెంగాల్‌లో ఈ ఉద్యమం వేళ్లూనుకోకుండా చూస్తాము" అని రాశారు. (ఈ విషయంలో శ్యామప్రసాద్ ముఖర్జీ తమకు అత్యంత కీలకమైన భాగస్వామి అని అప్పట్లో ఢాకా విశ్వవిద్యాలయంలోనూ, శాంతినికేతన్‌లో అధ్యాపకుడుగా పనిచేస్తున్న గెసెప్పో తుక్కి వ్యాఖ్యానించారు. తుక్కి బెంగాల్‌లో ఫాసిస్టు సిద్ధాంతం వ్యాప్తికి కృషి చేసిన ప్రముఖుల్లో ఒకరు. కసోలరి రాసిన ఇన్ ది షాడోస్ ఆఫ్ స్వస్తిక పుస్తకం నుంచి).

**ముస్లిం లీగ్‌తో ప్రభుత్వాలు ఏర్పాటు చేయటానికి వెనకాడని హిందూ మహాసభ..**

రెండో ప్రపంచ యుద్ధకాలంలో సింధ్ రాష్ట్రంలోనూ, వాయువ్య రాష్ట్రంలోనూ ముస్లిం లీగ్‌తో కలిసి ప్రభుత్వాలు ఏర్పాటు చేయటానికి హిందూ మహాసభ ఏ మాత్రం వెనకాడలేదు. 1940 నాటికే పాకిస్తాన్ ఏర్పాటు తమ లక్ష్యమని ముస్లిం లీగ్ ప్రకటించింది. ఇంకా చెప్పాలంటే సింధ్ అసెంబ్లీలో జీఎం సయ్యద్ ప్రతిపాదించిన 'భారతదేశంలోని ముస్లింలు వేరే జాతి' అన్న తీర్మానాన్ని ఆమోదించిన మంత్రివర్గంలో హిందూ మహాసభ కూడా భాగస్వామి.

హిందూ మహాసభ ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు చేసిన మాట నిజమే. కానీ ప్రభుత్వం నుంచి రాజీనామా చేసేందుకు మాత్రం సిద్ధం కాలేదు. అటు ముస్లిం లీగ్, ఇటు హిందూ

మహాసభ బ్రిటిష్ వారికి స్నేహ హస్తం అందిస్తూ కాంగ్రెస్‌ను శత్రువుగా చూడటం, అదే సమయంలో తమను తాము జాతీయవాదులుగా ప్రకటించుకోవటం ఆసక్తికరమైన విషయం. హిందూ మహాసభ హిందూ జాతీయవాదాన్ని ముందుకు తెస్తే ముస్లిం లీగ్ ముస్లిం జాతీయవాదాన్ని ముందుకు తెచ్చింది.

ఎవరు ఏమి చెప్పుకుంటున్నప్పటికీ వలస కాలం నాటి భారత చరిత్రకు సంబంధించినంత వరకూ జాతీయోద్యమం ప్రధాన స్రవంతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ బ్రిటిష్ వలస పాలన ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారు. ముస్లిం లీగ్, హిందూ మహాసభలు మాత్రం మతోన్మాద రాజకీయాలను విస్తరించే లక్ష్యంతో పని చేశాయన్నది అక్షర సత్యం. ఈ మతోన్మాద శక్తులు బ్రిటిష్ వారికి ఎంతగా వత్తాసు పలికినా 1946లో జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూడక తప్పలేదు. అన్ని రాష్ట్రాల్లో కలిపి మూడు సీట్లు మాత్రమే గెలిచారు మతోన్మాదులు. (1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 489 స్థానాలకు ఎన్నికలు జరిగితే హిందూ మహాసభ గెలిచింది కేవలం 10 సీట్లు మాత్రమే) ఈ విధంగా హిందువులతో సహా దేశమంతా ఈ మతోన్మాద శక్తులను సంపూర్ణంగా తిరస్కరించటంతో గంగవెర్రులెత్తిన హిందూ మతోన్మాదులు తమ గాంధీని హత్య చేయటం ద్వారా తమ తిరస్కారానికి ప్రతీకారం తీర్చుకున్నారు.

ఆర్ఎస్ఎస్ కూడా 1930-32 మధ్యకాలంలో దేశాన్ని కుదిపేసిన శాసనోల్లంఘన ఉద్యమంలో భాగస్వామి కాలేదు. తర్వాత జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలోనూ భాగస్వామి కాలేదు. జాతీయత, జాతీయవాదం గురించిన ఆర్ఎస్ఎస్ వాగాడంభరంతో ఆ సంస్థ పట్ల ఆకర్షితులైన యువతకు మాత్రం రానున్న మహత్తర పోరాటానికి వీలుగా తమ శక్తియుక్తులు పదిలపర్చుకోవాలని ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చింది. ఆర్ఎస్ఎస్ గురించి హోం శాఖ రూపొందించిన నివేదికలో "(1942 నాటి) ఉద్యమం సందర్భంగా జరిగిన ఓ సంఘ్ సమావేశంలో సంఘ్ శ్రేణుల్లో కాంగ్రెస్ పిలుపుకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. ఆయా శ్రేణులు ఈ నిర్ణయాన్ని అమలు చేశాయి" అని నివేదించింది.

అప్పటి బొంబాయి రాష్ట్ర హోం కార్యదర్శి హెచ్‌వీఆర్ అయ్యంగార్ 1944 ఫిబ్రవరి 16న రాసిన లేఖలో "సంఘ్ తనను తాను చట్టం కట్టుబాటుకు లోబడి ఉంచుకుంది. ప్రత్యేకించి 1942లో మొదలైన అల్లర్లలో పాల్గొనకుండా దూరంగా ఉంది. (హోం డిపార్ట్‌మెంట్ (ప్రొసీడింగ్స్) 28/08/1942(పొలిటికల్(1) ఫైల్ 28/03/1943 (పొలిటికల్(1)".

చివరి మాటగా చెప్పాలంటే ఒక సంస్థగా ఆర్ఎస్ఎస్ 1925-47 మధ్యకాలంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఏ పోరాటంలోనూ, ఉద్యమంలోనూ పాల్గొనలేదు అని నిర్ధారించవచ్చు. కానీ, 1946లో దేశంలో మతకల్లోలాలు పరాకాష్ఠకు చేరినప్పుడు మాత్రం ఆర్ఎస్ఎస్ అకస్మాత్తుగా తెర మీదకు వచ్చింది. ఈ పోరాటం కోసమే ఆర్ఎస్ఎస్ ఎంత కాలంగానో ఎదురుచూస్తోంది. మతోన్మాద కలహాలు చెలరేగుతున్నప్పుడు హిందువులను సంరక్షించే సంస్థగా తనను తాను చిత్రీకరించుకోవటం తేలికైన పని. దేశ విభజనకు ముందు, తర్వాత జరిగిన మతకల్లోలాల సమయంలో ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేసిన రెచ్చగొట్టుడు ప్రసంగాలు, రచనలకు సంబంధించి ఎన్నో సాక్ష్యాధారాలు ఉన్నాయి.

మహాత్మగాంధీయే మతోన్మాద శ్రేణులకు ప్రధాన లక్ష్యంగా మారారు. ఆయన ముస్లింలను మచ్చిక చేసుకోవడానికి ఎన్నో తప్పుడు పనులు చేశారని దుష్ప్రచారం జరిగింది. త్రివర్ణపతాకం జాతీయ పతాకంగా తిరస్కరిస్తూ 1947 ఆగస్టులో ఆర్గనైజర్‌లో వ్యాసాలు రాశారు. చివరకు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ కూడా ఈ దేశానికి త్రివర్ణపతాకం జాతీయ పతాకం కాదని, కాషాయ జెండా లేదా భాగ్వాధ్వజమే హిందువుల నుంచి గౌరవం అందుకోగలిగిన జెండా అని ప్రకటించారు. శ్యామ్ ప్రసాద్ మాటల్లో "మూడు అన్నది దుర్లక్షణం. మూడు రంగుల జెండా అంటే ఈ దేశానికి ఎప్పుడైనా నష్టజాతకమే."

## 2002 వరకూ జాతీయ జెండా ఎగురవేయని ఆరెస్సెస్..

ఆర్ఎస్ఎస్ తన విశ్వాసాలకు అనుగుణంగానే 2002 వరకూ ఎన్నడూ జాతీయజెండా ఎగురవేయలేదు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో అనేక ఒత్తిళ్ల నడుమ త్రివర్ణపతాకం ఎగురవేయటానికి సిద్ధమైంది.

వలసపాలన నుంచి ఎన్నో వ్యయ ప్రయాసలను కోర్చి సాధించుకున్నదీ స్వాతంత్ర్యమన్న అవగాహనతో చూసినప్పుడు 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో హిందువులు, ముస్లింలు భుజం భుజం కలిపి పోరాడిన దృశ్యాలు కళ్ల ముందు మెదులుతాయి. దాదాబాయి నౌరోజి, ఆయన సహచరులు ప్రతిపాదించిన సంపద తరలింపు సిద్ధాంతం మనల్ని కదిలిస్తుంది. ఈ సిద్ధాంతమే భారత జాతీయవాదానికి కావల్సిన ఆర్థిక పునాదులు సమకూర్చింది. జాతీయ కాంగ్రెస్ కేంద్రంగా అనేక విన్నూత్న ఉద్యమాలు కదలాడిన నేల కనిపిస్తుంది.

బెంగాల్, మహారాష్ట్ర, పంజాబ్‌లలో ప్రజలను వీధుల్లోకి తెచ్చిన విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమం, మహాత్మగాంధీ రాకతో రూపం, సారం మార్చుకున్న జాతీయోద్యమం, జలియన్ వాలాబాగ్ నరమేధం, గురు కథ మోర్చాల సందర్భంగా

అహింసాయుతంగా సాగిన అకాలీల యాత్రలు, బార్డోలి రైతుల సాహసం, వలస పాలకుల వెన్నులో చలి పుట్టించిన ఉప్పు సత్యాగ్రహం, క్షమాభిక్ష అడగటానికి సిద్ధంకాని భగత్ సింగ్, ఆయన సహచరులను ఉరితీయటంపై నోరు మెదపని దేశం, క్విట్ ఇండియా ఉద్యమ నినాదం, అజాద్ హింద్ ఫౌజ్ తిరుగుబాటు, ఎర్రకోటలో సాగిన విచారణలు నడుమ నూతన భవిష్యత్తును అన్వేషిస్తూ స్వతంత్ర భారతం 1947 ఆగస్టు 15న ప్రారంభించిన కొత్త జీవితం ఓ సినిమా పనోరమలా రీలు తిరుగుతుంది. నేడు తామే జాతీయవాదులమని గావుకేకలు పెడుతున్న వారికోసం బూతద్దం వేసి వెతికినా–పైన ప్రస్తావించిన సంఘటనలు, సందర్భాలు, పోరాటాల్లో ఎక్కడా కనిపించరు. ఈ వాస్తవం ఇలా ఉంటే ఇంటింటికీ త్రివర్ణ పతాకమంటూ స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల కోసం ఆర్భాటం చేస్తున్న వారికి ఈ స్వాతంత్ర్యం వేలు, లక్షల మంది బలిదానాలతో సిద్ధించిందన్న కనీస జ్ఞానం ఉన్నదా? అనే సందేహం తలెత్తుతుంది. ఇలా బలిదానం ఇచ్చిన వారికి స్ఫూర్తిగా నిలిచింది మతోన్మాద జాతీయవాద దృక్పథం కాదు. భారతీయతా జాతీయవాదమే.

లేదా కనీసం మహోత్తుంగ తరంగంలా ఎగిసిన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనకపోవటం తప్పే అన్న ఒక్క క్షమాపణ కానీ, జరిగిన లోపాలను గుర్తించి అంగీకరించే పెద్ద మనసు కానీ, మహాత్ముడిని హత్య చేసే స్థాయికి వెదజల్లిన మతోన్మాద విషబీజాలు, వాటి వలన కలిగిన నష్టం పట్ల కనీసం అపరాధ భావన కానీ, స్వాతంత్ర్య సాధన అనంతరం 55 ఏళ్ల పాటు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయటానికి మొరాయించిన ఆర్ఎస్ఎస్ తప్పిదం గురించి కానీ, కేవలం 1998లో కేంద్రంలో అధికారానికి వచ్చిన తర్వాత మాత్రమే జాతీయ జెండానే నెత్తిన పెట్టుకుంటున్న తీరు గురించి కానీ ఎక్కడైనా పల్లెత్తు ప్రస్తావన లేకపోవటం గమనిస్తోంది ఈ దేశం. ❑

**(అనువాదం: కొండూరి వీరయ్య)**

**(ది వైర్ తెలుగు సౌజన్యంతో)**

# ఆధునిక ముసుగుల్లో కులం !

**(4వ పేజీ తరువాయి)**

మరుసటిరోజు పోలీసులు వచ్చే వరకూ రోడ్డు మీద పడివుంటుందా? పోలీసులు అంత ఆలస్యంగా చర్య తీసుకుంటారా? హరి ఓమ్‌కు ఈ దుర్గతి పట్టడానికి అతడు ఓ దొంగ అన్న అనుమానం కాదు, అతడు వాల్మీకి కాబట్టి.

చీఫ్ జస్టిస్ గవాయ్ సంఘటనను తీసుకోండి. జడ్జి సామాజిక నేపథ్యం ఏదైనప్పటికీ, ఒక పిచ్చివాడు ఏ కోర్టులోనైనా ఇలాంటి పనిచేయవచ్చునన్నది వాస్తవం. కానీ, మానసికస్థితి సరిగా ఉన్న ఒక లాయర్ సీజేఐ కోర్టులో ఇలా చేస్తాడా ? సీజేఐ స్థాయిని తగ్గించే ఇతరత్రా ప్రాతిపదికలేమీ లేకపోతే ఈ ఘటన జరుగుతుందా? సదరు లాయర్ చెబుతున్న 'సనాతనానికి అవమానం' కేవలం మత సంప్రదాయానికి మాత్రమేనా, లేదా కుల హిందూ ఆధిపత్యం ఉపసందేశం కూడా అందులో ఉందా? మరోవిధంగా చెప్పుకోవాలంటే, సదరు న్యాయవాది ఎదుటివ్యక్తి మాటలకు మాత్రమే ప్రతిస్పందించాడా, లేదా ఎవరు అన్నదానిని బట్టి కూడా ప్రతిస్పందించాడా ? ఈ 'కుల వాద ద్వేషం ఉపరితల ప్రదర్శన' మన కాలంలో సాధారణమైపోయింది. ఈ సంఘటన డి.వై.చంద్రచూడ్ కోర్టులో జరిగి, దాడి చేసిన వాడు ముస్లిం అయితే మొత్తం దేశం ఇప్పటిలాగానే నిశ్శబ్దంగా ఉంటుందా ? హోమ్, జాతీయ భద్రతావ్యవస్థలు ఇలాగే ప్రతిస్పందిస్తాయా ? టీవీ చానెల్స్ రోజుల తరబడి దానిపై విందు చేసుకోవూ ? దాడి చేసిన వాడు వరుస ఇంటర్వ్యూలతో సులువుగా తప్పించుకోగలడా ? సోషల్ మీడియాలో అతన్ని సపోర్ట్ చేసే క్యాంపెయిన్లు ఊహించగలమా, ఈ ఘటనలో జరిగినట్టుగా..?. గవాయ్ రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించినా, సామాజిక వ్యవస్థలో ఆయన స్థానం మారలేదని ఈ ఘటన గుర్తు చేస్తోంది. పూరన్‌కుమార్ దళితుడు కాకపోతే ఏమవుతుంది? అధికారుల మధ్య పోటీ, తమకు గిట్టని గొంతుకల అణచివేత ఆ వ్యవస్థలో అరుదైనదేమీ కాదు. కానీ కుమార్ చివరి లేఖ అతని ఒంటరితనం, పైఅధికారుల వరుస అణచివేతల సత్యాన్ని చెబుతోంది.

కేవలం ధిక్కారం, భిన్నస్వరం అయినందువల్లనే అతడు ఈ ఒంటరితనం ఎదుర్కొన్నాడా లేక అందులో సామాజిక వెలి కూడా ఉందా? తన సామాజిక వర్గానికే చెందిన అధికారుల నెట్‌వర్క్ చుట్టూ ఉండి వుంటే అతను ఇదే పరిస్థితి ఎదుర్కొనేవాడా? ఈ ఘటనపై విస్తృత ఆందోళన, మీడియా కవరేజ్ జరిగింది. ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లనుంచి కాస్తంత ఆలస్యంగానే అయినా మద్దతు కూడా ఉంది.

కానీ, ఈ ఘటనలో కులం కోణంపై అంగీకారం, చర్చ లేవు. 'కులరహిత అధికారస్వామ్యం ఒక మిథ్య' అని ఈ సంఘటన మరోమారు నిరూపిస్తోంది. నేను చెప్పిన 'పల్లీ బెల్లం' ఘటన సదరు యువ అధికారి ఇంట్లో బాబాసాహెబ్ చిత్రపటం పునఃస్థాపనకు దారి తీసింది. మరి, ఈ మూడు ఘటనలు కులనిర్మూలన కోసం బాబాసాహెబ్ సంకల్పాన్ని తిరిగి అందుకొనేలా చేస్తాయా? ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**


# గాంధీజీ - ప్రజలు



- వి.రాంభూపాల్

**'ఇలాంటి ఓ వ్యక్తి ఈ భూ మండలం మీద రక్తమాంసాలు గల శరీరంతో మనుగడ సాగించారంటే ముందు తరాల వారు నమ్మలేకపోవచ్చు' మహాత్మాగాంధీ గురించి ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్న మాటలివి. 1891 నాటికే లండన్‌లో లా పట్టా పుచ్చుకుని, దక్షిణాఫ్రికాలో ప్రాక్టీసు చేసి, భారతదేశంలోని సాధారణ ప్రజల జీవితంతో తన జీవితాన్ని, జీవన విధానాన్ని మమేకం చేసిన మొట్ట మొదటి భారత జాతీయ నాయకుడు గాంధీజీ. దేశ ప్రజల అత్యంత ఆదరాభిమానాలు పొందిన మహోన్నతుడు గాంధీ. మహాత్ముడిగా, జాతిపితగా కీర్తి ప్రతిష్టలు పొందడం వెనుక మూడు కీలక అంశాలు వున్నాయని ప్రఖ్యాత చరిత్రకారుడు బిపిన్ చంద్ర తెలిపాడు.**

అవి ఒకటి.. హిందూ-ముస్లిం ఐక్యత, రెండు-అస్పృశ్యతా వ్యతిరేక పోరాటం, మూడు-మహిళల సామాజిక హోదా. ఈ మూడింటిలో దండలో దారంలాగా ప్రజలతో ఆయన పెనవేసు కున్న జీవన విధానం అత్యంత ప్రధానమైనది. నాయకులకు ప్రజలతో సరైన నిత్య సంబంధాలు వుండాలని గాంధీ బలంగా విశ్వసించాడు. తన విజ్ఞానానికి, ఆచరణకు, గుణపాఠాలకు ప్రజలే పునాది అని ఆయన తన జీవితాంతం నమ్మాడు, ఆచరించాడు. 'నాయకులు తమంతట తాము ఉద్యమాలను సృష్టించజాలరని, అందుకు భిన్నంగా ప్రజలే ఉద్యమ పరిస్థితులను సృష్టిస్తారని, అప్పుడు సరైన నాయకత్వాన్ని అందించడమే నిజమైన నాయకుల గొప్పతనమని' గాంధీ బోధించాడు. "ఒక డిమాండ్‌ను సాధించడం ముఖ్యం కాదు. దాన్ని ఎలా సాధించగలిగామన్నదే ముఖ్యం. ఇందులో అత్యంత ముఖ్యమైనదేమిటంటే ప్రజలు ఆ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారా లేదా అన్నదే" నాయకత్వ ప్రతిభకు కొలమానం అన్నాడు. సమాజ మార్పును, అందుకు ప్రధాన కారణమైన ఉత్పత్తి శక్తుల పాత్రను సరిగా అంచనా వేయడంలో ఆయనకున్న వర్గ దృక్పథం ప్రధాన కారణం. అయితే తన అభిప్రాయాలను ఎప్పటికప్పుడు మార్చుకోవడానికి ఆయన వెనుకాడేవారు కాదు. యంత్రాలు చెడ్డవని 1909లో చెప్పిన గాంధీ, 'ప్రజలందరి ఉపయోగం కోసం శాస్త్రం కనిపెట్టే ప్రతి



విషయాన్ని నేను ఆహ్వానిస్తాను' అని 1934లో ప్రకటించాడు. ప్రజల నుండి నేర్చుకోవడానికి ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చినందునే నిత్యమూ మార్పు చెందాడు. తనకు ఎదురయ్యే అన్ని సందేహాలకు, సమస్యలకు, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి, విమర్శలకు ఆచరణతో బదులు ఇవ్వడానికి ఆయన ఎంచుకున్న మార్గం ప్రజా మార్గం. దేశమంతటా విస్తారంగా పర్యటించాడు. అనేక జాతులు, కులాలు, మతాలు, విభిన్న తరగతుల వారితో సుదీర్ఘ చర్చలు చేశాడు. వాస్తవ పరిస్థితులను గుర్తించాడు, ప్రజలు పాల్గొనే పోరాట రూపాలను రూపొందించాడు. ప్రజలు చెక్కిన శిల్పంగా తనను తాను మలచుకున్నాడు.

## బాల్యం, సత్యాగ్రహ ప్రారంభం

మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో 1869 అక్టోబరు 2న కరంచంద్ గాంధీ, పుత్లీబాయిలకు నాలుగో సంతానంగా జన్మించాడు. బాల్యంలో శ్రవణుడు కథ, హరిశ్చంద్ర నాటకం తన జీవితాన్ని బాగా ప్రభావితం చేశాయని గాంధీ అనేక సందర్భాల్లో చెప్పుకున్నాడు. చిన్న పిల్లల మనస్సు మీద సాహిత్య, సాంస్కృతిక రంగాలు ఎంతటి ప్రభావం కలిగిస్తాయో గాంధీ బాల్యం మనకు నేర్పుతుంది. బ్రిటన్‌లో న్యాయశాస్త్ర విద్యను అభ్యసించాలనే ఆయన కోరికకు నాటి సాంప్రదాయాలు, ఆచారాలు అనేక ఆటంకాలు కలిగించాయి. చివరకు కుల బహిష్కరణకు కారణమయ్యాయి. తన తల్లి, అన్న, మిత్రుల సహకారంతో వీటిని అధిగమించి లండన్‌కు వెళ్లాడు. 1891లో లా పట్టా

పొంది, దాదా అబ్దుల్లా అండ్ కో అనే కంపెనీ కోర్టు కేసు కోసం దక్షిణాఫ్రికా వెళ్ళాల్సి వచ్చింది. అది గాంధీ జీవితాన్ని మార్చివేసింది. తాను అప్పటి వరకు ఊహిస్తున్న సమాజం వేరు, దక్షిణాఫ్రికాలో వలస వెళ్ళిన భారతీయుల కష్టాలు, జాతి వివక్ష, హీనస్థితి వేరు. అందరితో కలిసి నివసించడానికి, అందరు తిరగాడే రోడ్డుపై నడవడానికి భారతీయులకు అక్కడ వీలులేదు. భారతీయ ప్రజలు ఎదుర్కొం టున్న ఈ దారుణాలు గాంధీని తీవ్రంగా కలచి వేశాయి. 1893-94లో జాత్యహంకారానికి వ్యతిరేకంగా భిన్నమైన పోరాట రూపాన్ని ఎన్నుకున్నారు. అదే సత్యాగ్రహం, అహింస.

ప్రజల చైతన్య స్థాయి, అక్కడి వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు గాంధీ రాసుకున్నాడు. పదేళ్లపాటు అక్కడ నిర్వహించిన ఉద్యమాల్లో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పార్శీలు, గుజరాతీలు, దక్షిణ భారతీయులు, పై వర్గానికి చెందిన వర్తకులు, గని కార్మికులు ఇలా అందరూ పాల్గొనే రూపాలను ఆచరించాడు. ప్రజల ఐక్యతా బలాన్ని గాంధీ గుర్తించాడు. ఆచరణకు ఎంత ప్రాధాన్యత ఇచ్చాడో అధ్యయనానికి అంతే ప్రాధాన్యత ఇచ్చాడు. అబ్దుల్లా సేర్ ఇంగ్లీషులోకి అనువదించిన 'ఖురాన్'ను, క్రైస్తవ మతానికి చెందిన 'ది పర్ఫెక్ట్ వే' అనే గ్రంథాన్ని ఎంతో శ్రద్ధతో చదివాడు. రష్యాకు చెందిన లియో టాల్‌స్టాయి రచించిన "ది కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ విథిన్ యు' అనే గ్రంథం నన్ను ముగ్ధుణ్ని చేసింది. ఆ గ్రంథం నా మనస్సులో అంకితమైపోయింది. నా క్రైస్తవ మిత్రుల సాంగత్యం వల్ల నాకు కలిగిన ధర్మ జిజ్ఞాస అధికం. అందుకే నేను వారికి రుణపడ్డాను" అని తన ఆత్మ కథలో గాంధీ పేర్కొన్నాడు.

## ప్రజా మార్గంలో

గాంధీ భారతదేశానికి తిరిగి రాక ముందు జాతీయ కాంగ్రెసు చేపట్టిన ఆందోళనల్లో సాధారణ ప్రజల పాత్ర పరిమితంగా వుండేది. కారణం వారు లేవనెత్తిన అంశాలు అత్యధికంగా వున్న రైతాంగాన్ని, ఆధునికంగా అభివృద్ధి అవుతున్న కార్మిక వర్గాన్ని పెద్దగా ఆకర్షించలేదు. బొంబాయి, కలకత్తా లాంటి నగరాల్లో తిలక్ లాంటి వారు చేపట్టిన ఉద్యమాల్లో కార్మికులు పాల్గొన్నా అవి సంఘీభావ కార్యక్రమాలుగా వున్నాయి. కానీ గాంధీ మొదట చేపట్టిందే రైతు, కార్మిక వర్గాల సమస్యలు. చంపారన్ జిల్లాలో రైతుల సాగు భూమిలో 15 శాతం భూమిలో తప్పని సరిగా నీలిమందు పండించాలని, తాము నిర్ణయించిన ధరలకే ఆ పంట అమ్మాలని బ్రిటీష్ కంపెనీ అధికారులు రైతులను బలవంతం చేసేవారు. రైతులు కొద్ది మంది గాంధీ దగ్గరకు వచ్చి ఈ విషయాన్ని చెప్పి తమను కాపాడమని కోరారు. ఆయన వెంటనే ఉద్యమానికి పిలుపు ఇవ్వలేదు. అక్కడి పరిస్థితులు అధ్యయనం చేయడానికి బాబూ రాజేంద్రప్రసాద్, మజర్-ఉల్-హక్, కృపలానీ, మహదేవ్ దేశాయులతో కలిసి వెళ్ళారు. పరిస్థితిపై అంచనాకు వచ్చి 1917లో సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. మొదట్లో బెదిరింపులకు దిగిన బ్రిటీష్ అధికారులు చివరకు ప్రజల డిమాండ్లకు తలొగ్గారు. రైతుల పక్షాన గాంధీ భారతదేశంలో మొదటి విజయం సాధించాడు. తమ పక్షాన నిలిచిన గాంధీజీని మహాత్ముడిగా రైతులు పిలిచారు. ఆ తర్వాత అహ్మదాబాద్ మిల్లు కార్మికుల వేతనాల సమస్య పై నాలుగు రోజులు నిరాహారదీక్ష చేసి 35 శాతం వేతనం పెరిగేటట్లు చేశాడు. అయితే ఈ సందర్భంగా గాంధీ చెప్పిన ధర్మకర్తృత్వ సిద్ధాంతం, కార్మికుల-యజమానుల సంబంధం పట్ల ఆయన నిర్ధారణలు కార్మిక వర్గాన్ని ఆకర్షించలేదు. దీనికి వ్యక్తిగతంగా గాంధీని నిందించడంకంటే ఆయన వర్గ స్పృహకే ఈ పరిమితులు వున్నాయని గుర్తించడం సరైంది.

గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో 1918లో వరదలు వచ్చి పంట దిగుబడి నాలుగో వంతుకు పడిపోయినా బ్రిటీష్ ప్రభుత్వం పన్ను తగ్గించకపోగా, బలవంతాన వసూళ్ళకు పూనుకుంది. శిస్తులు చెల్లించొద్దని రైతులకు గాంధీజీ పిలుపునిచ్చారు. 5 నెలల తర్వాత ప్రభుత్వం దిగొచ్చి రెండు సంవత్సరాలు శిస్తు మాఫీ చేసింది. ఈ అనుభవమే ఆ తర్వాత గాంధీని జాతీయ నాయకుడిగా గుర్తింపు తెచ్చిన సహాయ నిరాకరణ ఉద్యమానికి కారణమయ్యింది. ప్రజల నుండి నేర్చుకోవడానికి గాంధీ ఎంత ప్రాధాన్యత ఇచ్చాడో ఈ సంఘటన తెలుపుతుంది. 1919 ఏప్రిల్ 13న జలియన్‌వాలా బాగ్‌లో బ్రిటీష్ సైనికులు అమానుషంగా కాల్పులు జరిపి దాదాపు 1000 మందిని బలి తీసుకున్నారు. దీన్ని తీవ్రంగా నిరసిస్తూ గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు. ఇందులో ప్రజలు ప్రత్యక్షంగా ఎక్కడికక్కడ, ఎవరికి వారు పాల్గొనగలిగే విదేశీ వస్తువుల బహిష్కరణ, విద్యా సంస్థలను, న్యాయస్థానాలను బహిష్కరించడం, రాట్నం ద్వారా నూలు వడకడం లాంటి వాటికి ప్రాధాన్యత ఇచ్చాడు.

దీనివల్ల గతంలో ఎన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ పిలుపులో భాగస్వాములయ్యారు. సరిగ్గా ఈ సమయంలోనే 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 1921లో అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ కాంగ్రెసు సమావేశంలో 'సంపూర్ణ స్వాతంత్ర్యా'నికి పిలుపునిచ్చి, ప్రజా ప్రణాళిక ప్రకటించింది. పంజాబ్‌లోని చౌరీ చౌరా పోలీస్ స్టేషన్‌పై ప్రజలు దాడి చేయడానికి నిరసనగా గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేశాడు. ఇది దేశ ప్రజల్లో ముఖ్యంగా యువతలో తీవ్ర ఆగ్రహానికి, నిర్లిప్తతకు దారితీసింది. ఈ పరిస్థితిని ఒకవైపు బ్రిటీష్ సామ్రాజ్యవాదం,


**(మిగతా 14వ పేజీలో)**

# ఆర్‌ఎస్‌ఎస్ అసలు స్వభావం



- ఎ.జి. నూరాని

**'మంచి ప్రవర్తనతో ఉంటాం' అన్న హామీతో భారతదేశంలో మనుగడ సాగిస్తున్న ఏకైక రాజకీయ సంస్థ ఆర్.ఎస్.ఎస్ మాత్రమే ! ఈ వ్యాఖ్య 1975 జులై 4న ఎమర్జెన్సీ నాటి నిషేధానికి ఉద్దేశించినదే కాదు. అంతకు చాలా ముందు, 1948 జనవరి 30న గాంధీజీ హత్య తర్వాత విధించిన నిషేధానికి సంబంధించినది కూడా! ఈ రెండు సందర్భాల్లోనూ అసత్యపు హామీలతో ఆర్.ఎస్.ఎస్ మనుగడ కొనసాగించింది. అలా అసత్యాలు, కపట విన్యాసాలే ఆర్.ఎస్.ఎస్ అసలైన ప్రాథమిక స్వభావం (బేసిక్ ఇన్‌స్టిక్ట్)!**



జనవరి 30న గాంధీజీ హత్య జరిగిన వెంటనే, ఫిబ్రవరి 1న ఆర్.ఎస్.ఎస్ ప్రధాన నేత ఎం.ఎస్.గోల్వాల్కర్‌ను అరెస్ట్ చేశారు. గాంధీజీ హత్యపై దిగ్భ్రాంతి, దు:ఖాన్ని వ్యక్తం చేస్తూ ఆయన జనవరి 30న జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్‌కు పంపిన టెలిగ్రామ్‌లు ఆయనను రక్షించలేకపోయాయి. 1948 ఫిబ్రవరి 4న భారత ప్రభుత్వం ఆర్.ఎస్.ఎస్‌ను నిషేధించింది. ఈ మేరకు విడుదలైన ప్రభుత్వ ప్రకటనలో 'హిందువుల శారీరక, మానసిక, నైతిక శ్రేయస్సును ప్రోత్సహించడం. అలాగే వారిలో సోదరభావం, పరస్పర ప్రేమ, సేవా భావాలను పెంపొందించడాన్ని ఆర్ఎస్ఎస్ లక్ష్యాలుగా ప్రకటించింది. అయితే, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు తాము ప్రకటించిన ఆదర్శాలకు అనుగుణంగా ప్రవర్తించలేదని గుర్తించాము. సంఘ్ సభ్యులు వాంఛనీయం కాని, ప్రమాదకరమైన కార్యకలాపాలలో పాల్గొంటూ వచ్చారు. వారు ప్రజలలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిం చేలా కరపత్రాలు పంచారు. తుపాకులు కూడగట్టమని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసంతృప్తి రేకెత్తించమని, పోలీసులు, సైన్యంపై తిరగబడమని పిలుపునిచ్చారు' అని పేర్కొన్నారు.

'నిషేధం కొనసాగుతున్నంత వరకు ఆర్.ఎస్.ఎస్‌ను రద్దు చేయాలి' అని గోల్వాల్కర్ ఫిబ్రవరి 6న ఆదేశించారు. అయితే ప్రభుత్వం చేసిన అన్ని ఆరోపణలను ఆయన తిరస్కరించారు. ఆర్.ఎస్.ఎస్ చట్టానికి లోబడి నడుచుకునే సంస్థ అని, చట్ట పరిమితులలోనే తన కార్యక్రమాలను కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు. గోల్వాల్కర్‌ను 1948 ఆగస్టు 6న విడుదల చేసినా, ఆయన ప్రయాణాలు నాగ్‌పూర్ వరకు మాత్రమే పరిమితం చేస్తూ ఆంక్షలు పెట్టారు. విడుదలైన అయిదు రోజుల తరువాత ఆయన నెహ్రూ, పటేల్‌లకు లేఖ రాసి ఈ పరిమితులపై ఫిర్యాదు చేశారు. ప్రధానమంత్రి కార్యదర్శులలో ఒకరు సెప్టెంబరు 27న గోల్వాల్కర్‌కు సమాధానం ఇస్తూ రాసిన లేఖలో 'ఆర్.ఎస్.ఎస్ జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా, ప్రజాహితానికి హానికరంగా ఉండే కార్యాకలాపాలలో పాల్గొన్నదన్న గట్టి ఆధారాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి.' అని రాశారు. 'ఆర్.ఎస్.ఎస్‌ను నిషేధించే ముందు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ మేరకు సేకరించిన ఆధారాలను ప్రధాని నెహ్రూకు పంపింది. ఇతర రాష్ట్ర ప్రభుత్వాల వద్ద కూడా ఇలాంటి ఆధారాలు ఉన్నాయి. నిషేధం విధించిన తరువాత కూడా ఆర్.ఎస్.ఎస్ సభ్యుల ఈ తరహా కార్యకలాపాల గురించి మాకు సమాచారం అందుతూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఆర్.ఎస్.ఎస్‌ను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హాని చేయని సంస్థగా ప్రభుత్వం పరిగణించలేదు.' అని కూడా ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

ఈ ఆరోపణలపై విచారణ జరపాలని నవంబరు 3న గోల్వాల్కర్ డిమాండ్ చేశారు. అప్పటికి ఆయనపై ఉన్న ఆంక్షలను తొలగించారు. ఢిల్లీకి వెళ్లడానికి, ప్రభుత్వం ముందు తన వాదన వినిపించడానికి ఆయనకు అనుమతి లభించింది. అయితే, ప్రధానమంత్రి నెహ్రూతో సమావేశం ఏర్పాటు చేయాలంటూ ఆయన చేసిన విజ్ఞప్తిని తిరస్కరించారు. ఈ ఇంటర్వ్యూను తిరస్కరించడానికి కారణాలను నవంబరు 10న నెహ్రూ వివరించారు. 'ఆర్.ఎస్.ఎస్ ప్రకటించిన లక్ష్యాలకు,

ఆచరణకు సంబంధం లేదు. ఆర్.ఎస్.ఎస్‌తో సంబంధం వున్నవారు పలు రూపాల్లో, పలు మార్గాల్లో చేపడుతున్న కార్యాచరణ భారత పార్లమెంటు తీర్మానాలకు, రాజ్యాంగంలోని నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. జాతి వ్యతిరేకంగానూ, తరచూ విధ్వసంకరంగా, హింసాత్మకంగా వారి కార్యాచరణ ఉంటోంది' అని నెహ్రూ పేర్కొన్నారు.

నిషేధం అనంతరం కూడా సర్దార్ వల్లభ్‌భాయి పటేల్‌కు ఆర్.ఎస్.ఎస్‌ను కాంగ్రెస్‌లో కలుపుకోవాలనే ఆసక్తి ఉండేది. కానీ, కేబినెట్‌లోని తన హిందూ మహాసభ సహచరుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ, ఆర్.ఎస్.ఎస్, హిందూ మహాసభల పట్ల సున్నితంగా (సాఫ్ట్) వ్యవహరించాలంటూ ఒత్తిడి చేశారు. దీనికి పటేల్ పెద్దగా స్పందించలేదు. జూలై 18న పటేల్ ముఖర్జీకి రాసిన లేఖలో 'మా నివేదికలు ఈ రెండు సంస్థల (ముఖ్యంగా మొదటిదైన ఆర్.ఎస్.ఎస్) కార్యకలాపాల ఫలితంగా దేశంలో అలాంటి ఘోర విషాదం (గాంధీజీ హత్య) సంభవించగల వాతావరణం ఏర్పడిందని ధృవీకరిస్తున్నాయి. హిందూ మహాసభలోని అతి తీవ్రవాద వర్గం ఈ కుట్రలో భాగమని చెప్పడానికి ఎటువంటి సందేహం లేదు' అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ తరువాత రెండు నెలలకు, సెప్టెంబరు 11న గోల్వాల్కర్‌కు పటేల్ ఇచ్చిన సమాధానంలోని అంశాలను అర్థం చేసుకోవడం కొంచెం కష్టమే !

ఈ లేఖలో గోల్వాల్కర్‌ను పటేల్ 'సోదరుడు'గా సంబోధించారు (అంతకు ముందు గోల్వాల్కర్ రాసిన లేఖలో 'మహనీయ సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ గారికి' అని ఉద్దేశించారు). 1947 డిసెంబరులో జైపూర్‌లో చేసిన తన ప్రసంగాన్ని పటేల్ ఈ లేఖలో గుర్తుచేశారు. ఆ ప్రసంగంలో ఆయన ఆర్.ఎస్.ఎస్ గురించి చాలా మృదువుగా మాట్లాడారు. వారిని 'దేశాన్ని ప్రేమించే దేశభక్తులు' అని అన్నట్లు ఆయన గుర్తుచేశారు. కానీ తన మాటలు సంఘ్‌పై ఎటువంటి ప్రభావం చూపలేదని పటేల్ విచారం వ్యక్తం చేశారు. 'ఆర్.ఎస్.ఎస్ హిందూ సమాజానికి సేవ చేసిందనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. అయితే వారు ప్రతీకార స్వభావంతో ముస్లిం లపై దాడులు ప్రారంభించినప్పుడు సమస్య ప్రారంభమైంది. హిందువులను సంఘటితం చేయడం, వారికి సహాయం చేయడం ఒక విషయం. అది ఫర్వాలేదు. కానీ నిరపరాధులైన, బలహీనులైన పురుషులు, స్త్రీలు, పిల్లలపై దాడులు చేయడం సహించలేం' అని పటేల్ పేర్కొన్నారు. అంతేకాదు 'ఆర్.ఎస్.ఎస్ నేతల ప్రసంగాలన్నీ మతోన్మాద విషంతో నిండిపోయిన ఉండేవి' అని కూడా ఆయన రాశారు. 'ఈ విషం ఫలితంగా దేశం గాంధీజీ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేయాల్సి వచ్చింది. 'గాంధీజీ హత్య తరువాత ఆర్.ఎస్.ఎస్ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ, మిఠాయిలు పంచుకున్నారు' అని ఆయన స్పష్టంగా రాశారు.

అయితే తనకంటూ ఉన్న కొన్ని ప్రత్యేక కారణాల వల్ల పటేల్ ఒక ఆశ్చర్యకరమైన ప్రతిపాదన చేశారు : 'ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో కలిసిపోవడం ద్వారానే తమ దేశభక్తి ప్రయత్నాలు కొనసాగించగలరు కానీ, వేరుగా ఉండటం లేదా కాంగ్రెస్‌ను వ్యతిరేకించడం ద్వారా కాదు' అని ఆయన రాశారు. ఆ తరువాత ఆంక్షలను ఎత్తివేడయంతో గోల్వాల్కర్ ఢిల్లీలోకి వచ్చారు. కానీ వారి చర్చలు విఫలమయ్యాయి. 1948 నవంబరు 2న గోల్వాల్కర్ తన వైఖరిని వివరిస్తూ, బహిరంగ ప్రకటన చేశారు. మరో మూడు రోజుల తరువాత ఆయన సర్దార్ పటేల్ ప్రతిపాదనకు ఇచ్చిన సమాధానం అత్యంత ప్రధానమైనది. అదే ఆ తరువాత జనసంఘం (బీజేపీకి పూర్వ సంస్థ) స్థాపనకు పునాది సిద్ధాంతమైంది.

'రాజకీయ రంగంలో ప్రజలకు సేవ చేయగల శక్తి కలిగి, ప్రస్తుతానికి పాలక పార్టీగా ఉన్న కాంగ్రెస్ సాంస్కృతిక రంగంలో ప్రజల్లో అసమానమైన దేశభక్తి, సోదరభావం, నిస్వార్థతను పెంపొందించడంలో విజయాన్ని సాధించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఈ రెండింటి మధ్య ఎటువంటి వివాదం లేకుండా శాశ్వతమైన పరస్పర ప్రేమ ఉండాలని, ఒకటి మరొక దానికి సంపూర్ణంగా తోడ్పడుతూ, పవిత్ర సంగమంలా కలిసిపోవడానికి నేను నా శక్తి మేర ప్రయత్నించాను' అని ఆయన తెలిపారు. చర్చలు విఫలమైన తరువాత గోల్వాల్కర్‌ను తిరిగి నాగ్‌పూర్‌కి వెళ్లాలని ఆదేశించారు. గోల్వాల్కర్ సర్దార్ పటేల్‌తో జరిగిన రెండు సమావేశాల్లో సంఘ్ విధానాలను మార్చేందుకు నిరాకరించారని, హోం మంత్రిత్వ శాఖ నవంబర్ 14న ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఆర్.ఎస్.ఎస్ భారతదేశాన్ని లౌకిక రాజ్యంగా తీర్చిదిద్దడానికి పూర్తిగా సహకరిస్తుందని, జాతీయ పతాకాన్ని ఆమోదిస్తుందని, సంస్థపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ ప్రధానమంత్రికి, హోం మంత్రికి గోల్వాల్కర్ లేఖలు రాశారు. అయితే, ఆచరణ దీనికి పూర్తి భిన్నంగా ఉంది. దీనితోపాటు ఇటువంటివే అనేక కారణాల వల్ల భారత ప్రభుత్వం ఆర్.ఎస్.ఎస్‌పై నిషేధాన్ని ఎత్తివేయాలని రాష్ట్రాలకు సూచించలేకపోతోంది.' అని కూడా హోం శాఖ పేర్కొంది. అయితే, అనంతర పరిణామాల్లో భారత ప్రభుత్వం 1949 జులై 11న ఆర్.ఎస్.ఎస్‌పై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకటనలో 'ఆర్.ఎస్.ఎస్ నాయకుడు ఇచ్చిన హామీల మేరకు ఆర్.ఎస్.ఎస్‌కు భారత రాజ్యాంగం పట్ల నిబద్ధత చూపడానికి, జాతీయ పతాకాన్ని గౌరవిస్తూ, అజ్ఞానాన్ని వదిలి, హింసను తిరస్కరించే ప్రజాస్వామ్య, సాంస్కృతిక సంస్థగా కార్యకలాపాలు కొనసాగించడానికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి భారత ప్రభుత్వం వచ్చింది' అని పేర్కొన్నారు.

### ఎమర్జెన్సీ సమయంలో ఇలా

ఎమర్జెన్సీ సమయంలో నిషేధం విధించడంలో అప్పటి ఆర్.ఎస్.ఎస్ అధినేత బాలా సాహెబ్ దేవరస్ ఇందిరాగాంధీకి, నాటి హోంశాఖ మంత్రి చవాన్‌కు ఎన్నో లేఖలు రాశారు. 'మీరు 1975 ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగాన్ని రేడియో ద్వారా నేను విన్నాను. ఆ ప్రసంగం సమయోచితంగా ఉంది. దానితో ప్రేరణ కలిగే ఈ ఉత్తరం రాస్తున్నాను.' అని ఆయన ఆగస్టు 22న ఇందిరకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ ఉత్తరంలోనే చివరగా ఆర్.ఎస్.ఎస్ పై విధించిన నిషేధాన్ని రద్దు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవరస్ జులై 16న మరోసారి ఇందిరా గాంధీకి లేఖ రాసి, ఆమె విదేశీ విధానాన్ని ప్రశంసించి, నిషేధంపై తన విన్నపాన్ని మరోసారి వ్యక్తం చేశారు. చవాన్‌కు రాసిన లేఖలు కూడా ఇదే విధంగా ఉన్నాయి.

1975 జూలై 15న రాసిన లేఖలో 'సంఘ్‌కు ప్రభుత్వానికి, సమాజానికి మధ్య ఎటువంటి శత్రుత్వం లేదు. సంఘ్ కార్యక్రమంలో హింసకు స్థానం లేదు. సంఘ్ కేవలం సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాల్లో మాత్రమే ఆర్.ఎస్.ఎస్ నిమగ్నమవుతుంది' అని రాశారు. 1975 నవంబర్ 24, 1975 డిసెంబర్ 12, 1976 జనవరి 24న కూడా ఆయన చవాన్‌కు లేఖలు రాశారు. 1976 జూన్ 6న కొన్ని విషయాలను ప్రత్యక్షంగా వివరించడానికి 'పెరోల్‌పై విడుదల చేయాలి' అని కోరారు. ఈ విన్నపాన్ని1976 జులై 12న మళ్లీ పునరావృతం చేశారు.

అత్యవసర పరిస్థితులు ముగిశాక, జనతా హయాంలో ఆర్.ఎస్.ఎస్ అభివృద్ధి సాధించింది. జనతా పార్టీలో భాగంగా వున్న జన సంఘ్ 1980లో ఆ పార్టీ నుంచి బైటకొచ్చింది. ఆ తర్వాత భారతీయ జనతా పార్టీగా ఏర్పడింది. ఏడు సంవత్సరాల తరువాత 1987 నవంబర్ 16న 'సమీప భవిష్యత్‌లో ఆర్.ఎస్.ఎస్ రాజకీయ రంగ ప్రవేశాన్ని తోసిపుచ్చలేము' అని దేవరస్ ధైర్యంగా ప్రకటించారు. నేరుగా రాజకీయ తెరపై ఆరంగ్రేటం చేసేంత వరకు బిజెపి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌తోపాటు ఇతర సంస్థలపై ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం కొనసాగుతుంది. ❑ **(ప్రజాశక్తి సౌజన్యంతో)**

---

# గాంధీజీ - ప్రజలు

**(11వ పేజీ తరువాయి)**

మరోవైపు దేశంలోని మతతత్వ శక్తులు వినియోగించుకున్నాయి. ఆ తర్వాత సుమారు ఎనిమిది సంవత్సరాలకు మరో ప్రజా ఉద్యమం ఉప్పు సత్యాగ్రహానికి పిలుపునిచ్చాడు. 'భారతీయులు ఉప్పు సాగు చేయరాదు, అమ్మరాదు' అని బ్రిటీష్ ప్రభుత్వం చేసిన చట్టాన్ని ధిక్కరిస్తూ గాంధీజీ 1930 మార్చి 12 నుంచి ఏప్రిల్ 6 వరకు అహ్మదాబాద్ నుంచి దండి వరకు 388 కి.మీ. పాదయాత్ర చేపట్టారు. ప్రజల నుంచి ఊహించని స్పందన వచ్చింది. ఈ ఉద్యమంలో 80 వేల మంది భారతీయులు జైలుకు వెళ్ళారు. ఆ తర్వాత 1942 ఆగస్టు 8న 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభించిన గాంధీజీ తాను మూడు దశాబ్దాలుగా అనుసరిస్తూ వచ్చిన అహింసా సిద్ధాంతానికి భిన్నంగా 'డూ ఆర్ డై' (విజయమో, వీర స్వర్గమో) నినాదం ఇచ్చాడు. నాడు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రైతాంగ, కార్మిక పోరాటాల నేపథ్యంలో ప్రజల చైతన్య స్థాయికి తగ్గట్టుగా ఈ పిలుపు ఇచ్చాడని గమనించాలి.

'తాము సాగు చేసుకుంటున్న భూములు రైతులవే' అని 1937లో ప్రకటించాడు. ఆయన కేవలం రాజకీయ పోరాటాలకే పరిమితం కాలేదు. సామాజిక సమస్యలపై అనేక ఉద్యమాలు చేపట్టారు. ఖిలాఫత్ ఉద్యమం సందర్భంగా హిందూ-ముస్లిం ఐక్యత కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా, మహిళా సాధికారత కోసం, బాల్య వివాహాలకు నిరసనగా, వితంతువుల సమస్యలపై ఆందోళనలు చేపట్టాడు. నీతి అనేది రాజకీయాల్లో అంతర్భాగంగా వుండాలని గట్టిగా భావించాడు. మతతత్వ ప్రమాదాన్ని గుర్తించిన గాంధీ 1942లో 'మతం అనేది వ్యక్తిగత విషయం. రాజకీయాల్లో దానికి స్థానం లేదు' అని ప్రకటించాడు.

**1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సాధించిన ఆనందం కంటే భారత్-పాకిస్థాన్ విభజన తద్వారా జరిగిన మత ఘర్షణలు గాంధీజీని తీవ్రంగా కలచివేశాయి. మతోన్మాదం జడలు విప్పి అమానుషంగా ప్రవర్తిస్తూ రక్తం ఏరులై పారిస్తున్న ప్రాంతాలైన నౌఖాలీ, బీహార్, కలకత్తా, ఢిల్లీ మురికివాడల్లో చెప్పులు లేకండా 77 సంవత్సరాల వయసులో మత సామరస్యం కోసం గాంధీ సాహసోపేతమైన పర్యటనలు చేశాడు. నిరాహార దీక్షలు చేపట్టాడు. సామ్రాజ్యవాదాన్ని ఓడించడంలో కీలక పాత్ర పోషించిన మహాత్ముడు, హిందూ మతోన్మాది గాడ్సే తుపాకి తూటాలకు బలయ్యాడు. మతోన్మాదాన్ని బలపరిచే శక్తులు నేడు రాజ్యాధికారంలో వున్నాయి. ఈ పరిస్థితులను ప్రజల ద్వారానే ఎదుర్కోవాలి. అందుకు ప్రజాపంథానే సరైన మార్గం.** ❑

# ఆర్ఎస్ఎస్ విద్వేష చరిత్రకు వందేండ్లు!



- డాక్టర్ దేవరాజు మహారాజు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వందేండ్లు (1925-2025) ఉత్సవాల్ని ప్రారంభిస్తూ ఈ దేశప్రధాని దేశ ప్రజలకు ఒక గొప్ప సందేశమిచ్చారు. "స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ వీరోచితంగా పోరాడిందని, ఎంతోమంది బలిదానాలు చేశారని" ఢంకా బజాయించారు. పదకొండేండ్లుగా ఆయన అలా బజాయిస్తున్నందు వల్లనే ఈ దేశ ప్రజలు ప్రేమగా అబద్ధాల విశ్వగురువుగా కీర్తిస్తున్నారు. ఒకప్పుడు మాటి మాటికీ బ్రిటీష్ ప్రభుత్వపు - ఆ తర్వాత నెహ్రూ, ఇందిరా గాంధీ ప్రభుత్వాల కాళ్ల వేళ్లా పడి క్షమాపణలు కోరుతూ వారి దయాదాక్షిణ్యాల మీద బతికిన ఆర్ఎస్ఎస్ వారు ఇప్పుడు చరిత్రను వక్రీకరించాలని అనుకుంటున్నారన్న మాట! ఆ సందర్భంలోనే కావాలనే ప్రధాని అలా మాట్లాడారన్న మాట!! ఆ సందర్భంలోనే ఆయన విడుదల చేసిన వంద రూపాయల నాణాన్ని జాగ్రత్తగా గమనించండి. నాణెం మీద భారతమాత జాతీయ జెండాకు బదులు ఆర్ఎస్ఎస్ జెండా పట్టుకుని ఉంది. కింద ఇంగ్లీషు స్పెల్లింగ్ గమనించండి. రాష్ట్రీయ స్వం-సేవక్ అని ఉంది. అందులో వై, ఎ- అక్షరాలు తప్పిపోయాయి. అందుకే స్వయం కాలేకపోయింది. అంటే దాన్ని ఎవరో ఎంటైర్ పొలిటికల్ సైన్స్‌లో ఎం.ఎ. డిగ్రీ సృష్టించుకున్న వాడే- ఇంగ్లీషు రానివాడే రాసి ఉంటాడు.

ఇకపోతే, గత ఎన్నికల్లో ఓట్ల(చోరీ) - దొంగతనం భారీ ఎత్తున జరిగిందని, సి.సి. పుటేజ్ బయట పెట్టాలని రాహుల్ గాంధీ, ఇంకా ఇతర ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో ఈ ఆర్ఎస్ఎస్-బీజేపీ-ఎన్డీయే కూటమి అక్రమంగా ఎలా అధికారంలోకి వచ్చిందో ప్రపంచానికి తేటతెల్లమయింది. మొన్న సుప్రీంకోర్టులో ఛీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాపై బూటు విసరడానికి ఒక లాయరు ప్రయత్నించడం వెనక తప్పక ఈ సంఘ్ పరివార్ కుట్ర దాగి ఉంది. ఈ సంఘటనను దేశం యావత్తూ ముక్తకంఠంతో ఖండిస్తూ ఉంది. సందర్భం వచ్చింది గనక, ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం-స్వాతంత్ర్య పోరాటంలో దాని పాత్ర గురించి ఈ దేశ ప్రజలు తప్పక వాస్తవాలు మాట్లాడుకోవాలి! ఆ అవసరాన్ని ప్రధానే కల్పించారు మరి!! ఒక్కసారి చరిత్రపుటలు వెనక్కితిప్పి ఈ దేశానికి ఆర్ఎస్ఎస్ చేసిందేమిటో బేరీజు వేసుకుందాం!

దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు భగత్‌సింగ్, సచ్చీంద్రనాథ్ సన్యాల్, చంద్రశేఖర ఆజాద్, సుఖ్‌దేవ్ థాపర్లు. వీరంతా కలిసి, నాటి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి 1928లో న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లలో ఒక విప్లవ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దాని పేరు హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్ఎస్ఆర్ఏ) దీన్నే హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ-అని కూడా వ్యవహరించేవారు. నాటి యువకులంతా ఎక్కువ సంఖ్యలో ఆకర్షింపబడి, ఇందులో భాగస్వాములు అయ్యేవారు. అలా సభ్యుడయిన వాడే కేశవ్ బలిరామ్ హెడ్గేవర్. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే మనస్తత్వమున్న హెడ్గేవర్ త్వరలోనే తన బుద్ధి బయట పెట్టుకున్నాడు. తను ఉన్న హెచ్ఎస్ఆర్ఏ వివరాలన్ని రహస్యంగా బ్రిటీష్ అధికారులకు చేరవేయడం ప్రారంభించాడు. ఆ రకంగా బ్రిటీష్ గూఢచారిగా మారిపోయాడు. నాటి బ్రిటీష్ వారి ప్రోద్బలంతో 27 సెప్టెంబరు 1925న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) స్థాపించాడు. ఇది నాటి బ్రిటీష్ పాలకులకు అనుకూలంగా పనిచేయడానికి ఏర్పడిన సంఘం. హిందుత్వను బలపరచడం దాని ధ్యేయం. హెచ్ఎస్ఆర్ఏకు పూర్తి వ్యతిరేకం !

బ్రిటీష్‌కు వ్యతిరేకంగా ఎవరూ ఏ విధమైన ఉద్యమాలు చేయకుండా అరికట్టడం అనాటి ఆర్ఎస్ఎస్ విధి! అందువల్ల నాటి స్వాతంత్ర్యోద్యమాన్ని దొంగదెబ్బ తీసినవాడు కేశవ్ బలరామ్ హెడ్గేవార్. దొంగే.. దొంగా దొంగా అని గగ్గోలు పెట్టినట్టు అనాటి నుంచి, ఈ నాటి వరకు ఇలాంటి దేశ ద్రోహులే తమని తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటున్నారు. పైగా మిగతా వారెవరూ దేశభక్తులు కారని, అది తమకు మాత్రమే చెందిన పేటెంట్ హక్కు అయినట్టు వ్యవహరిస్తున్నారు. 9 ఆగస్టు 1925న జరిగిన 'కకొరి రైలు దోపిడీ'కి సంబంధించిన విచారణలో హెడ్గేవర్ బ్రిటీష్ వారికి పూర్తి సహకారం అందించాడు. రాంప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, రాజేంద్రనాథ్ లహరి, అశ్ఫఖుల్లా ఖాన్‌లకు 19 డిసెంబరు 1927న మరణ శిక్షలు పడడానికి కారణమయ్యాడు. మరో 16 మందికి దీర్ఘకాలిక జైలు శిక్షలు, మరో నలభై మందికి వివిధ శిక్షలు పడడానికి కారణమయ్యాడు. ఆ నాటి బ్రిటీష్ ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఈ ఆర్ఎస్ఎస్ దేశభక్తులు నేడు దేశభక్తి మీద భాషణలిస్తున్నారు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ప్రకటించిన మ్యానిఫెస్టో "ద రెవల్యూషనరీ" కకొరి కుట్ర కేసులో బ్రిటీష్ వారికి ఒక సాక్ష్యమైంది. మరణ

శిక్షను అనుభవించిన బిస్మిల్, అశ్ఫఖుల్లాలు విప్లవ కవులు. వీరి రచనలను భగత్‌సింగ్ అభిమానించేవాడు.

స్వాతంత్ర్య సమరంలోకి దూకి తమ ప్రాణాల్ని సైతం అర్పించడానికి సిద్ధపడ్డ భారతీయ యువకులను అదుపు చేయడానికి వారి ధ్యేయాన్ని, గమ్యాన్ని మార్చడానికి హెడ్గేవర్ అనే "దేశ భక్తుడు" చాలా శ్రమించాడు. అహింసా సిద్ధాంతంతో బ్రిటీష్ తుపాకి తూటాలకు సైతం భయపడక ఎదురొడ్డి నిలబడ్డ దేశప్రజల మనోధైర్యం ముందు హెడ్గేవర్-ఆర్ఎస్ఎస్ కుట్రలు పని చేయలేదు. స్వాతంత్ర్యం ప్రకటించబడింది!! మూడు రంగుల జెండాను జాతీయ పతాకంగా స్వీకరించడం జరిగింది. విధిలేక మొదటి సంవత్సరం జాతీయ జెండాను ఎగరేసిన ఆర్ఎస్ఎస్ చీఫ్ హెడ్గేవర్.. మరుసటి సంవత్సరం నుండి దాన్ని పూర్తిగా వ్యతిరేకించడం ప్రారంభించాడు.

ఆర్ఎస్ఎస్ అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' 14 ఆగస్టు 1947 సంచికలో ఈ విధంగా ప్రకటించారు. "ఏదో అదృష్టం కలిసొచ్చి స్వాతంత్ర్యం సాధించుకున్న వీరికి మరో ముఖ్యమైన విషయమేదీ కనబడలేదు. ఓ మూడు రంగుల జెండాను జాతీయజెండాగా ఆమోదించుకున్నారు. ఆ జెండాను హిందువులు ఎన్నటికీ గౌరవించరు. మూడు అనే సంఖ్య చాలా అశుభమైంది. జాతీయ పతాకం మీద ఉన్న మూడు రంగులు దేశ ప్రజల మానసికస్థితి మీద తీవ్రమైన వ్యతిరేక ప్రభావం చూపగలదు. ఫలితంగా దేశ భవిష్యత్తు దుర్భరంగా ఉంటుంది"- అని!

ఇన్నేండ్ల స్వతంత్ర భారతదేశంలో త్రివర్ణ పతాకంతో దేశం ఎప్పుడూ ఎక్కడా కష్టాలు ఎదుర్కోలేదు. స్వతంత్రంగా గర్వంగానే నిలబడింది. ఇక కష్టాలంటే అవి ఆర్ఎస్ఎస్-బీజేపీల అనాలోచిత నిర్ణయాల వల్ల వచ్చినవే-వస్తున్నవే ! జాతీయ జెండాపై వారి అభిప్రాయం అలా ఉంది కాబట్టే, ప్రధాని మోడీ ఒక యోగాడే సందర్భంగా జాతీయ జెండాతో చెమట తుడుచుకుని దేశాన్ని దేశ ప్రజల మనోభావాల్ని అవమానపరిచారు. ఎంతైనా ఆయన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కదా? హెడ్గేవర్ వారసత్వం ఎక్కడికి పోతుందీ? కేశవ్ బలరామ్ హెడ్గేవార్ తర్వాత మాధవ్ సదాశివ్ (ఎమ్మెస్) గోల్వాల్కర్ సంఘ్ చాలక్ బాధ్యతలు (1940) తీసుకున్నాడు. ఈయన హెడ్గేవర్ కన్నా మరో అడుగు ముందుకేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తడంతోపాటు, దేశ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటాడు. దేశంలో అత్యధికులు హిందువులు కాబట్టి, వారిని ఏకం చేయడం కోసం అల్ప సంఖ్యాకుల పట్ల ద్వేషభావం వ్యాప్తి చేశాడు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం దేశభక్తి కాదని, హిందూమతాన్ని, సంస్కృతిని పరిరక్షించుకోవడమే దేశభక్తి - అని నూరిపోశాడు.

దేశమంతా క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతూ ఉంటే.. అందులో పాల్గొనగూడదని తన సంఘ్ పరివార్ సభ్యులకు గోల్వాల్కర్ పిలుపునిచ్చాడు. అది కొంతవరకు పనిచేసింది. ఫలితంగా "1942లో బ్రిటీష్ వ్యతిరేక తిరుగుబాటును అణచివేయడంలో రాష్ట్రీయ స్వయం సేవకులు అందించిన తోడ్పాటు చాలా గొప్పది - అని నాటి బ్రిటీష్ ప్రభుత్వం బొంబాయిలో ఆర్ఎస్ఎస్‌కు ఒక ప్రశంసా పత్రం అందించింది-ఇవి చరిత్రలోని వాస్తవాలు !

పుస్తకాలు చదివినా, ఇంటర్నెట్‌లో వెతికినా ఈ వివరాలన్నీ దొరుకుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ఆర్ఎస్ఎస్ - బీజేపీ ఆ మూల సూత్రాలతోనే పనిచేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఆర్ఎస్ఎస్ చరిత్రను గ్రంథస్తం చేసిన సి.పి. బిషకర్ పుస్తకం చదివినా ఈ విషయాలన్నీ తెలుస్తాయి. హిట్లర్, ముస్సోలినీల భావజాలాన్ని సంఘ్ పరివార్ ప్రముఖులు ఇష్టపడే వారని తెలియజేసింది ఈయనే! గాంధీజీ హత్య నేపథ్యంలో 4 ఫిబ్రవరి 1948న ఆర్ఎస్ఎస్ రెండోసారి ఈ దేశంలో నిషేధానికి గురయ్యింది.

అప్పుడు- "భారత రాజ్యాంగానికి విధేయులమై ఉంటామనీ, జాతీయ పతాకాన్ని గౌరవిస్తామని" ప్రతిజ్ఞ చేసి, గోల్వాల్కర్ నేతృత్వంలో 11 ఏప్రిల్ 1949న నిషేధాన్ని ఎత్తి వేయాల్సిందిగా అభ్యర్థిస్తూ ఆర్ఎస్ఎస్ ప్రాధేయపడింది. మూడు నెలల తర్వాత నెహ్రూ ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తేసింది. అయినా కూడా, తన ప్రతిజ్ఞకి తానే విలువ లేకుండా చేసుకున్న సంఘ్ పరివార్, ఈ రోజుకు కూడా జాతీయ జెండాను గౌరవించదు. రాజ్యాంగానికి విరుద్ధంగా తీవ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉంది. దేశాన్ని ముక్కలు చేయడంలో ఆనాడు ఆర్ఎస్ఎస్ ముఖ్య భూమికను పోషించింది. విభజన తర్వాత కూడా దేశంలో అశాంతి నెలకొల్పుతూనే ఉంది. స్వాతంత్ర్యోద్యమంలో కలిసి పోరాడిన హిందూ, ముస్లింల మధ్య ద్వేషాన్ని రగిలించి, మత కలహాలు సృష్టించింది. ప్రస్తుతం ఇంకా ఆ ప్రయత్నంలోనే ఉంది. స్వాతంత్ర్యం సాధించుకుని 77 ఏండ్లు పూర్తయినా ఆర్ఎస్ఎస్ మాత్రం అభివృద్ధి నిరోధక శక్తిగా నిలిచే ఉంది.

భారత రాజ్యాంగం పట్ల ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి అభిప్రాయ ముందో చూద్దాం! వారి అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' 30 నవంబర్ 1949 నాటి సంచికలో ఇలా ప్రకటించుకుంది. "భారతదేశానికి కొత్తగా రాజ్యాంగం రాయాల్సిన అవసరమే లేదు. పురాతన కాలంలో మనువు రాసిన గొప్పగొప్ప సూత్రాలు మనకు ఉండనే ఉన్నాయి. నేటి రాజ్యాంగంలో వాటి ప్రస్తావన లేకపోవడం విచారించదగ్గ విషయం. ప్రపంచానికి దారి చూపగల 'మనుధర్మ శాస్త్రం' - ఈ రాజ్యాంగ నిపుణులకు కనీసం గుర్తుకురాకపోవడం - ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం!" అన్న ఆర్ఎస్ఎస్, అంతటితో ఆగలేదు - 6 ఫిబ్రవరి 1950

**(మిగతా 29వ పేజీలో)**

# నూరు వసంతాల వేళ విభిన్న భావాల సంఘర్షణ

- మానవేంద్ర బసు

**భా**రతదేశ చరిత్రలో 1925వ సంవత్సరానికి చాలా ప్రాముఖ్యత ఉంది. రెండు భిన్న భావాలకు చెందిన సంస్థలు లేదా పార్టీలు ఆ ఏడాదే పురుడు పోసుకున్నాయి. ఆ రెండూ ఈ ఏడాది(2025) నూరు వసంతాలు పూర్తి చేసుకుంటున్నాయి. వాటిలో ఒకటి ప్రస్తుతం విజయగర్వంతో వికటాట్టహాసం చేస్తుంటే, మరొకటి షేర్ మార్కెట్ ఇండెక్స్‌లా పడుతూ లేస్తూ ఉంది. మొదటిది ఆర్ఎస్ఎస్‌గా పిలువబడే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. రెండవది సీపీఐగా పిలువబడే భారత కమ్యూనిస్టు పార్టీ(తదనంతర కాలంలో దాని నుంచి వేరుపడ్డ ఇతర వామ పక్ష పార్టీలు). 1925 సెప్టెంబర్ 27న కేబీ హెగ్డేవార్ సారథ్యం లో హిందూత్వ ప్రాతిపదికగా ఆర్ఎస్ఎస్ ఏర్పాటైంది. కారల్ మార్క్స్ ప్రతిపాదించిన కమ్యూనిజం సాధన కోసం 1925 డిసెంబరు 26న రాజకీయ పార్టీ సీపీఐను స్థాపించారు.

### స్వాతంత్ర్యానికి పూర్వం-అనంతరం..

స్వాతంత్ర్యానికి పూర్వం ఆర్ఎస్ఎస్ బ్రిటీష్ వారికి పాదాక్రాం తమైంది. సంఘీయులు ఆరాధించే వీర దామోదర్ సావర్కార్‌ను స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీషర్స్ అరెస్టు చేసి అండమాన్ జైలులో ఉంచారు. ఈ క్రమంలో బ్రిటిషర్స్‌ను బ్రతిమలాడుతూ లేఖ రాసి బయటకు వచ్చిన చరిత్ర సావర్కర్‌కు ఉంది. మరో పక్క వామ పక్ష భావాలు జీర్ణించుకున్న భగత్‌సింగ్ లాంటి యువకులు ధైర్యంగా ఉరికొయ్యను ముద్దాడిన సంగతి మనకందరకూ తెలిసిన చరిత్రే. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతం త్ర్యం వచ్చింది. బ్రిటీషర్స్ స్వాతంత్ర్యమయితే ఇచ్చారు. కానీ మత ప్రాతిపదికన దేశాన్ని భారత్, పాకిస్తాన్‌లుగా విడగొట్టి పోయారు. ఆ రోజు వారు పెట్టిన చిచ్చు నేటికీ రావణకాష్టంలా రగులుతూనే ఉంది. ఈ చిచ్చులోంచి సిగరెట్ వెలిగించుకున్నట్టు ఆర్ఎస్ఎస్ దానిని బూచిగా చూపి దానంతటికీ కారణం మహా త్మాగాంధీ అని భావించి స్వాతంత్ర్యం వచ్చిన ఐదు నెలలకే, 1948 జనవరి 30న ఆయనను హత్య చేసింది.

ఈ ఘటన ద్వారా ఆర్ఎస్ఎస్ దేశ ప్రజల్లో ఒక విలన్‌లా ముద్ర వేసుకుంది. దాంతో ఇప్పుడు సంఘీయులు భుజాలకు ఎత్తుకుని, గుజరాత్‌లో అత్యంత ఎత్తున విగ్రహం పెట్టిన అప్పటి హోంమంత్రి వల్లభాయ్ పటేల్ ఆ నాడు ఆర్ఎస్ఎస్ మీద నిషేధం విధించారు. తర్వాత తాము రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని గోల్వాల్కర్ హామీ ఇవ్వడంతో 1959 జూలై 11న బ్యాన్‌ను ఎత్తివేశారు.

### తొలి ముసుగు జనసంఘ్..

గాంధీ హత్యాపాతకాన్ని చెరిపి వేసుకుని, జాతి జనుల హృదయాల్లో స్థానం సంపాదించుకోవాలంటే ఆర్ఎస్ఎస్‌కు ఒక కొత్త ముసుగు అవసరమైంది. ఎందుకంటే, అంతిమంగా దాని లక్ష్యం రాజ్యాధికారం కాబట్టి. రాజ్యాధికారం సాధించి అఖండ భారత్ స్థాపనే దాని ధ్యేయం కాబట్టి. అందులో భాగంగానే 1951 అక్టోబరు 21న ఆర్ఎస్ఎస్ తన మానస పుత్రికగా భారతీయ జనసంఘ్‌ను ఏర్పాటు చేసింది.

అయితే, స్వాతంత్ర్య సమరంలో గణనీయమైన పాత్ర పోషించిన కాంగ్రెస్ రాజ్యాధికారం చేజిక్కించుకుంది. జవహర్ లాల్ నెహ్రూ దేశ తొలి ప్రధాని అయ్యారు. స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్‌తోపాటు వామపక్షాలు ముఖ్యమైన పాత్ర పోషించాయి. అందుకే 1952లో జరిగిన మొట్టమొదటి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో విజయం సాధించగా, కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టులు ఇతర సామ్యవాద, లౌకిక పార్టీలతో ఐక్య సంఘటన ఏర్పాటు చేసి గణనీయమైన సీట్లు సాధించి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. తెలుగు వారైన పుచ్చలపల్లి సుందరయ్య మొట్టమొదటి పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడుగా వ్యవహరించారు. కమ్యూనిస్టులు బలంగా ఉండడం, ప్రధానిగా ఉన్న జవహర్ లాల్ నెహ్రూ కొంత మేరకు వామపక్ష అనుకూల భావాలు కలిగి ఉండడం, రష్యాతో సన్నిహిత మైత్రి కలిగి ఉండడం. ఇవన్నీ కూడా జన సంఘ్‌కు కొరకరాని కొయ్యగా తయారయ్యాయి.

1967 ఎన్నికల్లో కాంగ్రెస్ దేశవ్యాప్తంగా కొంత బలహీనప డడం, వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలపడడం వంటి పరిణామాలు సంభవించాయి. ప్రధాని ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయాకరణ, రాజభరణాల రద్దు వంటి విధానాల ద్వారా పేద ప్రజలకు దగ్గరైంది. దానికి తోడు 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి దానిని ఓడించి బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం ఇప్పించడం ద్వారా ఉక్కు మహిళ అనిపించుకుంది.

అదే సమయంలో తన చుట్టూ చేరిన భజనపరుల కారణంగా అపఖ్యాతి పాలయింది. పులి మీద పుట్ర లాగా అలహాబాద్ హైకోర్టు ఇందిర ఎన్నిక చెల్లదని తీర్పు ఇవ్వడం, ఈ నేపథ్యంలోనే దేశంలో అల్లర్లను అణగదొక్కడానికి ఇందిర తప్పు మీద తప్పు చేసింది. 1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించింది. ఎమర్జన్సీకి వ్యతిరేకంగా బిహార్‌కు చెందిన జయప్రకాష్

నారాయణ్ సంపూర్ణ క్రాంతి ఉద్యమం ప్రారంభించి, కాంగ్రెస్‌కు వ్యతిరేక పార్టీలన్నింటిని కూడగట్టి జనతా పార్టీని ఏర్పాటు చేశారు. ఆ కలగూర గంపలో జనసంఘ్ చేరింది. ఆ రకంగా జనసంఘ్ తొలిసారి రాజ్యాధికారంలో భాగస్వామి అయింది. ఈ ప్రయోగం మూడేళ్లకే విఫలమై 1980 జనవరిలో ఇందిరాగాంధీ మళ్లీ ప్రధాని అయింది. జనసంఘ్ తాననుకున్న లక్ష్యం నెరవేరాలంటే ఆలస్యమైనా ఒంటరిగానే పోరాటం చేయాలని, అయితే మరో సరికొత్త ముసుగు అవసరమని భావించింది.

### మలి ముసుగు బీజేపీ..

ఈ నేపథ్యంలోనే ఇందిర మళ్లీ ప్రధాని అయిన మూడు నెలల తర్వాత 1980 ఏప్రిల్ 6న బీజేపీగా పిలువబడే భారతీయ జనతా పార్టీ ఏర్పాటైంది. అనంతరం 1984లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ దేశం మొత్తం మీద కేవలం రెండు సీట్లే గెలిచుకుంది. అది కూడా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీఆర్ పుణ్యమాని హన్మకొండ నుంచి ఒకరు చందుపట్ల జంగారెడ్డి గెలవగా, మరొకరు గుజరాత్ నుంచి గెలిచారు. ఆ నాడు బీజేపీని అందరూ చాలా తక్కువగా అంచనా వేశారు. కాని దాని వ్యూహం దానికి ఉంది. ఆ తర్వాత ఆరేళ్లలోనే దాని వ్యూహన్ని అమలు పరిచింది. 1992లో బాబ్రీ మసీదు కూలగొట్టడం ద్వారా ఒక్కసారిగా దేశంలో కల్లోలం సృష్టించింది. ఆ పని చేయగలిగిందంటే అంతకుముందు దాదాపు ఐదేళ్లపాటు బీజేపీ ముసుగులో ఆర్ఎస్ఎస్, దాని పిల్ల గ్రూపులు అయిన విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ చేసిన గ్రౌండ్ వర్కు ఘనత అది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది కరసేవకులను అది సమీకరించు కోగలిగింది. దేశ ప్రజల్లో హిందూత్వ విష బీజాలను నాటడంలో అది విజయవంతమైంది. మరో నాలుగేళ్లకు దేశ ప్రధాని పీఠం పై వాజ్‌పేయ్‌ను కూర్చోబెట్టగలిగింది. వాజ్‌పేయ్ ఎంపిక కూడా వ్యూహాత్మకమే. కవిగా, ఉత్తమ విలువలున్న రాజకీయ నాయకుడిగా, మితవాదిగా ముద్ర ఉన్న వాజ్‌పేయ్‌ను ముందు పెట్టడం ద్వారా దేశ ప్రజల్లో కొంత సానుకూలత సాధించగలిగింది.

### బీజేపీ 2.0..

2014 నాటికి వచ్చేసరికి గుజరాత్ మారణహోమ యజ్ఞ మూలకారకుడైన నరేంద్ర మోదీ, ఆయన సహచరుడు అమిత్ షాలను ప్రధాని, హోంమంత్రి స్థానాల్లో కూర్చోబెట్టడం ద్వారా బీజేపీ 2.0 పాలన మొదలయింది. ఈ 11 ఏళ్లలో దాని దారుణ ఫలితాలను మనం చవిచూస్తూనే ఉన్నాం. బీజేపీ తన ప్రధాన శత్రువులైన హేతువాదుల్ని, వామపక్ష తీవ్రవాదుల్ని భౌతికంగా మట్టుబెట్టడం చూశాం. 2026 మార్చి నాటి కల్లా దేశంలో ఒక్క మావోయిస్టు కూడా లేకుండా చేస్తామంటూ డెడ్‌లైన్ కూడా విధించి మరీ వరుస మారణకాండలు చేస్తూ ఉండడం గమనిస్తూనే ఉన్నాం.

### కమ్యూనిస్టుల కింకర్తవ్యం..

భారతదేశంలో 1960వ దశకం సగం వరకు కూడా కమ్యూనిస్టులు బలంగా ఉన్నారు. 1964లో సీపీఐ నుంచి సీపీఎం చీలిపోవడం, 1967లో సీపీఎం నుంచి సీపీఐ(ఎంఎల్) చీలిపోవడం, ఆ తర్వాత నక్సలైట్ గ్రూపులు పుంఖాను పుంఖాలుగా చీలిపోవడంతో కమ్యూనిస్టులు కొంత బలహీనపడ్డారు. అయినప్పటికీ 1990 వరకు బలంగానే ఉన్నారని చెప్పాలి. 1990లో ప్రపంచ కమ్యూనిస్టుల కేంద్రమైన రష్యాలో కమ్యూనిజం అంతం కావడం, ఇండియాలో ప్రపంచీకరణ విధానాలు ప్రవేశపెట్టడంతో, దేశంలో కమ్యూనిస్టుల ప్రాభవం తగ్గుతూ వచ్చింది. యువత సోషలిజం భావనలు వదిలి కెరీరిజం తుఫానులో కొట్టుకుపోవడం ప్రారంభించారు. ఈ పరిణామాల కారణంగా కమ్యూనిస్టులకు యువతరం నుంచి కొత్త క్యాడర్ రాకపోవడం, ప్రజల ఆలోచనల్లో కూడా మార్పు రావడం, ప్రతి ఒక్కరూ సంపాదనల సుడిగుండంలో కొట్టుకుపోవడం, వ్యక్తుల్లో త్యాగ భావనలు అంతరించడం. ఇవన్నీ కమ్యూనిస్టుల బలం తగ్గడానికి దోహదాలయ్యాయి. అయినప్పటికీ ప్రజల్లో ఇప్పటికీ కమ్యూనిస్టులంటే సదభిప్రాయమే ఉంది. ప్రస్తుతం దేశంలో పెచ్చరిల్లుతున్న హిందూత్వ శక్తులను బలంగా ఎదుర్కోవాలంటే అది కమ్యూనిస్టుల వల్లే అవుతుందన్న నమ్మకముంది.

### జేఎన్‌యూ విద్యార్థులే స్ఫూర్తి ప్రదాతలు..

మహాకవి శ్రీశ్రీ అన్నట్టు :

"కొంత మంది యువకులు ముందు యుగం దూతలు
పావన నవ జీవన బృందావన నిర్ణేతలు
వారికి మా ఆహ్వానం వారికి మా లాల్ సలామ్"

దేశమంతటా హిందూత్వ చీకట్లు ముసురుకుంటున్న వేళ మిణుకుమిణుకు మంటూ మిణుగురు పురుగుల్లా మెరుస్తున్న జేఎన్‌యూ విద్యార్థులే ఇప్పుడు దేశంలో వామపక్ష శక్తులకు ఆశాదీపాలు. అయిదు దశాబ్దాల కిందటే జేఎన్‌యూలో ఎస్ఎఫ్ఐ తరఫున స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా గెలిచి సీతారాం ఏచూరి వేసిన వామపక్ష బీజాలు వృథా కాలేదు. అవి ఇప్పటికీ మొలకెత్తుతూనే ఉన్నాయి. ఆ ఎర్ర గులాబీలు పరిమళిస్తూనే ఉన్నాయి. ఇంత నిర్బంధ పరిస్థితులలో సైతం తమ గొంతు వినిపిస్తూనే ఉన్నాయి. ఆ యువతీ యువకుల స్ఫూర్తితో ఈ కల్లోల కాలంలో మనువాద శక్తులను అంతమొందించటానికి ఎర్రజెండా నీడలో చీలికలు, పేలికలై ఉన్న వామపక్ష శక్తులన్నీ ఏకత్రాటిపైకి వచ్చి సమరశంఖం పూరించాలి. దేశంలో హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న బహుజన, దళిత, లౌకిక శక్తులన్నింటిని కలుపుకొని లాల్ నీల్ నినాదంతో ముందుకు సాగాలి. అప్పుడు మోదీ షా పాలన అంతమొందించడం అసాధ్యమేమీకాదు. ❑

# ప్రత్యేక మతం కోసం కదంతొక్కిన లింగాయత్‌లు

- ఎంఏ అరుణ్

**దక్షిణాదిలో తమకు ప్రయోగశాలగా మారిన కర్ణాటకలో సంఘ్ పరివార్ విద్వేష విషం చిమ్ముతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా, తమను ప్రత్యేక మతంగా గుర్తించాలంటూ లింగాయత్‌లు పెద్ద ఎత్తున మరో సారి ఉద్యమించారు. ఇందులో భాగంగా సెప్టెంబరు నుంచి అక్టోబర్ 5 వరకు బసవ సంస్కృతి యాత్ర పేరుతో లింగాయత్ సంఘాల ఐక్యకూటమి నాయకత్వంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. దీనికి అస్థిత్వ ఉద్యమ లక్షణాలు ఉన్నాయి. ప్రతి అస్థిత్వ ఉద్యమాన్ని దేనికదే విశ్లేషణ చేసి అది తిరోగామి లేదా పురోగామి స్వభావం కలిగినదా అన్నది చూడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎంఏ అరుణ్ రాసిన విశ్లేషణను ది వైర్ తెలుగు పాఠకులకు అందిస్తున్నాం.**

తమను ప్రత్యేక మతంగా గుర్తించాలంటూ వందలాది మంది లింగాయత్ నేతలు కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా 2025 సెప్టెంబరులో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. వీరిలో ప్రముఖ, ఇప్పుడిప్పుడే ఉనికిలోకి వస్తున్న మతాలకు చెందిన అధిపతులందరూ ఉన్నారు. లింగాయత్ నేతలు, స్వాములతో కూడిన శక్తివంతమైన లింగాయత్ మతాధీశుల ఐక్య కూటమి సంస్థ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో లక్షలాది మందిని సమీకరించి ప్రచారం జరిపారు.

### సభలలో సమతా భావాల సందేశాలు..

భారీ ఎత్తున జరిగిన సభల్లో హిందూయేతరులుగా గుర్తింపు తెచ్చుకోవాలని లింగాయత్‌లకు వక్తలు పిలుపునిచ్చారు. అంతేకాకుండా లింగాయత్ మతానికి చట్టపరంగా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పన్నెండవ శతాబ్ది బోధకుడు బసవ, ఆయన సమకాలికులు ప్రబోధించిన అంతర్గాహ్యమైన, హేతుబద్ధ, సమతా భావనలను అనుసరించాలని ఉద్బోధించారు. ప్రజాస మూహాల నుంచి వచ్చిన స్పందనకు అనుగుణంగా ప్రత్యేక మతం గుర్తింపు గురించి నొక్కివక్కాణించారు. బసవ సంస్కృతి యాత్రను సెప్టెంబరులో ప్రారంభించి అక్టోబరు 5న బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ముగించారు. ఈ ముగింపు సభకు



చాలా మంది స్వాములు, లక్షలాది మంది జనం హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని 30 జిల్లాల్లో ఈ యాత్ర సాగింది. ప్రతి జిల్లాలో ఒక రోజు కార్యక్రమం జరిగింది. ప్రతి చోట మూడు భాగాలుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం పూట విద్యార్థులతో ప్రశ్నలు-సమాధానాలు, మధ్యాహ్నం భారీ ప్రదర్శనలు, సాయంత్రం లింగాయత్ విశ్వాసంపై నిపుణులతో బహిరంగ సభలలో ఉపన్యాసాలను ఇప్పించారు.

### నిర్మొహమాట చర్చలలో ఇబ్బంది పడ్డ స్వాములు..

బాగల్‌కోట్‌లో జరిగిన కార్యక్రమంలో, "నిజంగా మహిళా సాధికారత కోసం బసవ పని చేస్తే, వేదికపై కేవలం పురుష స్వాములే ఎందుకు ఆసీనులయ్యారు" అని ఒక హైస్కూలు బాలిక స్వాములను ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు స్వాముల నుంచి సమాధానం రాలేదు. ఆ ఉదంతం తరువాత స్వాములు మరింత కలవరపడ్డారు. దీర్ఘకాలం ఖాళీగా కూర్చొని సంఘ్ పరివార్ పుంజుకొనేందుకు అవకాశం ఇచ్చారని చామరాజ నగర సభలో ఒక కార్యకర్త మీనాక్షీ బాలి స్వాములను తప్పుపట్టారు. "కొన్ని దశాబ్దాల క్రితమే మీరు ఈ పని చేసి ఉంటే, మన రాష్ట్రం సురక్షిత ప్రాంతంగా మారి ఉండేదని" ఆమె చెప్పారు. ఆ తరువాత ప్రసంగించిన ఇలక్కల్ స్వామి ఆ విమర్శను హుందాగా అంగీకరించారు.

ఐక్య కూటమి నేతలు ఎక్కువ మంది 70వ పడిలో ఉన్నారు. వారికి ఒక శిక్షలా కార్యక్రమాలను ఏర్పాటు చేసినప్పటికీ వారు సకాలంలో వాటిని పూర్తిచేశారు. పన్నెండు గంటలపాటు సాగిన కార్యక్రమంలో పాల్గొని తదుపరి కార్యక్రమం కోసం రాత్రి సమయాల్లో వందల కిలోమీటర్లు ప్రయాణించి, మరుసటి రోజు

ఉదయం పది గంటలకల్లా సిద్ధంగా ఉండేవారు. ఒక కీలక నిర్వాహకుడు సానేహళ్లి పండితారాధ్య స్వామి సమయపాలనలో నిక్కచ్చిగా ఉన్నారు. మొత్తం కార్యక్రమాలను సకాలంలో నిర్వహించేందుకు కొన్నింటిని అర్ధంతరంగా ముగించేసేవారు.

**ప్రత్యేక మతం కోసం డిమాండ్..**

వివక్షా పూరితమైన హిందూ మత ఆచారాలు, మత గ్రంథాలకు వ్యతిరేకంగా బసవ ఆయన సమతుల్యులు, అనుచరులు పన్నెండవ శతాబ్దిలో వైదికేతర సమభావన ప్రత్యామ్నాయాన్ని సృష్టించారు. చరిత్ర అంతటా లింగాయత్‌లను హిందూయేతర సామాజిక తరగతిగానే పరిగణించారు. ఆదిల్ షాహి రాజులు జిజియా-మతపరమైన పన్ను - విడివిడిగానే హిందువులు, లింగాయత్‌ల మీద విధించారు. తొలిసారిగా 1871లో జరిపిన మైసూరు జనగణనలో లింగాయత్‌లను ప్రత్యేక మతంగా పరిగణించారు. తీవ్రమైన వివాదం జరుగుతుండగానే వారిని 1881 తరువాతే హిందువులుగా లెక్కించాలనే నిర్ణయానికి వచ్చారు. శతాబ్దాల తరబడి హిందూ ప్రభావం పెరిగిన కారణంగా వైదికేతర మూలాల నుంచి లింగాయత్‌లు దూరమయ్యారు.

పన్నెండవ శతాబ్దంలో లింగాయతులు తమ ప్రాంతం నుంచి వివిధ చోట్లకు వలస వెళ్లారు. వారితోపాటు చెల్లాచెదురైన ప్రధానమైన లింగాయత్ మత బోధనలకు సంబంధించిన వచనాలను (ప్రవచనాల సాహిత్యాన్ని) కనుగొనే ప్రక్రియ గత వంద సంవత్సరాలుగా పెరుగుతోంది. లింగాయత్ మతానికి చెందిన విప్లవాత్మకమైన వైఖరులు వెలుగులోకి వస్తున్నాయి. అనేకమంది కార్యకర్తలు, స్వాములు, పండితుడైన ఎంఎం కల్బుర్గి (హిందుత్వ శక్తులు 2015 ఆగస్టు 30న ఆయనను కాల్చి చంపారు -ఎడిటర్) వంటి వారు సంస్కృతీ (సంస్కృతం) కరణకు గురైన లింగాయతులను వెనక్కు మళ్లించేందుకు, ఉద్యమ అసలు సిసలు భావనలను తిరిగి పాదుకొల్పేందుకు ప్రచారాన్ని ప్రారంభించారు.

ప్రత్యేక మతంగా గుర్తింపును కోరుతూ గత శతాబ్దిలో అడపాదడపా లింగాయతులు ఆందోళనలు నిర్వహించారు. ఆ ఉద్యమం 2017- 18లో ఊపందుకుంది. అనేక పట్టణాల్లో భారీ ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. తరువాత కాస్త తగ్గినప్పటికీ ఇప్పుడు తిరిగి ఉనికిలోకి వస్తున్నది. గత కొన్ని దశాబ్దాలుగా బసవ అనుచరులుగా ఉండే దాదాపు వెయ్యి స్వచ్ఛంద సంస్థలు లింగాయత్ మతాన్ని వ్యాపింపజేసేందుకు రాష్ట్రంలో పని చేస్తున్నాయి. అవి ప్రార్థనా సమావేశాలు జరిపాయి. నిజమైన ఆచారకర్మల ఆచరణకు, వచనాలకు భాష్యం చెప్పేందుకు చర్చలు నిర్వహించాయి. హిందూ ఆచార కర్మల కంటే భిన్నంగా లింగాయతుల కర్మలు ఉంటాయి. ఖర్చు కూడా తక్కువే. అంతే కాకుండా మూఢ నమ్మకాలను లింగాయత్‌లు తిరస్కరించారు. పూర్తిగా వచనాల ప్రాతిపదికను ఉనికిలోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. లింగాయత్ ఆచారం ప్రకారం భౌతిక శాస్త్ర ఆచార్యుడు హెచ్‌ఎం సోమశేఖరప్ప ఇటీవలనే గృహప్రవేశ క్రతువు నిర్వహించారు. "నేను పూర్తి కార్యక్రమానికి 200 రూపాయలు మాత్రమే ఖర్చు చేశాను. అదే హిందూ క్రతువుకు ఒక లక్ష రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది" అని చెప్పారు.

ప్రత్యేక మత గుర్తింపు డిమాండ్‌ను ప్రాతిపదికగా చేసుకొనేందుకు 2017- 18లో జరిగిన ప్రజా ప్రదర్శనలు సైద్ధాంతికంగా ఒక స్పష్టతనిచ్చాయి. ఈ సంస్థలు ఇప్పుడు ఐక్యకూటమితో చేతులు కలిపి యాత్రకు భారీ ఆదరణ వచ్చేట్లు చేశాయి.

ఎంతో ప్రభావం చూపే జగతిక(ప్రపంచ) లింగాయత్ మహాసభ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం జామదార్ మాట్లాడుతూ, "ఈ యాత్రకు మేము ఊహించినదానికంటే ప్రతి చోటా స్పందన ఎంతో ఎక్కువగా ఉంది. మేము చెబుతున్నది ఏమిటి అని అర్థం చేసుకొనేందుకు జనాలు 2017-18లో ఎంతో ప్రయాసపడ్డారు. కానీ అప్పటి నుంచి లింగాయత్ మతాన్ని ప్రత్యేకంగా గుర్తించాలనే చైతన్యం అనూహ్యంగా పెరిగింది. ఇప్పుడు అది దిగువ స్థాయికి చేరిన ఉద్యమంగా మారింది" అన్నారు. మాజీ ఐఎఎస్ అధికారి, ఎంతో గౌరవనీయ పండితుడైన జామదార్ లింగాయత్ ఉద్యమాన్ని వ్యాపింపజేస్తున్నారు.

**విస్తృతమౌతున్న సంఘర్షణ..**

గతేడాది డిసెంబరులో యాత్ర గురించి ఐక్య కూటమిలో ఒక సీనియర్ నేత విలేకర్లతో మాట్లాడారు. సంఘ్ పరివార్ నుంచి లింగాయత్ యువతను వెనక్కు తీసుకురావటం తమ ప్రచార ముఖ్య లక్ష్యమని చెప్పారు. అయితే యాత్ర సమయం దగ్గరపడిన కొద్దీ ఐక్యకూటమి ఒక నిర్ణయం తీసుకుంది. ఏ సంస్థ లేదా ఏ మతాన్ని విమర్శించకూడదని, లింగాయత్ సమాజంలోని మితవాదులు తప్పుదారి పట్టించకుండా లేదా వారిని దూరంగా పెట్టేందుకు కేవలం లింగాయత్ మత గుర్తింపు మీద మాత్రమే కేంద్రీకరించాలని నిర్ణయించారు.

మహారాష్ట్రలో శివాజీ మాదిరి కర్ణాటక ప్రభుత్వం 2024లో "రాష్ట్ర సాంస్కృతిక నాయకుడు బసవన" అని ప్రకటించింది. తాము హిందువులం కాదని, బసవన తమ మతగురువని లింగాయతులకు గుర్తు చేస్తూ, వచనాలే తమ పవిత్ర మతశాస్త్ర సూత్రాలని ప్రకటించేందుకు యాత్రను తొలి వార్షికోత్సవంగా పరిగణించాలని ఐక్య కూటమి స్వాములు చెప్పారు.

బసవ సంఘాల సంఘటిత వైఖరి, ప్రజాకర్షక విజ్ఞప్తి సంఘ్ పరివార్ రాజకీయాలకు రాష్ట్రంలో ఒక విరుగుడని కర్ణాటకలో అనేక మంది భావిస్తున్నారు. ప్రభుత్వం 2024లో చేసిన ప్రకటన లింగాయతుల్లో పెద్ద ఉద్వేగాన్ని రేకెత్తించింది. బసవ సంస్థలు తమ కార్యకలాపాలను పెంచాయి. అనుకోకుండానే సంఘ పరివార్‌తో తమ విరోధ తీవ్రతను పెంచాయి.

లింగాయత్‌ల ఓట్లు నష్టపోవటం తమ ఓటమికి ఒక కారణమని 2024 ఎన్నికల దెబ్బ తరువాత సంఘ్ పరివార్ ఆరోపించింది. ప్రత్యేక మత డిమాండ్‌కు పెరుగుతున్న మద్దతును అరికట్టేం దుకు, దూరమైన వారిని తిరిగి వెనక్కు తెచ్చుకొనేందుకు అది అనేక కార్యక్రమాలను చేపట్టింది. వచన దర్శన పేరుతో ఒక పుస్తకాన్ని తీసుకువచ్చింది. బసవన చెప్పిన వచనాలు, శరణులు వైదిక హిందూయిజంలో కేవలం ఒక శాఖ మాత్రమే అని దాని లో చెప్పారు. ఆ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఎంతో అట్టహా సంగా రాష్ట్రంలోని పట్టణాలన్నింటా జరిపారు. శరణార శక్తి పేరుతో ఒక సినిమా విడుదల చేశారు. లింగాయత్ ఉద్యమం హిందూ సాంప్రదాయంలో అంతర్లీనమే అని దానితో చెప్పించా రు. లింగాయత్‌లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు, పుస్తకాన్ని దహనం చేశారు. సినిమాలో అనేక కోతలు పెట్టాల్సి వచ్చింది.

సంఘ్ పరివార్ వాదనలకు సమాధానంగా వారు రెండు పుస్తకాలను తీసుకువచ్చారు. పలు నగరాల్లో వాటిని ఆవిష్క రించారు. దీనికి ప్రతిగా తమ శిబిరంలో ఉన్న లింగాయత్ నేత లు, స్వాములతో నూతన పదజాలాన్ని సృష్టించారు. తమ భావ జాల వ్యతిరేకులను బసవ తాలిబాన్లు అని నిందించారు. “ఈ యాత్ర ఒక విషయాన్ని స్పష్టం చేసింది. మాకున్న వనరులు, భావజాలం, రాష్ట్రంలో మేం ఎక్కడ కావాలనుకుంటే అక్కడ ఎంత పెద్ద సభలను నిర్వహించగలమో మా ప్రత్యర్థులకు చూపింది. మేం ఎవరికీ వ్యతిరేకం కాదు, మా లక్ష్యాన్ని చేరేవరకు మేము ఆగేది లేదు” అని ఐక్య కూటమిలో చురుకుగా పని చేసే ఒక స్వామి అన్నారు.

## వీర శైవుల్లో బేధాలను పెంచుతున్నది..

ప్రత్యేక మతం కోసం పెరుగుతున్న మద్దతు వీరశైవుల్లో బేధాలను పెంచుకుతున్నది. వీర శైవులు లింగాయతుల్లో ఉన్న వంద ఉపకులాల్లో ఒకరు. వారిని పంచాచార్యులు (ఐదుగురు) నడిపిస్తున్నారు. బ్రాహ్మణ తరగతిలో మూలాలు ఉన్నవారు బసవ ఉద్యమంలో చేరారు. ఇతరులు అత్యధికంగా వెనుకబ డిన, దళిత సామాజిక తరగతులకు చెందిన వారు లింగాయత్ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నారు.

## పంచాచార్యులెవరు ?

వీర శైవ సామాజిక తరగతిని ఐదుగురు ప్రముఖ స్వాములు నడిపిస్తారు. వారికి కేదార్‌నాథ్, వారణాసి, కర్ణాటకలోని ఉజాని, రంబాపురి, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలలో మఠాలు ఉన్నాయి. వారందరినీ కలిపి పంచ(ఐదుగురు) ఆచార్యులు(ప్రబోధకులు) అంటారు. కర్ణాటకలో ఈ మఠాలకు కొన్ని జిల్లాల్లో శాఖలు ఉన్నాయి. వీరశైవులు బసవ ప్రభావం కిందికి వచ్చినప్పటికీ వారు నిజమైన వేదాచరణను కొనసాగిస్తున్నారు. లింగాయతుల్లో పూజారులుగా ఉండేందుకు ఉన్నత సామాజిక హోదాను



వినియోగించుకుంటున్నారు. నిజమైన బసవ ఉద్యమం అలాంటి పూజారులను తిరస్కరించినప్పటికీ అది కొనసాగింది. శతాబ్దాల తరబడి లింగాయతుల్లో హిందూ విశ్వాసాలను విస్తరింపచేసేం దుకు, కర్మకాండలను కొనసాగించేందుకు సాధనాలుగా మారా రు. వారు తమ సామాజిక తరగతి మొత్తాన్ని వీరశైవ లింగాయ తులుగా పిలిపించుకొనేంత ప్రభావశీలురుగా పెరిగారు. లింగా యతులు తమ వైదికేతర మూలాలకు తిరిగి వచ్చేందుకు సంఘ టితం అవుతున్నారు. అదేవిధంగా వీరశైవ ప్రభావం నుంచి దూరం జరుగుతున్నారు. ఇటీవల వీరశైవ స్వాములతో లింగా యతులు ఘర్షణలకు దిగుతున్నారు. తమ అనుచరుల సంఖ్య తగ్గుతుండటంతో వారు మేలుకొని తమ అదుపులో ఉంచుకొనేందుకు దిక్కుమాలినదారులు వెతుకుతున్నారు.

## ప్రతి క్రియలు..

తమకు ప్రత్యేక గుర్తింపు కావాలని యాత్ర నొక్కి వక్కాణ ిస్తుండటంతో జనబాహుళ్య మద్దతు వెల్లడౌతున్నది. అది హిందూత్వ, వీరశైవ మద్దతుదార్ల నుంచి తీవ్ర ప్రతిక్రియలకు దారితీస్తున్నది. అసలు బసవ ఎలాంటి నూతన మతాన్ని ప్రారంభించలేదని, కొన్ని కంపెనీలు దాన్ని తయారుచేశాయని హిందూత్వ-లింగాయత్ రాజకీయవేత్త బసన గౌడ యత్నాల్ అన్నారు. ఆలిండియా వీరశైవ మహాసభ-(ఇది లింగాయత్ సంస్థలలో చాలా పాతది, ప్రధానంగా యడ్యూరప్ప వంటి రాజకీయవేత్తలకు చెందిన సంస్థ, లింగాయత్, వీరశైవ ఓటు బ్యాంకును పదిలంగా ఉంచేందుకు చూస్తున్నది) రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత పోలీసు డైరెక్టర్ జనరల్ శంకర్ బిదారి మాట్లాడుతూ, సమాజాన్ని ముక్కలు చేసేందుకు రోగపూరితమైన మెదళ్లు కలవారు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇతగాడు ఆర్‌ఎస్‌ఎస్‌తో వేదికను పంచుకున్నారు, లింగాయతులు హిందు వులు తప్ప ప్రత్యేక మతం కాదని చెబుతారు. కమ్యూనిస్టు స్వాముల బృందం ఒకటి సమాజాన్ని తప్పుదారి పట్టించేందుకు చూస్తున్నదని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ రచయితలు ఆరోపించారు. బెంగళూరులో వీరశైవ మద్దతుదారుల బృందం ఒకటి యాత్ర సభను అడ్డుకొనేందుకు ప్రయత్నించింది. ఇరువర్గాలు చేతులు కలపటమే తరువాయి అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

"గోడీ మీడియా బసవ యాత్రకు వ్యతిరేకం. ఎక్కడైనా ఒక ఘర్షణ జరిగితే దాన్ని జాతీయ వివాదంగా మార్చి యాత్రను పక్కదారి పట్టించేది. అలాంటిది చోటు చేసుకోకుండా మా వారిని అదుపుచేశామ"ని భౌతికశాస్త్ర ఆచార్యుడు సోమశేఖరప్ప చెప్పారు. అదే వీరశైవ బృందం మరుసటి రోజు హసన్ వెళ్లి అక్కడ యాత్రలో భాగంగా సాయంత్రం జరిగిన సభను విచ్ఛిన్నం చేసింది. అయితే పోలీసులు, స్థానిక స్వామి 15 నిమిషాల తరువాత సభను ప్రారంభింపజేశారు.

యాత్ర ముందుకు కొనసాగుతుండగా రెండు సామాజిక తరగతుల మధ్య ఐక్యత కొనసాగాలనే పేరుతో వీరశైవ స్వాములు పోటీగా హుబ్లీలో సెప్టెంబరు 19న ఏక్తా సమావేశ పేరుతో ఒక సభను ఏర్పాటు చేశారు. కనీసం ఒక లక్ష మందిని సమీకరిస్తామని వారు చెప్పినప్పటికీ ఒక అంచనా ప్రకారం కేవలం ఏడు వేల మంది మాత్రమే వచ్చారు. సమావేశంలో వక్తల మధ్య ఏకాభిప్రాయం లేక గందరగోళం జరిగింది. వేదిక మీద ఉన్న బీజేపీ నేతలు తాము హిందువులమని ప్రకటించుకోవాలని లింగాయతులను కోరారు. వీరశైవ మహాసభ నేతలు వీరశైవ లింగాయతులు ప్రత్యేక మతమని పిలుచుకోవాలని కోరారు. తమను చూసి జనం వస్తారని వీరశైవ స్వాముల స్వంత పలుకుడి మీద ఆధారపడ్డారు.

లింగాయత్ స్వాములు అంటే ఆ సమాజంలోని వెనుకబడిన తరగతులు, దళితులతో కూడిన విశాల ప్రాతిపదికన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారికి రాష్ట్రమంతటా ఉన్న బసవ సంస్థల మద్దతు కూడా ఉంది. దాంతో వారికి సంఘటిత శక్తి లభించింది. తమ పలుకుబడి చెల్లదని వీరశైవ స్వాములు గుర్తించలేదు. "అర్థం పర్థం లేని క్రతువులకు కట్టుబడి ఉండటం కాకుండా వ్యక్తులు, సామాజిక అభివృద్ధిని కోరిన బసవతత్వానికి జనాలు స్పందించారు" అని హుబ్లీ కేంద్రంగా ఉన్న ఒక లింగాయత్ స్వామీజి చెప్పారు.

**లింగాయత్‌లకు ఒక నూతన మార్గదర్శనం..**

కర్ణాటకలో కులగణన అంశం ఒక సమీకరణ పోటీగా మారింది. లింగాయత్ స్వాములు లింగాయత్‌లుగా, వీరశైవ స్వాములు వీరశైవ లింగాయత్‌లుగా, సంఘ్‌పరివార్ మద్దతుదార్లు హిందువులుగా తమ గుర్తింపును కోరాలని ఎవరికి వారు పిలుపునిస్తున్నారు. ఈ చంచలమైన స్థితిలో ఈ యాత్ర పురోగామి లింగాయత్ స్వాముల గళం ప్రధానమైనదిగా ఆవిర్భవించే సాధికారత కలిగించింది. విశాలమైన సామాజిక సంఘటన ఏర్పాటుకు వారు లింగాయేతర సామాజికుల వద్దకు చేరారు. యాత్ర సందర్భంగా స్వాములకు అంబేద్కర్ విగ్రహాలు ఎదురైన ప్రతిచోటా ఊరేగింపును ఆపి పుష్పాంజలి ఘటించారు. బసవ వచనాల ఆదర్శాలకు అనుగుణంగా అదే అజెండాతో భారత రాజ్యాంగ రచనకు అంబేద్కర్ పనిచేశారనే ఏకాభిప్రాయం లింగాయత్ స్వాముల్లో ఉంది. అనేకచోట్ల లింగాయత్‌లు–దళితుల మధ్య వివాదాలు ఉన్నప్పటికీ తమ స్వంత బోధకుల నుంచి లింగాయత్ సమాజం ఈ సందేశాన్ని ఆలకించటం పెరిగింది. అవసరమైతే ఉన్నత స్థానాల్లో వున్న స్వాములు వెనక్కు తగ్గి వెనుకబడిన తరగతులు, దళిత స్వాములను ముందుకు తేవాలని యాత్ర ఆకాంక్షించింది. కులబేధాలను పాటించేవారిగా కనిపిస్తున్న వీరశైవ స్వాములతో వెనుకబడిన తరగతుల స్వాముల సంబంధాలు పరుషమైనవిగా ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. దానికి భిన్నంగా లింగాయత్ స్వాములు సాంఘికంగా కలుపుగోలు తనం, కట్టుబడిన బసవ అనుచరులుగా ఉన్నట్లు వారు వర్ణించారు. ఉడిపి, మంగళూరుల్లో లింగాయత్‌ల సంఖ్య స్వల్పం. అక్కడ ముస్లిం, క్రైస్తవ బృందాల సాయంతో యాత్ర నిర్వహించారు. మైనారిటీలు నిర్వహించిన మతపరమైన ఊరేగింపుల్లో, కార్యక్రమాల్లో స్వాములు భాగస్వాములైనపుడు తరచుగా మితవాద బృందాలు వారిపై దాడులు చేసిన నేపథ్యాన్ని చూసినపుడు ఇదొక ముఖ్యమైన అంశం.

ఇద్దరు లింగాయత్ స్వాములు ప్రత్యేకించి సానేహళ్లి పండితారాధ్య స్వామి, బైలూరు నిజగుణ ప్రభుస్వాముల సంగతి చూడాలనే మితవాద వాతావరణం ఉంది. వినాయక ఆరాధన నిలిపివేయాలని రెండేళ్ల క్రితం పండితారాధ్య స్వామి లింగాయత్‌లను కోరినప్పటి నుంచి వార్తలలోని వ్యక్తిగా మారారు. మితవాద మీడియా అతన్నొక భూతంగా, లింగాయతుల్లో అతను ఒంటరి అన్నట్లుగా చిత్రించింది. అతని సంస్థాపరమైన సామర్థ్యాలు యాత్రలో పెద్ద పాత్ర పోషించాయి. ఒక పలుకుబడి కలిగిన లింగాయత్ స్వామిగా ముందుకు వచ్చారు. నిర్మొహమాటంగా మాట్లాడే నిజగుణ ప్రభుస్వామి లింగాయత్ మతం కోసం దూకుడుగా ప్రచారం నిర్వహించేవారిలో ఒకరు. చంపేస్తామనే బెదిరింపులు, న్యాయపరమైన చిక్కులతో తన గళాన్ని కాస్త తగ్గించినా ఇప్పటికీ హిందూత్వ బృందాల లక్ష్యంగానే ఉన్నారు. ఈ యాత్ర సందర్భంగా సభల్లో అతిసాహసవంతుడిగా జనం దృష్టిలో పడ్డారు. ఎంతో పేరు ఉన్న తన మఠ వార్షిక కార్యక్రమాల సందర్భంగా ముస్లింలను దూరంగా ఉంచాలన్న శ్రీరామ సేన చేస్తున్న డిమాండ్‌ను తిరస్కరించటంతో, తరచూ గదక్ సిద్ధరామ స్వామిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. బెంగళూరులో పత్రికా సమావేశం నిర్వహించేందుకు యాత్ర నుంచి ఆయన విరామం తీసుకున్నారు. విలేకర్ల సమావేశంలో సంఘ్‌పరివార్ మద్దతుదా రులైన జర్నలిస్టులు ప్రతికూలమైన ప్రశ్నలతో ధ్వజమెత్తారు. హిందూయేతరులమని గుర్తింపు కోరటం జాతివ్యతిరేకమైనదేమీ కాదని ఇప్పుడు సిక్కులు చేస్తున్న మాదిరే లింగాయత్‌లు కూడా జాతికి తమ వంతు కృషి చేస్తారని

**(మిగతా 46వ పేజీలో)**

# పాకిస్థాన్‌ను ముంచిన మతమౌఢ్యం

- మొహమ్మద్ ఇర్ఫాన్

మతాన్ని కేంద్రంగా చేసుకుని పరిపాలిస్తే ఒక దేశం ఏ విధంగా వెనుకబడిపోతుందనేది పాకిస్థాన్‌ను పరిశీలిస్తే అవగతమవుతుంది. మత ప్రాతిపదికన ఏర్పడిన దేశమది. తొలి నుంచీ అనుసరించిన మత ప్రేరిత విధానాల వల్ల పాకిస్థాన్ అన్ని రంగాలలో వెనుకబడి పోయింది. ఇటీవల ఖతర్ పర్యటన నుంచి స్వదేశానికి తిరిగి వెళ్లిన పాకిస్థాన్ ప్రధాని షహెబాజ్ షరీఫ్ 'తాము 75 ఏళ్ళుగా బిక్షాటన చేస్తున్నట్లు' వాపోయారు!

1947లో స్వతంత్ర దేశంగా ఆవిర్భవించినప్పుడు పాకిస్థాన్‌కు వ్యవసాయమే ప్రధాన ఆదాయవనరు. పాకిస్థాన్ భౌగోళికంగా భారత్‌కంటే చిన్న దేశమే అయినప్పటికీ సమృద్ధ జలవనరులు, సారవంతమైన సాగు భూములకు నెలవైన పంజాబ్ కారణాన పాక్ ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉండేవి. అవిభక్త భారత్ విభజన నాటికి ఉన్న 921 ప్రధాన పరిశ్రమలలో కేవలం 34 మాత్రమే పాక్‌కు దక్కాయి. అవి కూడా ప్రధానంగా బెంగాల్ లోని జనపనార పరిశ్రమలు మాత్రమే. 1950లో పాకిస్థాన్ తలసరి ఆదాయం 1268 డాలర్లు. ఇది అప్పట్లో భారత్ తలసరి ఆదాయంకంటే దాదాపు రెండు రెట్లు అధికం.

అయితే కశ్మీర్‌ను స్వాయత్తం చేసుకోవడమే పాక్ జాతీయ రాజకీయాల ప్రధాన లక్ష్యమయింది. ఆ లక్ష్య సాధనకై భారత్‌కు వ్యతిరేకంగా యుద్ధాలకు తెగబడింది. ఈ యుద్ధాలు, రాజకీయాల వల్ల పౌర, సైనిక పాలకులు పలు విధాల ప్రయోజనాలు పొందారు. అయితే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లడంలో విఫలమయ్యారు. దేశాన్ని అత్యధిక కాలం ఏలిన సైనికాధికారులు ఇస్లామిక్ భావజాలంతో కశ్మీర్‌ను బూచిగా చూపి పంజాబీలు, సింధీలు, బలూచీలు, పఠాన్లు, మహాజీర్లుగా విడిపోయిన దేశాన్ని ఒక్కటిగా నిలబెట్టారు. అయితే దానితో పాటు దేశ బడ్జెట్ కేటాయింపుల్లో సింహభాగాన్ని రక్షణ శాఖకు దక్కించుకోవడంలో సఫలీకృతులయ్యారు.

సోవియట్ యూనియన్, అమెరికా మధ్య ప్రచ్ఛన్న యుద్ధంలో పొరుగున ఉన్న అఫ్ఘానిస్థాన్ ఒక పావుగా మారింది. పాక్ సైన్యంలో స్వతహాగా అత్యధికులుగా ఉన్న పఠాన్ల అంశం, ఆఫ్ఘాన్‌లోని పరిణామాలు సహజంగా ఇస్లామాబాద్‌కు అంతర్జాతీయంగా ఒక సముచిత పాత్రను కల్పించాయి. సోవియట్ ఎర్రసేనలను దెబ్బ తీయడానికి అమెరికా జిహాద్‌ను ప్రోత్సహించి పాకిస్థాన్‌కు అన్ని రకాలుగా అండగా నిలిచింది. జనరల్ జియా ఉల్ హఖ్ హయాంలో ఈ జిహాద్ ఉగ్రవాదం పరాకాష్ఠకు చేరుకుంది. అమెరికా మద్దతుతో ఇస్లామాబాద్ పాలకులు ఆడింది ఆట పాడింది పాట అయింది. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత జిహాద్ నుంచి అమెరికా వైదొలిగినా ఆ భావజాలం మాత్రం అదే విధంగా పాక్ రాజకీయాలు, సమాజం లోనూ దృఢంగా ఉండిపోయింది.

విద్య, మౌలిక వసతుల అభివృద్ధిలోనే కాదు అన్నింటా దేశ పురోగతి క్రమేణా కుంటుపడిపోయింది. విద్యార్థులకు నవీన, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే అంశాలకంటే మధ్య యుగం నాటి ముస్లిం రాజుల యుద్ధాలు వగైరా గూర్చి ఎక్కువగా బోధిస్తారు. నాణ్యమైన విద్యాలేమి కారణాన అక్కడి యువత విదేశీ ఉద్యోగ విపణిలో అవకాశాలను అందుకోలేకపోతోంది. పాకిస్థానీ ప్రవాసుల సంఖ్య 80 లక్షలు కాగా, అదే భారతీయ ప్రవాసుల సంఖ్య ఒక కోటీ 80 లక్షలు (విదేశాలలో పౌరసత్వం కలిగి ఉన్న వారి సంఖ్య దీనికి అదనం). విదేశాలలో భారతీయులు అన్ని రంగాలలో నిపుణులుగా ఉండగా పాకిస్థానీయులు నిమిత్తమాత్ర కార్మికులుగా ఉన్నారు, లేదా చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తున్నారు. భారతదేశం అనతి కాలంలోనే శరవేగంగా పురోగమనం వైపు పయనించగా పాకిస్థాన్ మతమౌఢ్యంలోకి జారిపోయింది. ఈ వాస్తవాన్ని గ్రహించే సరికి పాకిస్థాన్‌కు పుణ్యకాలం దాటిపోయింది. దేశం పూర్తిగా దివాలా తీసి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏమి చేయలేని నిస్సహాయ స్థితి లోకి దిగజారిపోయింది. తాము 75 ఏళ్ళుగా బిచ్చమడుక్కుంటున్నామన్న ప్రధానమంత్రి షహెబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలో వాస్తవం ఉంది. పాకిస్థాన్‌కు 200 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయం చేయడానికి ఖతర్ ముందుకు వచ్చింది. సౌదీ అరేబియా, కువైత్ దేశాలు కూడ పాక్‌ను అన్ని విధాల ఆదుకోవడానికి ముందుకు వస్తున్నాయి. ఇస్లాం అధికారిక మతమైన గల్ఫ్ దేశాలు వివేకంతో మతానికి, పరిపాలన మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయడం వలన అన్నిరంగాలలో పురోగమిస్తున్నాయి. సామరస్యం, సహనశీలత భారత పుణ్యభూమిలో స్వతస్సిద్ధంగా ఉంది. ఇది ఒక పార్టీ లేదా ప్రభుత్వం చట్టం చేయడంతో వచ్చింది కాదు. వసుధైక కుటుంబంగా తరతరాలుగా అన్ని సమూహాలను మమేకం చేసుకుని ప్రగతిశీలంగా ముందుకు సాగుతోంది. అలాంటి మనం ఇప్పుడు ధార్మిక భావోద్వేగాలను మాత్రమే కేంద్రంగా చేసుకొని రాజకీయాలు నడపడం, పాలన చేయాలనుకోవడం నిస్సందేహంగా తిరోగమనమే.. ❑

# ఉదారవాదం తిరోగమిస్తున్న శకంలో భారతీయ ఫాసిజమ్



\- శివసుందర్

**ఈనాటి భారతదేశంలోని ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు బీజేపీని ఎన్నికల రంగంలో వ్యతిరేకించవచ్చు. కానీ అవి భారతీయ ఫాసిజానికి వున్న బ్రాహ్మణీయ, కార్పొరేట్ పునాదులను సవాల్ చేయడం లేదు. "ప్రతి దేశం దానికి తగిన ఫాసిజాన్ని పొందుతుంది" అని ప్రఖ్యాత మార్క్సిస్టు సిద్ధాంతవేత్త ఐజాజ్ అహ్మద్ ఎన్నడో చెప్పారు. భారతదేశంలో ఫాసిజానికి ప్రతిరూపమైన ఆర్ఎస్ఎస్ భావజాల మూలాల గురించిన చర్చ లేకపోయినప్పటికీ, బీజేపీ పాలనలో భారతదేశాన్ని ఫాసిస్టు దేశంగా వర్గీకరించవచ్చా లేదా అనే అంశం మీద పెద్ద చర్చ జరుగుతోంది. ఈ చర్చ 20వ శతాబ్దంలో రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో ఐరోపాలో ఆవిర్భవించిన సాంప్రదా యక ఫాసిజం/నాజీయిజంల మధ్య సూక్ష్మస్థాయిలో వున్న పోలికలను గురించిన చర్చగా మారుతోంది.**

ఫాసిజమైనా, అలాంటి ఏ ఇతర భావజాలమైనా ఒక నిర్దిష్ట సమయంలో ఆవిర్భవించడానికి కొన్ని ప్రత్యేక పరిస్థితులు వుంటాయి. అదే సమయంలో వాటి మధ్య అనేకమైన విశ్వజనీనమైన సారూప్యతలు వుంటాయి. ఫాసిజం ఓడించబడిందా అనే చర్చకు సమాధానం ఇస్తూ 1967లో జీన్ పాల్ సార్త్ ఇలా అన్నారు. "ఫాసిస్టు భావజాలానికి, ఉద్యమాలకు, పరిపాలనకు అవకాశమిచ్చిన సాంఘిక, ఆర్థిక పరిస్థితులు ఇప్పటికీ వర్ధిల్లుతూ వుండడమే దానికి కారణం."

1925లో స్థాపించబడిన ఆర్ఎస్ఎస్ అతి దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఫాసిస్టు ఉద్యమాలల్లో ఒకటి. సమాజాన్ని, రాజకీయ వ్యవస్థను ఫాసిస్టీకరణ చేయడం ద్వారా (అదే పనిగా సైద్ధాంతికంగా, రాజకీయంగా, భౌతికంగా దాడులు చేయడం ద్వారా ప్రజాస్వామిక విలువలను, రాజకీయాలను నాశనం చేయడం) మాత్రమే ఫాసిస్టు ఉద్యమం లేదా ఫాసిస్టు పార్టీ కొనసాగగలదని ప్రపంచ చరిత్ర నిరూపించింది. పెట్టుబడిదారీ సంక్షోభం పెరిగి పెద్దదై, సాంఘిక సంక్షోభాలకు, ఘర్షణలకు గురైన సమాజాలలో కూడా ఇది సాధ్యం.

2014లో నరేంద్ర మోడీ నాయకత్వాన బీజేపీ తన స్వంత



బలం మీద అధికారాన్ని సంపాదించుకుంది. ఆ తర్వాత 2019 లో అంతకంటే బలమైన ఓటర్ల మద్దతును పొందింది. దీనికి కారణం అది విభజన రాజకీయాల ఎజెండాను లోతుగా తీసుకు వెళ్ళడమే. ఇది జరిగిన తరవాత భారతదేశంలోని వామపక్ష, అభ్యుదయ శ్రేణులలో తీవ్రమైన చర్చలు ప్రారంభమయ్యాయి. భారతదేశంలో ప్రస్తుతం అధికారంలో వున్న పార్టీ ఫాసిస్టు స్వభావం గురించి, దాన్ని ఓడించడానికి అవసరమైన వ్యూహాల గురించి ఈ చర్చలు ప్రధానంగా సాగాయి. మోడీ ప్రభుత్వం అతిమితవాద ప్రభుత్వం అయినప్పటికీ దాన్ని సాంప్రదాయక అర్థంలో ఫాసిస్టు ప్రభుత్వంగా అభివర్ణించవచ్చునా ? లేదా? లేక అది నయా ఫాసిస్టు ప్రభుత్వమా లేక భారతదేశానికి సంబంధించిన నూతన తరహా ఫాసిస్టు ప్రభుత్వమా అనే విషయాల మీద ఈ చర్చలు జరిగాయి. అందుచేత ఫాసిజం పుట్టుక, అభివృద్ధి, దాని విజయానికి గల కారణాల గురించీ, చరిత్రలో అది తీసుకున్న రూపాల గురించి తెలుసుకోవడం అవసరం. అలా చేయడం ద్వారా మాత్రమే దాని భారతీయ నమూనాను అర్థం చేసుకోగలం. దాని ప్రత్యేకతను, సాంప్రదాయక ఫాసిజానికి దానికీ వున్న పోలికలను అర్థం చేసుకోగలం.

అధికారయుత ధోరణులను కలిగి అనాగరికమైన హింసా దౌర్జన్యాలను ప్రయోగించే ప్రభుత్వాలను, సంస్థలపై "ఫాసిస్టు" ముద్రవేసే ధోరణి ఒకటుంది. దీనిమూలంగా అందరిలోనూ ఫాసిజం అంటే కేవలం అనాగరికమైన రాజ్య అణచివేతకు మరో పేరు అనే ఒక దురవగాహన కలిగింది. ఫాసిజం కేవలం పాశవికత మాత్రమే కాదు. ఫాసిజం సాంఘిక, సామాజిక, రాజకీయ వ్యవస్థ. అది ప్రాథమికంగా ప్రజాస్వామ్యానికీ మానవ సహజీవనానికీ వ్యతిరేకం. అది అధికారయుత పాలన కాదు. దానికి "ప్రజా మద్దతు వుంటుంది" దానిక కార్యకలాపాలతో

ప్రజలు “మమేకం” అవుతారు. అనాగరికతకు సంబంధించిన ప్రత్యామ్నాయ నాగరికతగా అది ఆవిర్భవించింది. ప్రజల్ని తనకు అనుకూలంగా మల్చుకోవడానికి తీవ్ర జాతీయవాదాన్ని ఉపయోగించుకుంటోంది. ప్రపంచవ్యాపిత పెట్టుబడిదారీ వ్యవస్థ దానికి కావాల్సిన మద్దతునిస్తుంది. ముఖ్యంగా సంక్షోభ ప్రభావా న్ని ఎదుర్కొంటున్న పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యాలలో దానికి అపారమైన మద్ధతుల లభిస్తుంది.

> **“ఫాసిజం స్వభావం” (The Nature Of Fascism) అనే సుప్రసిద్ధ పుస్తకంలో రోజర్ గ్రిఫిన్ (Roger Griffin) ఫాసిజం గురించి ఇలా వర్ణించారు. “ఫాసిజం ఒక రాజకీయ భావజాలం. దాని అనేక రకాలైన వాదనలలో కేంద్రీకృతమైన అంశం ‘పున ర్జన్మ’. ఈ ‘పునర్జన్మ’ ప్రజామోదాన్ని పొందగలిగే తీవ్ర జాతీయ వాద రూపంలో వుంటుంది” ఇక్కడ ‘పునర్జన్మ’ అనేది జాతి ‘పునర్జన్మ’గా వాడబడింది. ఫాసిజాన్ని కేవలం ఒక పార్టీకి లేదా సంస్థకు లేదా ఒక నిర్దిష్టమైన దౌర్జన్యకర సంఘటనకు మాత్రమే పరిమితం చేయడం అంటే దాని అసలు ప్రమాదాన్ని గ్రహించ లేకపోవడం. అలా జరగడం వల్ల దానికి వ్యతిరేకంగా బలమైన, సంఘటితమైన ప్రతిఘటనను నిర్మాణం చేసే ప్రయత్నాలు కూడా బలహీనపడతాయి.**

### ఇతర కాలాలలో, దేశాలలో ఫాసిజం..

చారిత్రకంగా చూస్తే మానవ సమాజం ఫాసిస్టు ప్రమాదాన్ని మొట్టమొదటగా ఎదుర్కొన్నది రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో. ఆ కాలంలో ఫాసిజానికి ముస్సోలిని నాయకుడు. హిట్లర్ నాజీ పాలన కింద జర్మనీలో అమలైన ఫాసిస్టు పాలన కూడా ఫాసిజానికి సాంప్రదాయక ఉదాహరణలు. స్పెయిన్‌లో (1939 నుండి 1975 వరకు ఫ్రాంకో పాలనలో), పోర్చుగల్, అనేక లాటిన్ అమెరికా, ఐరోపా దేశాలలో ఫాసిస్టు ఉద్యమాలు ఊపందుకున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం తలెత్తిన విపత్కరమైన ఆర్థిక పరిస్థితులు, ఉదారవాద పెట్టుబడిదారీ ప్రభుత్వాల వైఫల్యం కలగలిసి ఫాసిస్టు శక్తులు అభివృద్ధి చెందడానికి కావల్సిన అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి.

ఫాసిస్టు ప్రభుత్వాలు ప్రజాస్వామిక విలువలను ఎత్తిపట్టడానికి బదులు వాటి జాతీయవాద, జాతివాద (Racist) భావజాలాన్ని సోషలిస్టు వాగాడంబరంతో కలిపి ప్రచారం చేశాయి. ఉదాహరణకు నాజీ పార్టీ సిద్ధాంతాన్ని “జాతీయ సామ్యవాదం” అనేవారు (నాజీయిజం). కమ్యూనిస్టులు, అరాచకవాదులతో సహా సోషలిస్టు ఉద్యమాలు శ్రామికవర్గంలో గణనీయమైన శక్తిని పొందడం, అంతేగాక ప్రజాస్వామిక ఎన్నికలలో అధికారాన్ని సంపాదించగల శక్తిని కలిగివుండటం దీనికి కారణం.

1917లో రష్యాలో విప్లవం విజయవంతం కావడంతో అంత ర్జాతీయ సోషలిస్టు, కమ్యూనిస్టు ఉద్యమాలు పెట్టుబడిదారీ విధానానికి పెనుప్రమాదాలుగా అభివృద్ధి చెందాయి. దీన్ని ఎదుర్కొనే క్రమంలో ఇటలీ, జర్మనీలలోని పాలక పెట్టుబడిదారీ వర్గాలు సోషలిస్టు ప్రమాదం నుంచి కాపాడుకోవడానికి ఉదారవాద ప్రజాస్వామ్యంపై ఆధారపడలేక ఫాసిస్టు శక్తులను చురుకుగా సమర్థించాయి. ఫాసిస్టులు ఒకసారి అధికారంలోకి వచ్చాక కమ్యూనిస్టులను, సోషలిస్టులను అత్యంత తీవ్రమైన హింస ద్వారా అణచివేశారు. అవి తమ స్వంత శ్రేణులలోని పెట్టుబడిదారీ వ్యతిరేక శక్తులను కూడా నిర్మూలించాయి. ఇలా చేయడం ద్వారా తమ పాలనలో పెట్టుబడిదారీ విధానం వర్ధిల్లడానికి అవసరమైన పరిస్థితిని సృష్టించుకున్నాయి. ఉదాహరణకు, హిట్లర్ యూదు వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక, మేథో వ్యతిరేక భావజాలాలను జాతీయ విలువలుగా ప్రచారం చేశాడు. అది అత్యంత దుర్మార్గమైన జాతి హననానికి (హోలోకస్ట్), రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసింది.

### ఉదారవాద ప్రజాస్వామ్యం ఫాసిజంతో కుమ్మక్కు కావడం

తమ దేశాలను హిట్లర్ ప్రత్యక్షంగా బెదిరించేంత వరకు “ఉదా రవాద ప్రజాస్వామ్య” ప్రభుత్వాలుగా పిలవబడిన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులు ప్రారంభంలో అతడి ఫాసిస్టు పాలనను సమర్థించాయి. చివరకు సోవియట్ ఎర్ర సైన్యం, తూర్పు ఐరో పాలోని ఫాసిస్టు వ్యతిరేక విప్లవకర శక్తులు కలిసి ఫాసిజాన్ని నిర్ణయాత్మకంగా ఓడించాయి. నాజీ జర్మనీ ఓటమి చెందినప్ప టికీ వేలాది మంది ఫాసిస్టు యుద్ధనేరస్థులను ఈ “ప్రజాస్వా మిక” పాశ్చాత్య దేశాలతోపాటు అర్జెంటీనా కూడా కాపాడి పున రావాసాన్ని కల్పించాయి. పెట్టుబడిదారీ పాలకవర్గాలకు ఫాసిజం సోషలిస్టు సవాళ్ళను ఎదుర్కొవడానికి ఉపయోగపడే “రిజర్వు చేయబడిన రాజకీయ పనిముట్టుగా” ఉపయోగపడు తోందని దీన్నిబట్టి తెలుస్తోంది.

### నేటి ఫాసిజం : భారతదేశంలో దాని విలక్షణ రూపం..

భారతదేశంతో సహా ప్రపంచమంతా మరోసారి తీవ్ర ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చరిత్ర మనకు ఎన్నో పాఠాలను నేర్పుతోంది. దానితోపాటు మనం వర్తమాన భారతదేశంలోని ఫాసిజంకు వున్న నిర్దిష్ట లక్షణాలను గుర్తించాలి. ప్రజాస్వామిక సమాజాన్ని విధ్వంసం చేయడం, ప్రజల మద్ధతుతో అణచివేత స్వభావం గల ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి కార్పొరేట్ పెట్టుబడికి

సేవలు అందించడం అనే, ఫాసిజం మూలసారం ఇప్పటికీ మారలేదు. అయితే దాని బయటి రూపం మాత్రం ఒక్కో దేశంలో ఒక్కో కాలంలో ఒక్కో రకంగా వుంటున్నది. అందుచేత ఒక దేశం ఫాసిస్టు దేశంగా మారిందా లేదా అనేదాన్ని దాని రూపాన్నిబట్టి కాక సారాన్ని బట్టి నిర్ణయించాలి.

**భారతదేశపు ఫాసిజం, సాంప్రదాయక ఫాసిజాల మధ్య తేడాలు**

ప్రస్తుతం తీవ్ర మితవాద ప్రభుత్వం భారతదేశాన్ని పరిపాలి స్తోంది. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామిక విలువల సారాన్ని నాశ నం చేయడానికి అది ప్రజాస్వామిక నిర్మాణాలను ఉపయోగిం చుకుంటుంది. 20వ శతాబ్దం తొలికాలం నాటి ఐరోపాలో వలె కాకుండా ప్రస్తుత ప్రపంచంలో బహుళపార్టీల ప్రజాస్వామ్యం ప్రధాన పాత్ర వహిస్తుంది. అయితే భారతదేశంలో మాత్రం ప్రజాస్వామ్యం ఎప్పుడూ కేవలం లోతుగా పాతుకుపోయిన బ్రాహ్మణీయ నిచ్చెనమెట్ల కుల వ్యవస్థకు వేసిన పైముసుగు మాత్రమే. తీవ్రమైన సాంఘిక అణచివేతను, హింసను బలోపే తం చేసే కుల వ్యవస్థ ప్రస్తుతం "హిందూ నాగరికతలో, వ్యవ స్థాగత హింసలో" విడదీయరాని భాగమైపోయింది.

దీనికితోడు 1991 నుండి భారత పాలకవర్గాలు నయా ఉదారవాద ఆర్థిక విధానాలను అవలంబించాయి. దాని ఫలితంగా సాంఘిక, ఆర్థిక రంగాలలో నిరాశా నిస్పృహలు విస్తృతంగా వ్యాపించాయి. ఈ సంక్షోభం ఫాసిస్టుశక్తులు అధికారంలోకి రావడానికి అవకాశం కల్పించింది. అయితే ఇది కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితమైన ధోరణి మాత్రం కాదు. ఆర్థిక అస్థిరత కారణంగా అనేక పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యాలు ప్రపంచవ్యాప్తంగా అధికారయుత పాలనలుగా మారిపోతున్నాయి. భారతదేశం కూడా ఇలాంటి ఫాసిస్టు పాలనా ప్రమాదాన్ని ఎదుర్కొన్నప్పటికీ అది ఇంకా పూర్తిగా ఫాసిస్టుగా మారలేదని కొందరి వాదన. ఎందుకంటే.. ప్రజాస్వామ్యం పూర్తిగా విధ్వంసం కాలేదు.

కొన్ని ఫాసిస్టేతర పార్టీలు, సంస్థలు ఇంకా ప్రతిఘటిస్తూనే వున్నాయి. ఫాసిస్టు శక్తులు అధికారాన్ని సంపూర్ణంగా సంఘటితం చేసుకోలేదు. అయితే భారతదేశంలో ఫాసిజం తీవ్ర జాతీయవాదం మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టడం, రాజకీయ, సామాజిక వ్యవస్థలలోకి చొచ్చుకుపోవడంలో అది విజయవంతం కావడం కారణంగా సమకాలిక ప్రపంచంలో ఇది అత్యంత విజయవంతమైన ఫాసిస్టు ఉద్యమంగా మారింది. కానీ పాలన ఫాసిస్టు పాలన అయిందా? ఒక పాలన పూర్తిగా ఫాసిస్టు పాలనగా మారిందని ఎప్పుడు చెప్పగలం? హిట్లర్ కూడా అధికారాన్ని 1933లోనే హస్తగతం చేసుకున్నప్పటికీ, ప్రజాస్వామ్య వ్యతిరేక ఫాసిస్టు విధానాలను దశలవారీగా అమలుపరిచాడు. ప్రసిద్ధి చెందిన "ఫాసిజం ఎలా పనిచేస్తుంది" (How Fascism Works) అనే పుస్తకంలో జాసన్ స్టేన్లీ (Jason Stanley) వర్ణించినట్లుగా, హిట్లర్ తాను అమలు పరచబోయే తీవ్రవాద ఫాసిస్టు చర్యలకు అనుకూలంగా జర్మన్ సమాజాన్ని సంసిద్ధం చేసుకున్నాడు. ఇందుకోసం అతడు వ్యవస్థాగతమైన అసత్య ప్రచారాన్ని కొనసాగించాడు. అవాస్తవాలను, మేథో వ్యతిరేకతను, నిచ్చెనమెట్ల వ్యవస్థను, జర్మన్ జాతి గత కాలంలో గొప్పదనే ఊహను, అది దెబ్బతిన్న జాతి అని ప్రచారం చేశాడు.

యూదులను మొత్తంగా మడగాస్కరుకు బలవంతంగా పంపించి వేసి అక్కడ వాళ్ళు వుండేటట్లు చేయడం ద్వారా "యూదుల సమస్యను" పరిష్కరించాలని 1938లోనే ఆయన ఆలోచించినప్పటికీ, యూదులకు వ్యతిరేకంగా అమలుపరిచిన తుది పరిష్కారమార్గంగా నరమేధం గురించి 1943లో మాత్రమే ఆలోచించాడు. అప్పటికి జర్మనీ అసాధారణమైన యుద్ధ పరిస్థితిలో కూరుకుపోయి వుంది. సమాజాన్ని, రాజకీయ వ్యవస్థను ఫాసిస్టీకరణ చేయడం అధికారాన్ని హస్తగతం చేసుకున్నాక క్రమక్రమంగా అమలు పరిచే క్రమం అని దీనినిబట్టి అర్థం అవుతోంది. అందుచేత ఈ సమయంలో ఈ దశలో ఫాసిజం అధికారాన్ని పూర్తిగా హస్తగతం చేసుకుందని ఎవరూ చెప్పలేరు. రాజ్య యంత్రాంగం మీద ఆధిపత్యాన్ని సంపాదించడం ఫాసిస్టు అధికారానికి ప్రారంభ బిందువు.

**ఫాసిస్టు ప్రభుత్వమా లేక ఫాసిస్టు పాలనా ?**

అయితే ఈ చర్చలో ప్రధానమైన రాజకీయ ప్రశ్న ఏమిటంటే నేటి భారత ప్రజాస్వామిక వ్యవస్థకు ఫాసిజాన్ని ఎదుర్కొన గలిగిన శక్తి వుందా లేదా అనేది ? బీజేపీయేతర లౌకిక పార్టీలు తమ రాజకీయ స్వభావంలో "ఫాసిస్టు వ్యతిరేకతను" కొనసాగి స్తాయా లేదా ? విశాలమైన ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ కూటమిని ఏర్పాటు చేయగల శక్తి భారతీయ రాజకీయ పార్టీలకు ఇంకా వున్నదా లేదా ? 21వ శతాబ్దపు ఫాసిజంగాని, ఆ మాటకు వస్తే నయా ఫాసిజంగాని పెట్టుబడిదారీ సంక్షోభం, ప్రజాస్వామిక తిరోగమనం వంటి వాస్తవ అంశాలపై ఆధారపడి బలపడతాయి. 20వ శతాబ్దంలో ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో వామపక్ష, వామపక్ష తరహా రాజకీయ నిర్మాణాలు వుండి, అవి ఫాసిజం అధికారాన్ని హస్తగతం చేసుకోకుండా వ్యతిరేకించాయి.

1991లో నయా ఉదారవాద వ్యవస్థ ప్రారంభమైన తరవాత కాలంలో మధ్యే మార్గవాద పార్టీలు కూడా మితవాద పార్టీలవైపు మళ్లాయి. దీంతో భారతీయ ఫాసిస్టులకు ఉదారవాద రాజ్యాంగాన్నిగాని ఉదారవాద పార్టీలను గాని రద్దు చేయాల్సిన అవసరం లేదు. ఇది 21వ శతాబ్దపు నయా ఫాసిస్టు రాజకీయ సందర్భం. ఫాసిజం ఒకవైపు ప్రజాస్వామ్య సారాన్ని మౌలికంగా

మార్చివేస్తూనే ఎన్నికల ప్రజాస్వామ్యంతో సహజీవనం చేయగలదు. కార్పొరేట్ పెట్టుబడి, బ్రాహ్మణీయ సాంఘిక నిర్మాణాల మద్దతు కలిగిన బీజేపీ లాంఛనప్రాయమైన ప్రజాస్వామ్య నిర్మాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తూనే దాని ప్రజాస్వామిక సారాన్ని పీల్చివేసింది.

చారిత్రకంగా చూస్తే సంక్షోభాల కాలంలో ఉదారవాద ప్రజాస్వామికవాదులుగా చెప్పుకున్న వాళ్లు కూడా ఫాసిజంతో స్నేహం చేశారు. ఈనాడు భారతదేశంలో ప్రధాన స్రవంతికి చెందిన రాజకీయ పార్టీలు ఎన్నికలలో బీజేపీని వ్యతిరేకించ వచ్చుగాని, భారత ఫాసిజానికి వున్న బ్రాహ్మణీయ, కార్పొరేట్ పునాదులను సవాల్ చేయలేవు. దీంతో వ్యవస్థ చట్రంలో భాగస్వాములైన ప్రతిపక్ష పార్టీలు ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి నాయకత్వం వహిస్తాయని ఆశించడం రాజకీయ అమాయకత్వమే అవుతుంది. ఈ "ఉదారవాద ప్రతిపక్షానికి" వైరం బీజేపీతోనే గాని, బ్రాహ్మణీయ హిందూత్వ తోగాని లేదా నయా ఉదారవాద ఫాసిజంతోగాని కాదు.

మరోపక్క ఈ "ఉదారవాద పార్టీలే తాము స్వతంతంగా అధికారంలో ఉన్నటువంటి రాష్ట్రాలలో ఫాసిస్టు సాంఘిక, ఆర్థిక విధానాలను అమలుపరుస్తున్నాయని, ఇలాంటి చట్టాలను తీసుకురావడంలో బీజేపీకి మద్ధతు ఇస్తున్నాయని చెప్పడానికి వందలాది ఉదాహరణలున్నాయి. అంటే బీజేపీ ఎన్నికలలో ఓడిపోవచ్చు. కాని ప్రత్యామ్నాయ రాజకీయశక్తులు కూలదోయనంత కాలం ఫాసిస్టు పాలన మాత్రం కొనసాగుతుంది. దీంతో భారతదేశంలో ఫాసిస్టు వ్యతిరేక పోరాటం తప్పనిసరిగా మూడు లక్షణాలను కలిగి వుండాలి.

- బ్రాహ్మణీయ వ్యతిరేకత, అంటే హిందూ జాతీయతను రెచ్చగొట్టే లోతుగా వేళ్లూనుకున్న కుల అణచివేతపై పోరాటం చేయడం.
- కార్పొరేట్ పెట్టుబడిపట్ల వ్యతిరేకత. అంటే ఫాసిజానికి బలం చేకూర్చే ఆర్థిక నిర్మాణాలను ప్రతిఘటించడం.
- అత్యంత అణచివేతను అనుభవిస్తున్న వర్గాలు నాయకత్వాన్ని కలిగి వుండడం. అంటే దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, కార్మికవర్గం ముందు వుండడం.

హిట్లర్ సాగించిన నరమేధం అత్యంత తీవ్రమైన ఫాసిస్టు చర్య. అమెరికాలో ఈ అంశం గురించి పరిశోధన చేసిన మేధావి గ్రెగరీ స్టాంటన్ (Gregory Stanton), భారతదేశం "నరమేధం తప్పని స్థితి" అనే దశగుండా ప్రయాణిస్తుందని హెచ్చరిస్తున్నారు. ఏ సమాజంలోనైనా నరమేధం పది దశలను దాటి అంతిమంగా సామూహిక హత్యల స్థాయికి చేరుతుందని ఆయన సూచిస్తున్నారు.

**ఆ పది దశలు..**

- వర్గీకరణ – కొందరిని "ఇతరులు"గా నిర్వచించడం
- గుర్తింపు – అలాంటి బృందాన్ని గుర్తించి దానికొక పేరు పెట్టటం
- వివక్ష – అలాంటి వారిని పథకం ప్రకారం ప్రధాన స్రవంతి నుంచి వెలుపలికి నెట్టివేయటం.
- అమానవీయకరణ–వాళ్ళ గౌరవాన్ని, హక్కులను బలవంతంగా రద్దుచేయడం.
- వ్యవస్థీకరణ–ఈ వివక్షను రాజకీయంగా వ్యవస్థీకరించడం.
- సమీకరణ–సాంఘిక విభజనలను మరింత లోతుగా విస్తరింపచేయడం.
- సన్నద్ధ చర్యలు – హింసను ప్రేరేపించడానికి అవసరమైన పునాదిని పద్ధతి ప్రకారం రూపొందించుకోవడం.
- వేధించడం – చట్టపరమైన అణచివేత, రాజ్య హింస.
- భౌతిక నిర్మూలన – పెద్ద ఎత్తున హత్యలు
- నిరాకరణ – సాక్ష్యాలను తుడిచిపెట్టటం, ఎవరు దేనికి బాధ్యులో తెలియకుండా చేయడం.

మోడీ పరిపాలనలో భారతదేశం ఈ పది దశలన్నింటిగుండా చాలా వేగంగా ప్రయాణిస్తోంది. పూర్తిస్థాయి నరమేధం ఇంకా జరగగపోయినప్పటికీ సమాజాన్ని లోతైన ఫాసిస్టు సమాజంగా పరిణమింపచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంటే ముస్లిం లను అమానవీయతకు గురిచేయడం, దళితులను, శూద్రులను అభివృద్ధి అంచులకు నెట్టివేయడం, ప్రజాస్వామిక సంస్థల విలువలను డొల్లచేయడం.

**భారతదేశంలో ఫాసిజం - మన ముందున్న మార్గం..**

భారతదేశంలో ఫాసిజం నిలదొక్కుకుంటున్నది. కుల వ్యవస్థ ద్వారా, లాంఛనప్రాయమైన ప్రజాస్వామ్యం ద్వారా అది ఫాసిస్టు విలువల వారసత్వాన్ని స్వీకరించి సమాజంలోకి లోతుగా చొరబారి శక్తివంతమౌతోంది. దాన్ని ఓడించాలంటే అంతే దీర్ఘకాలికమైన ప్రణాళికతో విప్లవకర సామ్యవాద పోరాటం తప్పనిసరి. శిష్ట ప్రతిపక్ష పార్టీలు ఈ పోరాటానికి నాయకత్వం వహించలేవు. బ్రాహ్మణీయ ఆధిపత్యానికి, కార్పొరేట్ పెట్టుబడికి వ్యతిరేకంగా జరిగే ఈ ఉద్యమం తప్పనిసరిగా పునాది వర్గ ఉద్యమంగా వుండాలి. అలాచేయడం ద్వారా మాత్రమే భారతదేశంలో ఫాసిస్టు పురోగమనాన్ని తిప్పిగొట్టగలం. కేవలం భ్రమాత్మకమైన బీజేపీ వ్యతిరేక కూటములు కట్టటం గురించి ఆలోచించడం కంటే నిజాయితీతో కూడిన ఫాసిస్టు వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం గురించి మన శక్తియుక్తులను వెచ్చించాలి. ❑ **అనువాదం : సియస్ఆర్ ప్రసాద్**

**(ది వైర్ తెలుగు సౌజన్యంతో)**

# కార్పొరేట్ల చేతుల్లోకి 'సహకారం'!

- మూడ్ శోభన్

మోడీ ప్రభుత్వం 'సహకార్ సే సమృద్ధి', 'ప్రాస్పరిటీ త్రూ కోపరేషన్' నినాదాలిస్తోంది. అంటే 'సహకారం నుండి సంపద' గా మారుతుంది. ఇటీవల కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా విడుదల చేసిన జాతీయ సహకార విధానం దీనికనుగుణం గానే ఉంది. రెండున్నరేండ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రూపొం దించిన మోడల్ బైలాస్ (నమూనా నియమావళి)కు నకలుగా జాతీయ సహకార విధానం కనిపిస్తోంది. కేవలం స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాల మీద వచ్చే ఆదాయంతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ధృఢంగా నిలబడలేవని కేంద్ర ప్రభుత్వం చెప్తోంది. ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పి.ఎ.సి.ఎస్‌లు) నిర్వహిస్తున్న ఆర్థిక కార్యకలాపాలకు వాటి బైలాస్ (నియమా వళి) ఆటంకాలు కల్పిస్తున్నాయని, అవి దశాబ్దాల కిందటివని, వాటిని తిరగ రాయాల్సిన అవసరముందని, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిన లేఖల్లో పేర్కొంది. మోడీ ప్రభుత్వం సహకార రంగం పట్ల కేంద్రీకృత లక్ష్యంతో వ్యవహరిస్తోంది.

2021 జులై 6న సహకార మంత్రిత్వ శాఖను కొత్తగా ఏర్పా టు చేసి, అమిత్ షాకు ఆ శాఖ పగ్గాలు అప్పగించిన నాటి నుండి, తను అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా వేగం పెం చింది. సహకారం నుండి వచ్చే సంపద ఎవరి కోసం? ఎవరికి దక్కుతుంది? అనేది కీలకం. రాజ్యాంగం రాష్ట్రాల హక్కుగా ఇచ్చిన సహకారాన్ని బీజేపీ ప్రభుత్వం తన చేతుల్లోకి తీసు కుంటోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలు, ఆ పార్టీకి మద్దతిచ్చే రాష్ట్రా లు, కేంద్ర సహకార శాఖ పంపించే ఆదేశాలన్నింటిని కిందికి పంపిస్తూ ఆచరణకు పూనుకుంటున్నాయి. బీజేపీయేతర ప్రభు త్వాలు దీనిపై సరైన విధంగా స్పందించడం లేదు. కేరళ ఒక్కటే దీనికి మినహాయింపు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక సహకార సం ఘం ఉండాలి. అన్నింటిలోకి కీలకమైనవి కేంద్రం పంపిన మోడ ల్ బైలాస్. అన్ని సహకార సంఘాలు వీటిని ఆమోదించేలా రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలి. ఈ బైలాస్ ప్రకారం సంఘం పేరులో వ్యవసాయ పరపతి అనే మాట ఉండదు. 'ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం' 'బహుళ ప్రయోజన ప్రాథమిక గ్రామీణ సహకార సంఘం'గా మారుతుంది.

ఈ సంఘ సభ్యులు రెండు తరగతులుగా విభజించబడతారు. 'ఎ' క్లాస్ సభ్యులకు మాత్రమే జనరల్ బాడీలకు హాజరయ్యే, నిర్ణయాల్లో భాగస్వామ్యం పొందే, డైరెక్టర్లుగా పోటీ చేసే అధికా రం, ఓటింగ్ హక్కులు ఉంటాయి. 'బి' క్లాస్ సభ్యులకు ఎటువం టి హక్కులూ ఉండవు. 'ఎ' క్లాస్ సభ్యులు కావటానికి వ్యవసాయ భూమి లేదా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు నిర్వహించే భూమి ఉండాలి. 'ఎ' క్లాస్ సభ్యులు మాత్రమే వాటాదారులుగా ఉంటారు. వీరిలో ఎవరికైనా మొత్తం షేర్ ధనంలో వాటాగా ఇరవై శాతం వరకు ఉండవచ్చు. వీరి చెప్పు చేతల్లోకి సహకార సంఘాలు ఉండబోతున్నాయని వేరేగా చెప్పనక్కర్లేదు. వ్యవ సాయ భూమిగల రైతులు 'ఎ' క్లాస్ సభ్యులు. వివిధ ప్రయోజ నాల కోసం ఆధారపడిన వ్యవసాయ రంగం, ఇందులో వ్యవసా య ఉత్పత్తులను ముడి సరుకులుగా ఉపయోగించే పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి సేవలు అందించే పరిశ్రమలున్నాయి. అనుబంధ రంగాలు అంటే వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో పాల్గొనే సంస్థలు, పరిశ్రమలు ఉంటాయి.

అదానీ, అంబానీ, గాద్రెజ్, ఆదిత్య బిర్లా, మోన్‌శాంటో, జువా రి, ర్యాలీస్, ఐటిసి, బ్రిటానియా వంటి గుత్త సంస్థలతోపాటు అనేక పెద్ద కంపెనీలు వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో ఉన్నాయి. ఇంత పెద్ద కంపెనీలకు, 'బహుళ ప్రయోజన ప్రాథ మిక గ్రామీణ సహకార సంఘం'తో పనేంటి? బహుళ ప్రయో జన సహకార సంఘంలో గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలు మొ త్తం కేంద్రీకరించబడతాయి. వీటిలో 'మీ సేవ', 'ఈ సేవ'లు అం దించిన అనేక కార్యకలాపాలతోపాటు గోడౌన్ల ఏర్పాటు, ఆహార ధాన్యాల సేకరణ, ఎరువులు, విత్తనాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ డీలర్‌షిప్, వ్యవసాయ రుణాలు, సామూహిక వ్యవసాయం, స్కూ ళ్లు, కాలేజీలు, ఆస్పత్రులు, డిస్పెన్సరీలు, చౌక ధరల దుకాణా లు, పాస్‌పోర్టు సేవలు, అన్ని రకాల టిక్కెట్ల బుకింగ్, బిల్లుల చెల్లింపులే కాక వీటిలో లేని వ్యాపారం అంటూ ఏదీ ఉండదు. బహుళ ప్రయోజన సహకార సంఘాలు సభ్యుల ప్రయోజనాల కోసం మార్కెటింగ్ కార్యకలాపాలను సొసైటీ పరిధి లోపల, బయట నిర్వహిస్తాయి. ఆస్తుల సృష్టికి పనిచేస్తాయి.

లక్ష్యాల సాధనలో ఇతర వ్యాపారాల నిర్వహణకు అవసరమైన ఆర్థిక మద్దతిస్తాయి. 'బి' క్లాస్ సభ్యులలో స్వయం సహాయక గ్రూపులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ చేతి వృత్తిదారులు, చిన్న వ్యాపారస్తులు ఉంటారు. వీరికి వ్యవసాయేతర రుణాలు మాత్రమే ఇస్తారు. అంటే కౌలు రైతులకు వ్యవసాయ రుణాలుండవు. వ్యవసాయేతర రుణాల

వ్యాపారంలో వచ్చే ఆదాయం నుండి కొద్దిభాగం వీరికి ప్రోత్సహకంగా ఇస్తారు. ప్రధానంగా ఈ సొసైటీలు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓలు) ఏర్పాటు చేస్తాయి. సామూహిక వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాయి. 'ఎ' క్లాస్ సభ్యులుగా ఉండి వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలలో ప్రధాన పాత్ర పోషించే కంపెనీల చేతుల్లోకి సామూహిక వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వెళ్లే ప్రమాదం ఉంది. బహుళ ప్రయోజన సహకార సంఘాలు నిర్వహించే మొత్తం వ్యాపార ప్రయోజనం, ఆర్థికంగా బలంగా ఉండే ధనిక రైతులకు, కార్యకలాపాల అధిపతులకు దక్కుతుంది.

బహుళ ప్రయోజన సహకార సంఘం తన పరిధిలోని సభ్యులు, సభ్యులు కాని వారి సామాజిక, ఆర్థిక, వ్యాపార సంబంధిత సమాచారాన్ని సేకరిస్తుంది. విధానాల రూపకల్పనకు, వ్యవసాయం లేదా దాని సంబంధిత వ్యాపారం లేదా అభివృద్ధి ప్రణాళికకు ఉపయోగిస్తుంది. ఇంతకుముందు మోడీ ప్రభుత్వం రద్దు చేసిన వ్యవసాయ నల్ల చట్టాల్లో ఉన్న రైతు వ్యతిరేక అంశాలు బహుళ ప్రయోజన ప్రాథమిక గ్రామీణ సహకార సంఘాల ద్వారా అమల్లోకి వస్తాయి. ఆధునిక వ్యాపార నిర్వహణకు అవసరమైన విధంగా పి.ఎ.సి.ఎస్‌లు అన్నిటినీ కంప్యూటరీకరించి ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చారు. ఇక మోడల్ బైలాస్‌ను ఆమోదింపచేసి, వాటి ప్రకారం సంఘాలను నడపటమే తరువాయి. ఇప్పటి వరకు సహకార రంగాన్ని అన్ని పాలక పార్టీలు దివాళా తీయించాయి. విధానాల రూపకల్పన చేసి, రోజువారీ కార్యకలాపాలలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోకూడదనే ప్రజాస్వామ్య పద్ధతికి తిలోదకాలిచ్చాయి.

సహకార సంఘాలను ప్రజాస్వామ్య యుతంగా నడిపే పేరుతో పరస్పర సహాయక సహకార సంఘాల చట్టాన్ని తెచ్చి, పాల డెయిరీలను కంపెనీలకు అప్పచెప్పారు. వ్యవసాయ పరపతి సంస్థలు మినహా మిగతా సహకార సంస్థలను ప్రయివేటీకరించింది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు, డి.సి.సి.బిలు, టిప్కాబ్‌లకు ఎన్నికలు నిర్వహించలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ కార్యకర్తలను వ్యవసాయ పరపతిలోని మూడు దొంతరలలో పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నాయి. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఆడించినట్లు ఆడుతూ వ్యవసాయ సహకార రంగాన్ని ప్రయివేటీకరిస్తున్నాయి. పి.ఎ.సి.ఎస్‌లు బహుళ ప్రయోజన సహకార సంఘాలుగా మారిన తరువాత, వాటితోపాటు డి.సి.సి.బిలు, టిప్కాబ్ వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో ఉన్న కార్పొరేట్ల చేతుల్లోకి పోతాయి. రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఈ విధానాలను వ్యతిరేకించి సహకార రంగాన్ని కాపాడుకోవడమే ముందున్న కర్తవ్యం. ❑

## ఆర్ఎస్ఎస్ విద్వేష చరిత్రకు వందేండ్లు!

**(16వ పేజీ తరువాయి)**

నాటి సంచికలో "హృదయాలను పరిపాలించే మనువు" శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించింది. అందులో ఇలా ఉంది – "ఈ దేశంలో మనువుకు రోజులు చెల్లిపోయాయి – అని డా.బి.ఆర్. అంబేద్కర్ బొంబాయిలో అన్నట్టు తెలిసింది. కానీ, అది జరగని పని ! దాన్ని జరగనివ్వం కూడా !! ప్రతి హిందువు మనసులో మనువు ఎల్లప్పుడూ ఉంటాడు. మనువు సూత్రాలు జన జీవితంలో కొనసాగుతాయి. శూద్రులు కూడా మనువును పూజిస్తారు. సమానత్వం గనక ఆచరణలోకి వస్తే, దేశం బలహీనపడుతుంది. వ్యక్తులు దుర్బలులవుతారు."

26 జనవరి 1950న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంలో బాబాసాహెబ్ అంబేద్కర్ "మన రాజ్యాంగం దేశంలో సమానత్వాన్ని సాధిస్తుంది" అని అన్నందుకు ఆర్ఎస్ఎస్‌పై విధంగా స్పందించింది. రాజ్యాంగ వ్యతిరేకతను బాహాటంగా ప్రకటించింది. తమకు మనుధర్మ శాస్త్రమే అనుసరణీయమని చెప్పుకుంది. అందుకే చూడండి. బలహీన వర్గాలు ఆర్ఎస్ఎస్ కోసం ఎన్ని త్యాగాలు చేసినా, దాని అధినేతలుగా కేవలం బ్రాహ్మణులే కొనసాగుతూ ఉండడం ఇప్పటికీ మనం చూస్తున్నాం. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా పాల్గొనే వారిని అడ్డగించి, ఎంతో మంది దేశ భక్తుల మరణానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణమైన ఆర్ఎస్ఎస్ వారు, తమకు తాము దేశ భక్తులమని ప్రకటించుకోవడాన్ని ఈ దేశప్రజలు.. అంగీకరిస్తారా? గాంధీజీ హంతకుడికి తమ సంస్థకు ఎలాంటి సంబంధమూ లేదని ఆ నాడు ప్రకటించుకుని, తర్వాత కాలంలో మరి ఎందుకు నాథూరామ్ గాడ్సేను ఆరాధిస్తున్నారు ?

ఇవన్నీ చూస్తే, దేశంలో హిందుత్వ ఉగ్రవాదం పెచ్చరిల్లిపోవడానికి, దేశ ఆర్థికప్రగతి దిగజారుతూ పోవడానికి, అతి పెద్ద ఆర్థిక నేరగాళ్లు దేశం విడిచి పారిపోవడానికీ ఆర్ఎస్ఎస్ బీజేపీలే కారణమని ఈ దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. తీవ్ర వాదులు, దేశద్రోహులూ కలిసి తమకు.. తాము 'దేశభక్తులుగా ప్రకటించుకుంటూ ఉంటే అసహ్యంగానూ, వికారంగానూ ఉంది. పైగా దేశభక్తులు ఎవరన్నది వాళ్లే నిర్ణయిస్తూ ఉండడం వికృతాలలో కెల్లా వికృతం, వీళ్లు దేశభక్తి – అనే పదానికే అర్థం మార్చేశారు. వారి కుట్రలను ఛేదించడం ఈ దేశ ప్రజల తక్షణ కర్తవ్యం ! భిన్నత్వంలో ఏకత్వం సాధించుకున్న ఈ దేశం, తన అస్తిత్వాన్ని కోల్పోకముందే దేశ ప్రజలు అప్రమత్తులై సమాయత్తమవ్వాలి. ఈ దేశాన్ని సర్వహిత, సమభావంతో సమున్నతంగా నిలుపుకోవాలి ! తప్పదు. ❑

**(నవ తెలంగాణ సౌజన్యంతో)**

# బెడిసి కొడుతున్న పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం!



- ఆర్.లక్ష్మయ్య,

ప్రపంచవ్యాపితంగా ప్రజా రవాణాను ప్రోత్సహించే లక్ష్యాలు, ప్రభుత్వాల పాత్ర-భారత ప్రభుత్వం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలిద్దాం. హైదరాబాద్ మెట్రో రైల్ భాగస్వామ్య సంస్థ ఎల్అండ్టి ఒప్పందం గడువు పూర్తి కాక ముందే ప్రాజెక్ట్ నుండి తప్పుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.13,000 కోట్ల అప్పు భారం మోయాలని ఎల్అండ్టి పెట్టిన షరతులను అంగీకరించి ప్రాజెక్ట్‌ను స్వాధీనం చేసుకుంది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ మెట్రో ప్రాజెక్ట్ (న్యూ ఢిల్లీ రైల్వే స్టేషన్ నుండి ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమా నాశ్రయం వరకు) పీపీపీ మోడల్‌లో, బి.ఒ.టి (బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్) విధానంలో రిలయన్స్ గ్రూప్-ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్(డి.ఎమ్.ఆర్.సి) భాగస్వామ్యంతో నిర్మించబ డింది. ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.5,700 కోట్లు. అందులో భూసేక రణ, టనెళ్లు, స్టేషన్లు, డిపోలు వంటి సివిల్ నిర్మాణాల కు డి.ఎమ్.ఆర్.సి రూ.2,850 కోట్లు ఖర్చు చేయాలి. డిజైన్, సరఫరా, ఇన్‌స్టలేషన్ మొదలైన వాటికి రిలయన్స్ రూ.2,850 కోట్లు వెచ్చించాలి. ఒప్పందం కాల పరిమితి 30 సంవత్సరాలు. మరో 30 సంవత్సరాలు పొడిగించవచ్చు. ప్రయాణికులు చెల్లిం చే చార్జీలు, చార్జియేతర ఆదాయాలు రిలయన్స్‌కే చెందుతాయి. డి.ఎమ్.ఆర్.సి కి మాత్రం రిలయన్స్ ప్రతి సంవత్సరం రూ.51 కోట్లు చెల్లించాలి.

ఈ మెట్రో సర్వీసు 2011 ఫిబ్రవరి 23న ప్రారంభమైంది. అప్పుడు చార్జీ రూ.80. జూన్ 30 తర్వాత ఆపరేషన్లు కొనసా గించబోమని 2013 జూన్‌లో రిలయన్స్ అల్టిమేటం ఇచ్చింది. దీంతో నిర్వహణను డి.ఎమ్.ఆర్.సి నెత్తికెత్తుకోక తప్పనిసరి పరిస్థితుల్లో స్వాధీనం చేసుకుని, చార్జీని రూ.80 నుండి రూ.60కి తగ్గించి నడుపుతున్నది. ఇప్పటికీ డి.ఎమ్.ఆర్.సి ఆ సర్వీసును నడుపుతోంది. రిలయన్స్ ప్రాజెక్ట్‌ను వదిలేయడమే కాక, డి.ఎమ్.ఆర్.సి నుంచి భారీ మొత్తాన్ని డిమాండ్ చేస్తూ కోర్టులో కేసు వేసింది. ట్రిబ్యునల్ రిలయన్స్ పక్షాన తీర్పు ఇస్తూ డి.ఎమ్.ఆర్.సి రూ.2782.33 కోట్లు చెల్లించాలని ఆదేశించిం ది. డి.ఎమ్.ఆర్.సి ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టులలో అప్పీలు చేసింది. చివరకు 2024 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ట్రిబ్యునల్ ఆదేశాన్ని రద్దు చేసి డి.ఎమ్.ఆర్.సికి ఉపశమనం కలిగించింది.

ముంబై మెట్రో రైలు ప్రాజెక్ట్ కూడా పిపిపి మోడల్‌లో ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (26 శాతం), రిలయన్స్ (74 శాతం)




భాగస్వామ్యంతో ప్రారంభమైంది. అంగీకారం ప్రకారం చార్జీలు రూ.9 నుండి రూ.13 మధ్య ఉండాలని నిర్ణయించారు. అయితే, 2014 జూన్ 8న ఆపరేషన్లు ప్రారంభమైనప్పుడు రిలయన్స్ ఏకపక్షంగా చార్జీలను రూ.10 నుండి రూ.40 వరకు పెంచు కొని వసూలు చేసింది. దీనిపై ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కోర్టుకు వెళ్లింది. కానీ కోర్టులు రిలయన్స్ చర్యను అక్రమమని ప్రకటించలేదు. ఫలితంగా రిలయన్స్ స్వంతంగా నిర్ణయించుకు న్న చార్జీలను వసూలు చేసింది. తర్వాత రిలయన్స్ రూ.110 వరకు చార్జీ పెంచాలని ప్రతిపాదించింది. బాంబే హైకోర్టు ఆ ప్రతిపాదనపై స్టే ఇచ్చింది. వివాదం ఇంకా కొనసాగుతోంది.

ఈ రెండు మెట్రో రైళ్ల అనుభవాలు రిలయన్స్‌కు సంబం ధించినవి. ఇప్పుడు ఎల్అండ్టి కూడా హైదరాబాద్ మెట్రో రైల్‌ను వదిలి తెలంగాణ ప్రభుత్వంపై బాధ్యత వేసింది. అంటే ఇది తెలంగాణ ప్రజల డబ్బు. ఇలాంటి చేదు అనుభవాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పిపిపి మోడళ్లను దూకుడుగా అమలు చేస్తున్నాయి. పిపిపి అనేది ప్రభుత్వాల "మంత్రం"గా మారింది. ప్రైవేట్ కంపెనీలు ప్రజల డబ్బుపై లాభాలు గుంజుకునేందుకు వస్తాయి. సాధ్యం కానప్పుడు ఒప్పందాలను ఉల్లంఘించి తప్పుకుంటాయి లేదా ఎలాంటి చర్యలకైనా ఒడిగడతాయి. ప్రజల గురించి ఏమాత్రం పట్టించుకోవు.

### మెట్రో రైలు ప్రాజెక్టులను లాభం-నష్టం అనే స్కేల్‌పై కొలవాలా ? ప్రపంచ అనుభవం ఏమిటి ?

ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలోని 204 నగరాల్లో 970 మెట్రో రైలు ప్రాజెక్టులు నడుస్తున్నాయి. పెట్టుబడులు, నిర్వహణ ఖర్చులను కలిపి లెక్కిస్తే ఒక్కటంటే ఒక్క ప్రాజెక్ట్ కూడా లాభాల్లో లేదు. ప్రజా రవాణా మొత్తం **(మిగతా 33వ పేజీలో)**

# ఎన్ని సవరణలతో దెబ్బతీసినా ఇంకా ఆర్టీఐలో జీవం ఉంది, వాడుకుంటే ఇంకా ఉపయోగమే



- మాడభూషి శ్రీధర్

**(2019కు సమాచార చట్టాన్ని దెబ్బ తీసే ముందు అయిదేళ్ల 25 వేల తీర్పులు ఇచ్చిన విషాద యోగం ఇది).**

అక్టోబర్ 12 అంటే సమాచార స్వాతంత్ర్యం మనకు రాజ్యాంగం 1950లో అర్థం కాలేదు. మన పత్రిక స్వేచ్ఛలో భాగంగా ఉంటుంది లే అన్నట్టు భావించాం. కాని తెలుసుకునే హక్కు ఆర్టికల్ 19(1)(ఎ)లో కనిపించదు. కనుక సమాచార హక్కు స్పష్టంగా నిర్మించడం అవసరం ఉందని పోరాటాలు చేయవలసి వచ్చింది. 10 రూపాయల రిట్ పిటిషన్ వంటి శక్తివంతమైన అధికారం ఆర్టీఐ చట్టం కింద లభించింది. సరిగ్గా వాడుకుంటే చాలా ఉపయోగపడుతుంది. రెండు అన్యాయమైన, రాజ్యాంగ వ్యతిరేక సవరణలను పార్లమెంట్ రూపొందించింది. మంచిది కాదు. అయినా సామాన్యుల అవసరాలకు సమాచారం దొరికే అవకాశం ఉందనే ఆశాకిరణాలు ఉన్నాయి. వేధించడానికి కాకుండా, ప్రయోజనానికి, జనానికి ఉపయోగించే పనిచేస్తే సమాజానికి ఉపయోగపడుతుంది.

ఆలోచనాపరులైన పౌరుల సంఘం సతర్క్ నాగ్రిక్ సంఘటన్ SNS జనవరి 2025లో సంకలనం చేసి ప్రచురించిన "భారతదేశంలోని సమాచార కమిషన్ల నివేదిక కార్డు 2023-24" ప్రకారం, జార్ఖండ్, తెలంగాణ, గోవా, త్రిపుర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ ఛత్తీస్‌గఢ్‌లలోఏడు సమాచార కమిషన్లు జూలై 1, 2023, జూన్ 30, 2024మధ్య వివిధ కాలాల వరకునిలిచిపోయాయి. జార్ఖండ్, తెలంగాణ, త్రిపుర, గోవాలలో నాలుగు కమిషన్లు నిలిచిపోయాయి, అయితే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాఖండ్ ఒడిశాలో ఐదు కమిషన్లలో చీఫ్ కమిషనర్ లేరు. జూన్ 30, 2024 నాటికి, మొత్తం 29 కమిషన్లలో నాలుగు లక్షల కంటే ఎక్కువ అప్పీళ్లు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే కొన్ని చోట్ల తప్ప మామూలు రాష్ట్రాలవారు కూడా హెడ్‌ను నియమించడం లేదు. ఇంక గతి ఏదంటే సిఐసి కి దిక్కులేదు. కేంద్ర రాష్ట్రాలలో ఖాళీలు కావాలని నియమించడం లేదు. స్టేట్ ఐసి SIC పదవిలో ప్రవేశించిన మూడేళ్లలోగా నియ మించక ఏళ్లదాకా ఖాళీగా వదిలేస్తున్నారు. ఆర్టీఐ చట్టాన్ని బలహీనం చేసినవారు పార్లమెంట్, పరస్పర విరుద్ధ తీర్పులతో న్యాయస్థానాలలు ఊపిరి తీస్తేన్నారు. ఇక మన ప్రభుత్వం కేంద్రంలో రాష్ట్రాల్లో ఖాళీలనే ఎత్తుగడల ద్వారా పారదర్శకతను పర్యవేక్షించే సమాచార సంస్థ మొత్తం మీద తీవ్రమైన పక్షవాతానికి గురైంది. ఇదిగాక వ్యక్తిగత డేటా రక్షణ చట్టం (Personal Data Protection Act) పిడుగుపాటుగా పౌరుల సమాచార హక్కును మరింత నిరుపయోగం చేస్తున్నది. 20 సంవత్సరాల దాకా ఆర్టీఐ కోసం పోరాడిన పారదర్శికత దెబ్బతింటున్నది.

కేంద్ర సమాచార కమిషన్ (CIC) మరోసారిప్రధాన కమిషనర్(chief) లేకుండా ఉంది. గత 11 ఏళ్లలో పారదర్శకతను పర్యవేక్షించే ఈ సంస్థ తల లేనిదిగా మారడం ఇది ఏడవసారి. సెప్టెంబర్ 14, 2025న అప్పటిచీఫ్ సమాచార కమిషనర్ హీరాలాల్ సమరియా పదవీ విరమణ చేసినప్పటి నుండి, ఈ సంస్థ కేవలం ఇద్దరు కమిషనర్లతో మాత్రమే పనిచేస్తోంది. చీఫ్ సమాచార కమిషనర్ పదవితో సహా మొత్తం తొమ్మిది పోస్టులు ఖాళీగాఉన్నాయి. దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. 26,000 అప్పీళ్లు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. కొందరు దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను విచారించడానికి సంవత్సరంకంటే ఎక్కువ కాలం వేచి ఉన్నారు. ఇటువంటి జాప్యాలు సమాచార హక్కు(RTI) చట్టంచీఫ్ ఉద్దేశాన్ని దెబ్బ తీస్తున్నారు. పదవీ విరమణ తేదీలు పూర్తిగా తెలిసి కూడా, ప్రభుత్వం కావాలనే నియామకాలు చేపట్టకుండా పారదర్శకతను ఉద్దేశపూర్వకంగా చంపుతోంది. CICకి తాత్కాలిక చీఫ్ కమిషనర్‌ను నియమించడానికి RTI చట్టంలో ఎటువంటి నిబంధన లేదు. RTI చట్టం అనేది పౌరులు పాలనలో పాల్గొనడానికి ఒక తక్కువ ఖర్చులేనిది. ధనంతో పనిలేని సాధనం. ప్రజలకు తెలుసుకునే హక్కు ఉందని రాజ్యాంగంలో రాసుకుంటున్నాము. ప్రభుత్వం దేనికీ యజమాని కాదుఅని మనం గుర్తుంచుకోవాలి. ఈ రోడ్లు, ఈ పెద్ద మౌలిక సదుపాయాలు, ఈ భవనాలు అన్నీపన్ను చెల్లింపుదారుల డబ్బుతో నిర్మిస్తారు తెలుసా. ఇవి ప్రజలకు చెందినవి. జ్ఞానం, తెలివి ఉండాలి. ఏం చేసినా తెలిసి పనిచేయకపోతే రాజ్యాంగం పనిచేయదు. రోజువారీ సమాచారం కూడా ప్రజలకే చెందుతాయి.

శ్రీ హీరాలాల్ సమరియా నవంబర్ 6, 2023న నియమితులైన చీఫ్ సమాచార కమిషనర్ 65 ఏళ్ల వయస్సు తర్వాత పదవీ విరమణ చేశారు. బాధ్యతలు స్వీకరించడానికి ముందు, వై.కె. సింగ్ పదవీ విరమణ తర్వాత ఒక నెలపాటు ఆ పదవి ఖాళీగా ఉంది. 2005లో RTI చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుండి పదవీ బాధ్యతలు చేపట్టిన 12 మంది చీఫ్ సమాచార కమిషనర్లలో, కేవలం 5 మంది మాత్రమే వారి

పూర్వీకులు పదవీ విరమణ చేసిన మరుసటి రోజు బాధ్యతలు స్వీకరించారు. CIC మొదటగా ఆగస్టు 2014లో రాజీవ్ మాథుర్ పదవీ విరమణ చేసినప్పుడు చీఫ్ కమిషనర్ లేకుండా ఉంది. అప్పుడు మాథూర్ గారి తరువాత రెండు రోజుల్లో ముగ్గురు సిఐసి (ఈ రచయిత కూడా) 2018లో పదవి ముగిసింది.

### బతకలేని అక్షరాలు ఈ మూడు 'ఆర్టీఐ'

సుప్రీంకోర్టు ఆదేశాల ఉల్లంఘన, నియామకాలలో ఆలస్యం వల్ల దెబ్బతింటున్నాం. పదవీ విరమణ, ఖాళీల తేదీలు ముందుగానే తెలుసు అయినప్పటికీ, ప్రభుత్వం సకాలంలో పోస్టులను భర్తీ చేయడంలో పదేపదే విఫలమైంది. ఇది ఖాళీలను సకాలంలో భర్తీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సుప్రీంకోర్టు 2019 తీర్పును నేరుగా ఉల్లంఘించడమే అని అంజలి భరద్వాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2019)కేసులో, ఖాళీలు RTI చట్టం పనితీరును "తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, ఇది ఈ చట్టం అమలులోకి రావడానికి ఉద్దేశించిన లక్ష్యాన్నినిర్వీర్యం చేసినట్లవుతుందని" కోర్టు హెచ్చరించింది. మరింత ఇటీవల, అక్టోబర్ 2023లో, పోస్టులు భర్తీ చేయకపోతే RTI చట్టం "నిరుపయోగమైన అక్షరం (dead letter)"గా మారే ప్రమాదం ఉందని కోర్టు హెచ్చరించింది.

ఇది ఒకే ఒక్క లోపం కాదు. నవంబర్ 2023 నుండి ఖాళీలు భర్తీ కాలేదు. తొలుత ఆగస్టు 2024లో ఎనిమిది సమాచార కమిషనర్ పోస్టుల కోసం, ఆపైమే 2025లో చీఫ్ కమిషనర్ పదవి కోసం ప్రకటనలు జారీ చేసినప్పటికీ, ప్రభుత్వం నియామక ప్రక్రియను పూర్తి చేయడంలో విఫలమైంది. ఈ సంవత్సరం జనవరిలో, ఏప్రిల్ 2025 నాటికి నియామకాలు చేపడతామని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది.

సెప్టెంబర్ 26, 2025న, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సూర్యకాంత్, జాయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం ముందు సమాచార కమిషనర్లను నియమించకపోవడంపై ఒక కేసు విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరపున వాదించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్, మునుపటి ఆదేశాలు ఉన్నప్పటికీ, కేంద్ర సమాచార కమిషన్‌లో ఖాళీలు భర్తీ కాలేదని పేర్కొన్నారు. కమిషన్‌లో కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే ఉన్నారని, 26,800 కంటే ఎక్కువ అప్పీళ్లు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని విచారణలు ఒక సంవత్సరం కంటే ఎక్కువ ఆలస్యం అవుతున్నాయని తెలిపారు.

జార్ఖండ్ రాష్ట్ర సమాచార కమిషన్‌ను 2020 నుండి, అంటే ఐదు సంవత్సరాల నాలుగు నెలల నుండి, నిలిచిపోయిందని కూడా కోర్టుకు తెలియజేశారు. చీఫ్ కమిషనర్ కమిషనర్ల నియామకం కోసం ఎంపిక కమిటీకి దాని సభ్యులలో ఒకరిని నామినేట్ చేయాలనిజనవరి 2025లో కోర్టు విధానసభలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీని ఆదేశించింది. ఈ విషయం తదుపరి విచారణ కోసం అక్టోబర్ 27, 2025కు జాబితా ఇచ్చారు. ఇంకేమవుతుందో చూడాలి

జూలై 2025లో బాత్రా దాఖలు చేసిన ఒక RTI దరఖాస్తుకు ప్రతిస్పందనగా, DoPT మే ప్రకటనకు ప్రతిస్పందనగా చీఫ్ సమాచార కమిషనర్ పదవి కోసం83 దరఖాస్తులు అందినట్లు ధృవీకరించింది. అంతకుముందు, సెప్టెంబర్ 2024లో, మరొక RTI దరఖాస్తు ద్వారా సమాచార కమిషనర్ల ఖాళీల కోసం ప్రకటన తర్వాత 161 దరఖాస్తులు అందినట్లు వెల్లడైంది. అయినప్పటికీ, నియామకాలు జరగలేదు. "అప్పటి నుండి, ఒక సంవత్సరం కంటే ఎక్కువ ఆలస్యం జరిగింది, ఖాళీలు ఇంకా భర్తీ కాలేదు" అని బాత్రా అన్నారు.

### ఖాళీలంటే పరిపాలనే ఖాళీ

నవంబర్ 2023లో జరిగిన చివరి నియామకాల కథ వివాదంలో చిక్కుకుంది : ఎంపిక కమిటీప్రతిపక్ష నాయకుడిని మినహాయించి ఏకపక్షంగా వాటిని చేసింది. RTI చట్టం ప్రకారం, ఎంపిక కమిటీలో ప్రధాన మంత్రి (చైర్‌పర్సన్), లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర కేబినెట్ మంత్రిఉండాలి.

ఈ రోజు, కమిషన్ ముందు సాధారణంగా వేచి ఉండే సమయం దాదాపు 8 నుండి 12 నెలలు లేదా అంతకంటే ఎక్కువ," అని నాయక్ పేర్కొన్నారు. "25,000 కంటే ఎక్కువ అప్పీళ్లు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. సమాచారం వెల్లడయ్యే సమయానికి, అది తరచుగా పాతబడిపోతుంది."

భారతదేశంలో28 రాష్ట్ర సమాచార కమిషన్లు (SICs) ఒక CIC ఉన్నాయి. RTI చట్టం ప్రతి కమిషన్‌లో పనిభారం ఆధారంగా ఒకచీఫ్ సమాచార కమిషనర్, 10 సమాచార కమిషనర్లు ఉండాలని ఆదేశిస్తుంది. దేశవ్యాప్తంగా SICలు కూడా అదే నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నాయి. "జార్ఖండ్ వంటి రాష్ట్రాలు ఉన్నాయి, ఇక్కడ గత సంవత్సరం నాటికి ఒక్క కమిషనర్ కూడా లేరు," అనిసతర్క్ నాగ్రిక్ సంఘటన్ (SNS) చేసిన అధ్యయనాన్ని ఉటంకిస్తూ నాయక్ ఎత్తిచూపారు. "కర్ణాటక మహారాష్ట్రలో, అనేక కమిషనర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి, దీని వలన మొత్తం విభాగాలు న్యాయనిర్ణేతలు లేకుండా ఉన్నాయి. కానీ ఖాళీలు భర్తీ కానప్పుడు, కేసులు విచారణకు నోచుకోవు." ఈ నివేదిక మరొక విచిత్రాన్ని కూడా వెల్లడించింది : RTI చట్టంలోనిసెక్షన్ 25ప్రతి కమిషన్ చట్టం అమలుపై వార్షిక నివేదికను తయారు చేసి ప్రచురించాలని ఆదేశించినప్పటికీ, 62 శాతం కమిషన్లు తమ 2022-23 నివేదికలనుప్రచురించలేదు. "పారదర్శకత సంస్థలు RTIలకు సంబంధించిన డేటాను ప్రచురించడం లేదు, దీని వలన CIC,

SICలలో RTI వినియోగం పూర్తి స్థాయిని అర్థం చేసుకోవడం కూడా కష్టమవుతుంది.

### జరిమానా విధిస్తారనే భయమే లేదు

RTI చట్టంలోని సెక్షన్ 20లోపభూయిష్ట ప్రజా సమాచార అధికారుల(PIO)పై 25,000 వరకు జరిమానా విధించే అధికారాన్ని సమాచార కమిషన్లకు ఇస్తుంది. ఈ నిబంధనలు పాటించని అధికారులపై జరిమానాల భయంపోతుంది. ఒక PIO RTI దరఖాస్తును విస్మరించినా లేదా సమాచారాన్ని తిరస్కరించినా, పిటిషినర్ కేసు ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం విచారణకు రాదని అతనికి తెలుసు. ఆ సమయానికి, పిఐఒ మారిపోతాడు. కమిషన్ పదవి ముగుస్తుంది. RTI అమలు జవాబుదారీతనంగాలిలో కలిసిపోతుంది. SNS నివేదిక ప్రకారం, జరిమానాలు వర్తించే కేసులలో 95 శాతం కేసులలో కమిషన్లు జరిమానాలను విధించడంలో విఫలమయ్యాయి. ప్రభుత్వమే చంపాలనుకుంటే రాజ్యాంగాన్ని, ఆర్టీఐని, ప్రశ్నించే తెలుసుకునే హక్కును, జీవించే హక్కును దెబ్బ తీస్తామంటే ఇంక చేసేదేముంది? ❑

## బెడిసి కొడుతున్న పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం!

**(30వ పేజీ తరువాయి)**

కూడా అదే పరిస్థితి. కానీ హాం కాంగ్ వంటి కొన్ని మెట్రోలు మాత్రం నిర్వహణ ఖర్చుల పరంగా చూసినప్పుడు మిగులు చూపుతున్నాయి. అవి మెట్రో స్టేషన్ల చుట్టూ రియల్ఎస్టేట్ వ్యాపారాల ద్వారా భారీ ఆదాయం పొందుతున్నాయి. భారత గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, యుఐటిపి, కాగ్‌లు చేసిన అధ్యయనాల ప్రకారం, మెట్రో టికెట్ చార్జీల రూపంలో వచ్చేది సాధారణంగా నిర్వహణ ఖర్చుల్లో 30 శాతం నుండి 60 శాతం మాత్రమే భర్తీ చేస్తాయి. మిగిలిన మొత్తం ప్రభుత్వాలు సమకూరుస్తున్నాయి. ప్రపంచ దేశాలు మెట్రో ప్రాజెక్టులను లాభాల కోసం కాకుండా, ప్రజా ప్రయోజ నాల కోసం, దీర్ఘకాలిక పట్టణ స్థిరత్వం కోసం కింది 5 ముఖ్య లక్ష్యాలతో ప్రోత్సహిస్తున్నాయి.

- **1.పట్టణ రవాణా :** సౌలభ్యం, రద్దీ తగ్గింపు, వేగవంతమైన, విశ్వసనీయమైన, అధిక సామర్థ్య ప్రజా రవాణా. రోడ్డు రద్దీ, ప్రయాణ సమయం తగ్గింపు.
- **2.పర్యావరణ ప్రయోజనాలు :** వాయు కాలుష్యం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గించడం.
- **3.భద్రత–సౌకర్యం :** రోడ్డు ప్రమాదాలకంటే సురక్షితమైన ప్రయాణం. ముందస్తుగా అంచనా వేసే సౌకర్యం, ఎయిర్ కండిషన్డ్ రైళ్లు.
- **4.సమగ్ర వృద్ధి–చేరువ :** మధ్య తరగతి, తక్కువ ఆదాయ వర్గాలకు చవకైన ప్రయాణ సౌకర్యం. పట్టణ పేదలు, మహిళలకు మెరుగైన కనెక్టివిటీ.
- **5.పట్టణాభివృద్ధి–ఆర్థిక వృద్ధి :** మెట్రో స్టేషన్ల చుట్టూ అభివృద్ధి, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఆస్తి విలువలు పెరగడం, ఉపాధి అవకాశాలు సృష్టి.

ఈ లక్ష్యాలను అనుసరించే దేశాలు సోషలిస్టు దేశాలు కావు. అవి ప్రపంచబ్యాంకు మొదలైన సంస్థల నయా ఉదారవాద విధానాలనే అమలు చేస్తున్నాయి. కానీ భారత ప్రభుత్వం మాత్రం ప్రజా రవాణాను లాభం–నష్టం స్కేల్‌తో కొలుస్తూ, అన్ని ప్రాజెక్టులను పిపిపి పద్ధతులకే కట్టుబడటం అత్యంత శోచనీయం, దేశ ద్రోహం. కేవలం ఒక రవాణా రంగమే కాదు. అన్ని రంగాలలోనూ ఇదే వరవడి.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై.. ఏకధృవ ప్రపంచం అనే ముసుగులో ప్రపంచీకరణ ముందుకొచ్చింది. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ హయాంలో పి.వి.నరసింహారావు నేతృత్వంలో మన్మోహన్‌సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశ పెట్టారు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వం ప్రజా బాధ్యత నుండి వైదొలగి ప్రజలను మార్కెట్ శక్తులకు వదిలి వేయడమే ఆ విధానాలలో కీలకమైనది. కానీ 2004లో వామపక్షాలపై ఆధారపడిన యు.పి.ఎ ప్రభుత్వం కనీస ఉమ్మడి కార్యక్రమానికి అంగీకరించాల్సి వచ్చింది. అందులో భాగంగా ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు కొన్ని మార్గదర్శకాలను రూపొందించి అమలు చేశారు.

నరేంద్ర మోడీ నేతృత్వంలో 2014లో ఏర్పడిన ఎన్.డి.ఎ ప్రభుత్వం ప్రైవేటుకు గేట్లు ఎత్తింది. ప్రభుత్వ రంగ పరిశ్రమలు పుట్టింది చావడానికేనని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీనే ప్రకటించారు. తాజాగా తెలుగు గడ్డ మీద విశాఖలో ఆర్థిక మంత్రి నిర్మలమ్మ "ప్రైవేటీకరణ మా విధానమని" మరొకసారి కుండబద్దలు కొట్టారు. "నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్" పేర నేడు ప్రైవేటీకరణ కొత్త మార్గంలో నడుస్తోంది. ప్రైవేట్ వారు ఎలాంటి పెట్టుబడి పెట్టకుండానే, ప్రజల సొమ్ముతో ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ రంగ మౌలిక సదుపాయాలను (రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లుగా పైప్‌లైన్లు వగైరాలు) ప్రైవేట్ వారికి లీజుకు ఇస్తున్నారు. అంటే వడ్డించిన విస్తరిలో భోజనం ఆరగించడమే.

ప్రభుత్వం ప్రజా ఆస్తులను ప్రైవేట్ వారికి ధారాదత్తం చేసే ఈ వినాశకర విధానాలను అనుమతించాలా? లేక దీనికి ముగింపు పలకాలా? ఈ ప్రశ్నకు భారత ప్రజలే సమాధానం చెప్పాలి. ప్రజలే చైతన్యవంతులై కదిలి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల మార్పుకు సన్నద్ధం కావాలి. ❑

# గోత్రాలు, వాటి పుట్టు పూర్వోత్తరాలు



- పి.బి.చారి

గోత్రం అంటే మొదట్లో పశుశాల అని అర్థం. అంటే గోవులను కట్టివేసే కొట్టం లాంటిది. ఒక్కో గోత్రం వారు తమ పశువులు మారు పడకుండా ఒక్కొక్క రకం ముద్రలు పశువుల మీదకొట్టేవారు. ఆ విధంగా పశువులపై ఉమ్మడి యాజమాన్యం నెరిపేవారు. ఆ తర్వాత కాలంలో ఈ ఉమ్మడి పశువుల సమూహం. భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఉమ్మడి కుటుంబాలుగా మారాక, “గోత్ర” అనే మాటకు ప్రాముఖ్యత అందుకు తగినట్లు మారిపోయింది. దానితో గోత్రం అంటే గృహం, లేదా ఒక ఇంటి పేరు గల వారు లేదా ఒక శాఖ వారు అనే అర్థం వచ్చింది. కాలక్రమేణ వంశానికి మూల పురుషుడుని సూచించే పదంగా ఇది పరిణామం చెందింది. గోత్రాన్ని ఏదో ఒక రుషి పేరుతో పిలిచేవారు. అశ్వలాయన శ్రౌత సూత్రాలలో అనేక గోత్రాలను ప్రస్తావించాడు. వత్స(దూడలు), శునక(కుక్కలు), రిక్క(ఎలుగులు), భార ద్వాజ(ఒక రకం పక్షులు), ముద్గల(ఒక రకం చేపలు), కపి(కోతులు), అజా (మేకలు), వేణు(వెదుళ్ళు), కాశ్యప (తాబేలు), శాండీల్య(ఒక రకం పక్షులు), గౌతమ (గోవులు), కుశక (గుడ్ల గూబ), మండూక(కప్ప), ధర్భా(గడ్డి), తిత్తిర (చిలుక) ఇలా అనేక గోత్రాలను ప్రస్తావించాడు. ఇలా గోత్రాలకు ఏదో ఒక జంతువో, పక్షి పేరు గోత్ర సంకేతంగా ఉంటుంది. సప్త రుషులు నుండి వచ్చామని చెప్పుకునే వీరికి 7 గోత్రాలు ఉండాలి. కానీ గోత్రాలు సంఖ్యను చూస్తే 50 నుంచి 73 వరకు ఉన్నాయి. మరి దీని అర్థం ఏమిటి? బహుశా ఆర్యేతర తెగల నుండి ఉన్న పురోహితులను వైదిక మతంలోకి చేర్చుకొని వారికి ఒక్కొక్క తెగకు ఒక్కొక్క గోత్రం చొప్పున అరువుఇచ్చి ఉండవచ్చు. అందువల్లనే గోత్రాలు సంఖ్య అపరిమితంగా పెరిగిపోయాయి. మా గోత్రాలు రుషుల నుండి వచ్చాయని దబాయించే వారు ఈ రుషులు ఒకప్పుడు అనాగరిక, ఆటవిక, బర్బర సమాజ వ్యవస్థ కు చెందిన వారనే సంగతి విస్మరిస్తుంటారు. అసలు సప్త ఋషుల జాబితాలే రెండు రకాలు ఉన్నాయి. ఒక దానికి ఒకటి పొంతన ఉండదు. మన దేశ జనాభాలో ఎక్కువ మంది ఆర్యులు కానీ జాతులకు చెందిన వారే. అంటే ఆటవిక జాతుల, తెగలకు చెందిన వారు. మనది మిశ్రమ సమాజం. మన ప్రజలు అనేక జాతుల తెగల కలగలుపు. ఆచారాలు జీవిత విధానాలు కూడా అంతే. అయితే ఈ గోత్రనామాలతో జంతువుల పేర్లు లేక మొక్కలు, ఫలాల పేర్లు ఎందుకు ఉంటున్నాయి అన్న విషయాన్ని సమగ్రంగా పరిశీలించాలి. వేదాంతర సాహిత్యమైన వేదాంతంలో ఉపనిషత్తులు ఉన్నాయి. ఈ ఉపనిషత్తులో ఒకటైన ఛాందోగ్యోప నిషత్తులో కొన్ని సునక మంత్రాలు కనిపిస్తాయి. ఈ ఉపనిషత్తు ప్రథమాధ్యాయంలో చాలా వినోదాన్ని కలిగించే సందర్భాన్ని వివరిస్తుంది. సామవేదాన్ని గానం చేసే మంత్రకర్తలను లేదా పురోహితులను పరిహసించే సన్నివేశం వర్ణితమైంది. ఆ రోజుల్లో “బకదాల్భ్యుడు” అనే ఋషి వేదాధ్యయనం కోసం ఏకాంతంలో ఉంటాడు. ఇతడికి మరొక పేరు “గ్లావ్ మైత్రేయుడు” అని కూడా అంటారు. ఒక రోజున ఒక తెల్ల కుక్క అతడు ఉంటున్న ప్రదేశానికి వచ్చింది. మరికొంతసేపటికి మరి కొన్ని కుక్కలు అక్కడకు చేరాయి. ఆ కుక్కలు తెల్ల కుక్కతో ఇలా అన్నాయి. నువ్వు సామగానం చెయ్యి మాకు ఆహారం ఏమైనా దొరుకుతుందేమో అని అడుగుతాయి.

తెల్ల కుక్క ఆకలిగొన్న కుక్కలను మర్నాడు రమ్మన్నది. ఇది విని దాల్భ్యుడు ఆశ్చర్యపడ్డాడు. కుక్క ఎలా సామగానం చేస్తుందో వినాలని, ఆ ఋషి అనుకున్నాడు. మర్నాడు ఆ కుక్కలన్నీ అక్కడికి చేరాయి. ఒక దాని తోకను ఇంకొకటి నోటితో పట్టుకొని, వెనుక కాళ్ల మీద కూర్చొని సామగానం చేయసాగాయి. ఓం మాకు ఆహారం లభించుగాక ! ఓం మాకు నీరు లభించుగాక ! ఓం అన్న దేవుడా ! మాకు అన్నాన్ని పెట్టు ! అది పెట్టు ! ఇది పెట్టు ! అని మొరగటం ప్రారంభించాయి. పైన చెప్పిన పరిహాసోక్తిలో యజ్ఞసమయంలో సామ గాయకులను కుక్కలతో పోల్చి అనుకరించటం జరిగింది. పొట్టకూటి కోసం ఒకరి వెనుక మరొకరు కూర్చుని, ఒకరి వస్త్రాన్ని మరొకరు పట్టుకుని, సామగానాన్ని గావించే పురోహితులను పరిహసించటంగా కనపడుతుంది. ఆది శంకరుని భాష్యం ప్రకారం శ్వేత(తెల్లని) శునకం, సునక రూపంలో ఉన్న ఋషి అని, ఆయన వద్దకు చేరిన మిగతా శునకాలు రుషులేనని శంకరుడు అంటాడు. పైన చిత్రించబడింది ఎంత పరిహాసంగా కనిపించినప్పటికీ సునక జాతి ప్రజల సమూహం ఒకటి ఉన్నది అన్నది వాస్తవం. ఒక్క శునక జాతి ప్రజలు మాత్రమే కాదు. అనేక జంతు, మొక్కల నామాలతో ఉన్న ప్రజలు ఉన్నారన్నది వేద సాహిత్యంలో అనేక ఆధారాలు ఉన్నాయి. ప్రాచీన సమాజ అవశేషాల్లో, ప్రపంచమంతటా, సర్వత్రా కనిపించే విశేషమేమంటే ఆ ప్రజలంతా తమ పేర్లను వృక్ష ప్రపంచం నుంచో, జంతు ప్రపంచం నుంచో ఎరువు తెచ్చుకున్నవే. ఆయా సమూహాలకు లేదా ఆయా కుదుర్లకు, లేదా ఆయా వంశాలకు అవి చిహ్నాలు అన్నమాట. కుదురు

చిహ్నాలు అంటే ఏమిటో, ఆ చిహ్నాలు మానవ సమూహాలకు ఎలా గుర్తులుగా అనుసంధానించబడ్డాయో నిశితంగా పరిశీలించాలి.

ఒక ప్రాంతంలో సంచార నివాసం చేస్తూ ఆహారాన్ని సేకరణ ద్వారా జీవనం సాగించే గుంపు లేదా ఒక కుదురు ప్రజల సమూహం, ఒక దుంపను గాని, అడవి ధాన్యాన్ని గాని, లేక ఒక జంతువును గాని సేకరించడంలో, లేదా వేటాడటంలో ఆ కుదురు ప్రత్యేక మైన నైపుణ్యాన్ని సాధిస్తుంది. అలా ఆ కుదురు తను ప్రత్యేకంగా ఎంచుకున్న ఆహార పదార్థం చెట్టు గాని, మొక్క గాని, దుంప గాని, లేదా ఏదైనా జంతువు, పక్షి గాని ఆ కుదురు కు చిహ్నం అవుతుంది (Totem). ఆ కుదురుకు వారి కుదురు చిహ్నమైన ఆహార పదార్ధంతో కేవలం భోజన-భోక్త సంబంధమే కాక అంతకుమించిన ఆధ్యాత్మ సంబంధం ఉందని భావిస్తారు. అది ఆ కుదురుకు ఆరాధ్యం అవుతుంది. దాని నుండి తాము వచ్చామని భావిస్తారు. ఇక అప్పటి నుంచి దానిని తినటం పాపం అని అశుభ్రం అని రకరకాల నిషేధం అమల్లోకి వస్తుంది. ఆ ఆహారాన్ని ఇకపై ఆ కుదురులోని వాళ్లు వేటాడటం కాని సేకరించడం కాని చేయటానికి వీలులేదు. ఆహారం కుదురుకు చిహ్నం అవుతుంది. ఈ రకమైన మార్పుకు అత్యంత ప్రముఖమైన ఉదాహరణ, వేద కాలంలో గోమాంస భక్షకులు అయిన ఆర్యులు, పూర్తి వ్యవసాయకులుగా మారిన తర్వాత ఆ గోమాంసాన్ని నిషేధించడం ఒక మంచి ఉదాహరణ.

ఇంకా కొంచెం వివరంగా తెలుసుకుందాం. ఒక తెగకు చెందిన ప్రతి వంశము ఒక జంతువు లేదా మొక్కతో చెలిమి లేదా కలయికను చేస్తుంది. దానినే చిహ్నం అంటారు. ఆ వంశం వారు ఆ జంతు వర్గానికి చెందిన వారుగా భావిస్తారు. ఆ జంతువు లేదా మొక్క నుండి ఆవిర్భవించిన ట్లుగా తల పోస్తారు. "సునక" వంశానికి చెందిన వారు తమను శునకాలు అనుకుంటారు. శునకాల నుండి వచ్చామనుకుంటారు. అందువల్ల ఈ శునకానికి చెందిన వారు శునకాన్ని తినటం నిషిద్ధం. ఎందుకంటే వారు ఆ చిహ్న(సునక) జాతి వారు కనుక. అపారమైన వేద సాహిత్యంలో వేర్వేరు మానవ సమూహాలకు కూడా జంతు నామాలతో పిలిచే సంప్రదాయం ఉన్నది.

"ఆజులు" అనే పేరు గల మనుషులు మనకు ఋగ్వేదంలో తగులుతారు. అజ అంటే మేక. మరో సమూహం ప్రజలు "సిగ్రులు" అని పిలిచారు అంటే ములగ చెట్టు. మత్స్య దేశం, మత్స్యులు అంటే చేపలు, అనబడే ప్రజలు అదే రుగ్వేదంలో కనపడతారు. శతపథ బ్రాహ్మణం సృష్టికర్త "కూర్మ" రూపంలో కనపడ్డాడు అని ఉన్నది. ఐతరేయ బ్రాహ్మణంలో అలాగే అధర్వ వేదంలో కూడా "కశ్యప" గోత్రీకులు అయిన పురోహితులు కనపడతారు. కశ్యప అంటే "కూర్మ"మే. అంటే తాబేలు.

కౌటిల్యుని అర్థశాస్త్రం "శునకాల"ని పేరు ఉన్న మనుషుల గురించి చెబుతుంది. "హరివంశంలో" ఒక అధ్యాయానికి అధ్యా యమే ఒక ప్రసిద్ధ వంశ వృక్షాన్ని వర్ణిస్తుంది. ఆ వంశం పేరు "శునకవంశం". మహాభారతం యాదవులలో ఒక తెగను శు నకాలు అన్నది. అదే ఇతిహాసం మరో రెండుచోట్ల "శునకాలు" అనే పేరు గల మానవ సమూహాలను పేర్కొంటుంది. భీష్మ పర్వంలోనూ, సభా పర్వంలోనూ ఇవి మనకు లభిస్తాయి. అదే మహాభారతంలో మానవ సమూహాలకు జంతువుల పేర్లున్నట్లు పేర్కొంటుంది. ఉలుక, వృచ్చిక, వాయస, జంబూక, గార్దభ, కుక్కుట, గజ, శశ, కూర్మ, వరాహ, మేష, వ్యాఘ్ర, హంస, మత్స్య, అశ్వ. ఇవన్నీ ఆయా సమూహాల కుదురు చిహ్నాలే.

ఈ చిహ్న పద్ధతి, జంతు వృక్ష నామాలు ఉన్న వారు ఒక్క మానవ సమూహాలకే పరిమితమై లేదు. విస్తారంగా ఉన్న వేద సాహిత్యం భాగాలకు, శాఖలకు పరిచితమైన జంతు నామాలు వున్నాయి. ఋగ్వేద సంహితలో నాలుగు "శాఖలు" ఉన్నాయి. అశ్వలాయన, వాస్కల, సాంఖ్యాయన, మాండూక్య ఈ చివరి పేరు మాండూక్య అంటే కప్ప. మిగతా మూడు ఇదే విధంగా జంతువు లేదా వృక్ష మూలము నుండి వచ్చినవే. సామవేద సంహితకు సహస్ర శాఖలున్నాయి అని పురాణాలు చెబుతాయి. అందులోనే ఏడు శాఖల పేర్లు కౌథుమ, సత్యముగ్ర రాన్యా యన, కపోల, మహా పోకల, లాంగూలిక, శార్దూలీయ చివరిది శార్దూలము అంటే పులి నుంచి వచ్చిన పేరే. మిగిలినవి కూడా జంతు మూలాలే అయి ఉండాలి. కృష్ణ యజుర్వేద సంహితలోని ప్రసిద్ధ శాఖలలో ఒకదాని పేరు తైత్తరీయ సంహిత. తైత్తరీయ అంటే ఒక జాతి పక్షి (తిత్తిర) నుండి వచ్చినపేరే. మిగిలిన శాఖలలోని ఉపశాఖల పేర్లు ఆసక్తికరంగా ఉంటాయి. అవి మానవ, వరాహ, చాగలేయ, హరద్రవీయ, దుందుభ, శ్యామా యనీయ, మొదటి మూడు పేర్లు వరుసగా మనిషి వరాహం అంటే పంది, మేకల నుండి వచ్చాయి.

అధర్వవేద సంహితలో లభించే శాఖల పేర్లు "పైప్పలాద" "బ్రహ్మ పాలస" "శౌనక" వీటిలో మొదటి పేరు పిప్పల ఫలం మీద ఆధారపడి జీవించిన పక్షి నామం నుండి వచ్చినది. శౌనక మూలం శునకం అంటే కుక్క. ఇలా వేద సంహిత శాఖల పేర్లు లో అనేక జంతువుల నుంచో వృక్షాన్నుంచో సాధించిన పేర్లే. అంతేకాదు కొన్ని ప్రధానమైన ఉపనిషత్తులకు కూడా జంతు నామాలున్నాయి. ఉదాహరణకు శ్వేతాశ్వతర ఉపనిషత్ (అశ్వం లేదా గుర్రం), మాండూక్యోపనిషత్ (మండూక అంటే కప్ప), కౌశితకి ఉపనిషత్ (కౌశితకీ అంటే గుడ్లగూబ), తైత్తిరీయ ఉపనిషత్తు (తైత్తరీయ అంటే తీత్తిరి పక్షి. చా గలేయ అంటే మేక. ఇలా మేక జంతు వృక్ష నామాలు మానవ సమూహాలకే కాక వేద సాహిత్యం శాఖలకు కూడా అలాంటి పేర్లు ఉండటాన్ని బట్టి ఇవన్నీ కుదురు చిహ్నాలని గుర్తించవచ్చు. ❑

# జాషువా విశ్వకవి ఎందుకయ్యాడు?



- ప్రసాదమూర్తి

మహాకవి గుర్రం జాషువా గురించి ఆనాడు మార్క్సిస్టు విమర్శకులు, కవి పండితులు సరైన అంచనా వేయలేదు. ఈనాటికీ సమగ్రమైన అంచనాతో వారు లేరు. అంబేద్కరిస్టు విమర్శకులు, కవి పండితులు ఇప్పుడు వేస్తున్న అంచనా ఒక ధోరణిలో ఉంటుంది. ఇద్దరికీ కేంద్ర బిందువుకు కులాన్ని ఉంచాలి. కాకపోతే మార్క్సిస్టులు కులం కాదు వర్గమే అంటూ జాషువాను, ఆయన వచ్చిన నేపథ్యం నుంచి ఆయన చూపించిన కవితా ప్రతిభ నుంచి మాత్రమే కొలవడానికి ప్రయత్నం చేస్తారు. అంబేద్కరిస్టులు కులమే అంటారు. ఈ సెప్టెంబరు 28కి జాషువా పుట్టి 130 సంవత్సరాలు అయింది. ఇప్పటికైనా ఒక స్పష్టమైన మార్క్సిస్టు అంబేద్కరిస్టు అవగాహనతో కూడిన ఒక అంచనా కట్టాలన్న నా చిరు ప్రయత్నంగా జాషువా జయంతి నాడు ఒక వీడియో చేశాను. దానికి అక్షర రూపమే ఈ వ్యాసం. ఒకసారి ఈ పద్యాన్ని గుర్తు చేసుకుందాం.

**"కుల మతాలు గీచుకున్న గీతలు జొచ్చి పంజరాన కట్టువడను నేను**
**నిఖిల లోకమెట్లు నిర్ణయించిన, నాకు తిరుగులేదు విశ్వనరుడ నేను"**

కుల మతాల మధ్య నన్ను బంధించకండి, నేను విశ్వ నరుడను అని జాషువా చెప్పుకున్నాడు. కానీ ఆయన ఆనాడు భారతీయ సమాజాన్ని చూసిన చూపు, గ్రహించిన జ్ఞానం, దాన్ని తన అక్షరాల్లో అద్దం పట్టిన తీరు. మొత్తం జాషువాని– ప్రాంతీయత నుంచి జాతీయత వైపు నడిపించి విశ్వ వేదిక మీద నిలబెట్టిన విషయాన్ని కళ్లుంటే చూడాలి. హృదయం ఉంటే రాయాలి. తన దేశపు కాలమాన పరిస్థితులను, సామాజిక ఆర్థిక పరిస్థితులను గతి తార్కిక భౌతిక దృష్టితో పరిశీలించి ఆ స్థితులను అత్యంత అద్భుతమైన తన రచనా వైదుష్యంతో కవిత్వంగా మలిచిన కవి జాతీయ కవిగా విశ్వకవిగా ఎదుగుతాడు. ఏ దేశంలోనైనా రెండే వర్గాలు ఉంటాయి. శ్రమ చేసే వర్గం, ఆ శ్రమను దోపిడీ చేసే వర్గం. మనదేశంలో కూడా అంతే. కాకపోతే ఇక్కడ శ్రామికుల వర్గం దోపిడీకి గురి కావడానికి కారణం కేవలం వారు శ్రామికులు అయినందుకు మాత్రమే కాదు, వారంతా తరతరాలుగా అణగారిన కులాల నుంచి వచ్చిన వారైనందుకు, ఆ కులాల అసమానతలే ఆత్మగా కలిగిన మతం, వారి దోపిడీని నిరాటంకంగా కొనసాగించే ఆధిపత్య బ్రాహ్మణ పురోహిత కులాల వారికి అండగా నిలిచినందుకు. ఇది ఈ దేశపు ప్రత్యేక పరిస్థితి. దీన్ని పట్టుకున్నాడు జాషువా. మార్క్సిస్టు దృక్పథాన్ని అంబేద్కరిస్టు దృక్పథాన్ని



మేళవించి గబ్బిలం కావ్యం ద్వారా వర్గ దోపిడీని, దానికి ప్రాణాధారమైన కుల దోపిడీని ఏకకాలంలో ఎండగట్టి, భారతీయ అసమసమాజ అసలు రూపానికి అక్షరాక్షరం అద్దం పట్టి అసలు సిసలు విశ్వకవిగా జాషువా ఎదిగాడు.

తెలుగు సాహిత్యంలో అత్యంత గొప్ప కవులు జీవించిన కాలంలో జాషువా పుట్టాడు. గురజాడ, కందుకూరి, చిలకమర్తి లాంటి హేమాహేమీలు జీవన చరమాంకంలో ఉన్నారు. అప్పుడు నూనూగు మీసాల నవ యువకుడు జాషువా. కందుకూరి, చిలకమర్తి ఆశీస్సులు స్వయంగా పొందాడు. కులరక్కసి తాండవిస్తున్న దేశంలో నువ్వు బాధలే ఎదుర్కొంటావు, కానీ నీ కవితా ప్రస్థానం ఆపవద్దని కందుకూరి ఇచ్చిన ఆశీస్సులు మరువలేనివి. అయితే జాషువా కాలంలోనే ఆంగ్ల సాహిత్య ప్రభావంతో భావ కవితా వినీలాకాశంలో ధృవతార వెలుగొందిన కృష్ణశాస్త్రి, అభ్యుదయ కవిత్వానికి నాయకుడిగా నిలబడి సాహిత్యంలో భూకంపం పుట్టించిన మహాకవి శ్రీశ్రీ, సాంప్రదాయ కవిత్వానికి ప్రతినిధిగా పేరుగాంచిన కవి

సామ్రాట్ విశ్వనాథ మొదలైన వారు ఆ కాలంలోనే ఉన్నారు. అవధాన ప్రక్రియకు ఆకాశమంత కీర్తి తెచ్చిన తిరుపతివెంకట కవులు, కొప్పర్తి కవులు కూడా అదే కాలంలో ఉన్నారు. చెళ్ళపిళ వెంకట శాస్త్రి స్వయంగా గండపెండెరాన్ని తొడిగి జాషువాను గౌరవించిన చారిత్రక సందర్భం మరువలేనిది. అయితే ఇలాంటి ఆనాటి మేటి కవుల కంటే జాషువాను ప్రత్యేకంగా నిలబెట్టే అంశం, భారతీయ ఆత్మలోని కులవర్గ అసమానతల అసలు స్వరూపాన్ని ఆయన అక్షరాల్లో బద్దలు కొట్టడమే. పట్టిన వస్తువును కవిత్వంగా మార్చే తీరులో ఆనాటి మేటి కవులు ఎవరికీ తక్కువ కాని, సాటిలేని అసమాన ప్రతిభను జాషువా కనబరిచాడు. ఆయన ఖండకావ్యాలు గానీ, ఫిరదౌసి, ముంతాజ్ మహల్ లాంటి కావ్యాలు గానీ ఎన్నో ఉదాహరణలు చూపించవచ్చు. కానీ వర్గ దృక్పథాన్ని, అలాగే వర్ణ దృక్పథాన్ని మేళవించి భారతీయ సమాజంలో ఉన్న దోపిడీ తత్వం వెనక ఉన్న కులమతపరమైన ప్రత్యేక పరిస్థితి ఆయువు పట్టును జాషువా పట్టుకున్నందుకే ఆయన విశ్వకవిగా నిలిచాడు. ఉదాహరణకు కొన్ని పద్యాలు చూద్దాం.

"వాని రెక్కల కష్టంబు లేని నాడు సస్యరమ పండి పులకింప సంశయించు వాడు చెమ్మటనోడ్చి ప్రపంచమునకు భోజనము బెట్టు వానికి భుక్తి లేదు"

ఈ పద్యం పక్కా మార్క్సిస్టు దృక్కోణంతో శ్రమ దోపిడీ విధానాన్ని ప్రతిభావంతంగా పట్టి చూపిస్తుంది. గబ్బిలం కావ్యం లోని ఇలాంటి పద్యాలతో పాటు అసలు శ్రమదోపిడి వెనక ఉన్న కుల దోపిడీ, దానికి కొమ్ముకాస్తున్న మతం, ఆ మతాన్ని నిలబెడుతున్న 33 కోట్ల దేవీ దేవతలు–ఈ మొత్తాన్ని చీల్చి చెండాడిన పద్యాలు జాషువాని ఆనాటి మేటి కవుల కంటే భిన్నంగా నిలబెడతాయి. 'కర్మ సిద్ధాంతమున నోరు కట్టివేసి / స్వార్థలోలురు నా భక్తిననుభవింత్రు' ఇలాంటి పద్యాలు వర్గ దృక్పథంతో రాసినవి. ఈ విషయంలో పొలాలన్నీ హలాల దున్ని అంటూ ఆనాడు విరుచుకుపడిన శ్రీశ్రీ లాంటి అభ్యుదయ కవులు జాషువా కంటే ముందే ఉంటారు. కానీ విచిత్రంగా దాని వెనుక ఉన్న కుల దోపిడీ మత దోపిడీని కూడా శ్రమ దోపిడీతో ముడిపెట్టి రాయడంలోనే జాషువా విశిష్టత ఉంది. "వాని తల మీద పులిమిన పంకిలమును/కడిగి కరుణింప లేదయ్యా గగనగంగ/ వాని నైవేద్యమున అంటువడిన నాడు/ మూడు మూర్తులకు కూడ కూడు లేదు" ఇలాంటి పద్యాలకు వచ్చేసరికి జాషువా విశ్వరూపం మనకు కనిపిస్తుంది. వర్గ దృక్పథం కళ్ళజోడు లోంచి చూసిన వారికి భారతీయ సమాజంలోని అసమానతల అసలు రహస్యం కులం అనేది కనిపించలేదు. ఒకటి కాదు రెండు కాదు ఇలాంటివి అనేక పద్యాలు ఉన్నాయి. హిందూ మతానికి అసమానత ఆత్మ అని బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన మాట గాని, ఇక్కడ శ్రమ విభజనే కాదు శ్రామికుల విభజన కూడా జరిగిందని ఆయన నొక్కి వక్కాణించిన విషయం గాని ఆనాటికీ ఈనాటికీ పెద్దగా వర్గ దృక్పథాన్నే ప్రధానంగా భావించేవారు పట్టించుకోరు. ఇప్పుడిప్పుడే కాస్త లాల్ నీల్ అంటున్నారు. కానీ అప్పుడు అంటే జాషువా కాలం నాడు ఇది అసలు పట్టించుకోలేదు. అందుకే జాషువా మిగిలిన వారి కంటే ముందున్నాడు. 'పాముకు పాలు చీమకు పంచదార' లాంటి పద్యాలు గాని, 'వాడిని ఉద్ధరించు భగవంతుడే లేడు' అనే పద్యం, 'ప్రతిమల పెండ్లి చేయుటకు వందలు వేలు వ్యయింత్రు గాని' అనే పద్యం, "ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి/ ఇనుప గజ్జల తల్లి జీవనము సేయు/ కసరి బుసకొట్టు నాతని గాలి సోక/ నాల్గు పడగల హైందవ నాగరాజు' ఇలాంటి పద్యాలు గాని ఎన్నో ఎన్నో అసమానతలకు ఆటపట్టైన ఈ దేశంలో శ్రమదోపిడికి అతి కీలకమైన హిందూ మతం, ఆ మతంలోని దోపిడీ తత్వం పై జాషువా సాగించిన దండయాత్ర అతి కీలకమైంది. అదే జాషువాను ఆనాటి గొప్పకవులందరికంటే గొప్ప స్థానంలో నిలబెట్టింది.

దీనితోపాటు ఖండకావ్యాలలో ఆయన తీసుకున్న కవితా వస్తువులు విశ్వజనీయమైనవి. తాత్కాలిక ఉద్యమాలతో విప్లవాల తో సంబంధం లేనివి. కాలంతోపాటు మనిషి.. మనిషితో పాటు మానవ జీవన తాత్విక ప్రస్థానం సాగినంత కాలం ఆ కవితా వస్తువులు సజీవంగా ఉంటాయి. ఇది కూడా నాటి కవుల కంటే మేటి స్థానంలో జాషువాను నిలిపి ఉంచడానికి కారణంగా చెప్పవచ్చు. ఏది ఏమైనా జాషువాను ఇప్పటికైనా సరిగ్గా అంచనా వేయడం అంటే, ఈ దేశంలో శ్రమదోపిడి ఏ రూపంలో జరిగింది అనేది ఒక సరైన అవగాహనకు రావడమే. అలా వచ్చినప్పుడు అంబేద్కరిజం ఈ దేశానికి ఎంత అవసరమో అర్థమవుతుంది. జాషువా లాంటి కవులు సృష్టించిన విప్లవం ఏంటో మనకు తెలియ వస్తుంది.

ఏ దేశంలోనైనా కమ్యూనిజం అవసరమే కానీ ఈ దేశంలో కమ్యూనిజం కడుపునిండా అంబేద్కరిజం నిండినప్పుడే ఇక్కడ విప్లవం పరిపూర్ణమవుతుంది. జాషువా గబ్బిలం ఇచ్చిన సందేశం కూడా ఇదే. తనను తాను విశ్వ నరుడుగా జాషువా అభివర్ణించుకున్నాడు. కులమతాలతో తనను కట్టి వేయవద్దని వేడుకున్నాడు. కేవలం కులం కారణంగానో, అంటరానితనం నేపథ్యంగా వచ్చిన కారణంగా నో, అతని కవిత్వ నిర్మాణ ప్రతిభ కారణంగానో ఆయన మహాకవి కాలేదు. కవిత్వంలో చూపించిన అసమాన ప్రతిభతో పాటు భారతీయ శ్రమ దోపిడీ తత్వాన్ని అంబేద్కర్ కళ్ళతో చూసి అక్షరాలను ఆవిష్కరించినందుకే జాషువా విశ్వనరుడే కాదు, విశ్వకవి కూడా అవుతాడని మనం గుర్తించాలి. అలా గుర్తించడమే జాషువాకు నిజమైన నివాళి. ❑

**(కొలిమి సౌజన్యంతో)**

# అంబేద్కర్ బౌద్ధ దీక్ష - నైతికత, సమానత



- మోకా సత్తిబాబు

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న ఐదున్నర లక్షల మంది అనుచరులతో బౌద్ధమతాన్ని స్వీకరించారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఈ గొప్ప సంఘటన కేవలం మత మార్పిడి కాదు. దేశానికి నైతికత, సమానత్వం, సామాజిక న్యాయం అందించాలనే అంబేద్కర్ సంకల్పానికి ఆచరణాత్మక రూపం. ప్రపంచ చరిత్రలో అతి పెద్ద మత మార్పిడి కార్యక్రమం. దీనికి సంబంధించిన మరికొన్ని అంశాలను పరిశీలించడం ఆసక్తికరంగా ఉంటుంది.

**అంబేద్కర్ హిందూ మతాన్ని ఎందుకు విడిచిపెట్టారు?**

హిందూ మతంలోని సామాజిక అంశం యొక్క ప్రాథమిక సూత్రం 'కుల వ్యవస్థ'. అంబేద్కర్ హిందూ మతంలో జన్మించాడు. కానీ మహర్ కులంలో జన్మించడం వల్ల బాల్యం నుండి అడుగడుగునా అస్పృశ్యతను ఆయన అనుభవించాల్సి వచ్చింది. 1901లో అంబేద్కర్ తన సోదరునితో కలసి తండ్రి వద్దకు వెళ్లడానికి సతారా నుండి కోరెగావ్ బయలుదేరారు. కోరెగావ్ రైల్వేస్టేషన్ నుండి, తండ్రి ఉంటున్న ప్రాంతానికి వాళ్ళని తీసుకుని వెళ్లడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. దానికి కారణం అంటరానితనం. చివరికి, వారు ఒక రాత్రంతా తిండి, మంచినీళ్లు లేకుండా ప్రయాణించవలసి వచ్చింది. పదేళ్ల అంబేద్కర్ పసిహృదయాన్ని ఈ సంఘటన ఎంతో ప్రభావితం చేసింది. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్ళిన అంబేద్కర్ జీవితంలో తొలిసారి స్వేచ్ఛనూ, సమానత్వాన్ని అనుభవించాడు. అయితే, అది కొంత కాలమే ! ఎప్పుడైతే తిరిగి భారతదేశంలో అడుగుపెట్టాడో ఆ వెంటనే 'మనువు' వెంటాడడం ప్రారంభించాడు. బరోడా మహారాజు శాయాజీరావు గైక్వాడ్ దగ్గర మిలటరీ కార్యదర్శిగా అంబేద్కర్ ఉద్యోగంలో చేరాడు. పేరుకు పెద్ద ఉద్యోగం. కానీ ప్రతి ఒక్కరి చేతిలో అవమానం ఎదుర్కోవాల్సి వచ్చింది. బరోడా రాజ్యంలో ఉండడానికి చిన్న జాగా కూడా ఆయనకు దొరకలేదు. చివరకు ఒక సత్రంలో ఉంటే, కులం తెలిసిన తరువాత అక్కడ నుంచి బయటికి గెంటివేశారు. ఇటువంటి భయంకరమైన చేదు అనుభవాలు అంబేద్కర్ జీవితంలో కోకొల్లలు. హిందూమతంలోని కుల వ్యవస్థ వలన తాను ఎదుర్కొన్న అవమానాలే మత మార్పిడి ఆలోచనలకు బీజం వేశాయి. దీనికితోడు కొలంబియా విశ్వ విద్యాలయంలో చదువుతున్నపుడు అమెరికన్ తత్వవేత్త జాన్ డ్యూయీ ప్రాగ్మాటిజం (ఆలోచనలు, చర్యల యొక్క ఆచరణాత్మకతను వివరించే తాత్విక ఆలోచన విధానం)తో ప్రభావితమయ్యాడు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే మూడు విలువలు మానవ సంక్షేమానికి మూల స్తంభాలుగా గ్రహించాడు. హెన్రీ క్లార్క్ వారన్ రాసిన 'బుద్ధిజం అనువాదం' అశోక శిలా శాసనాలు అధ్యయనం ద్వారా భారతీయ బౌద్ధంలోనే ఈ విలువలు పురుడు పోసుకున్నాయని అర్థం చేసుకున్నాడు. తన నిజ జీవితంలో ఎదుర్కొన్న అవమానాలు, విదేశాలలో ఉన్నప్పుడు తాను అభ్యసించిన ఆధు



నిక ప్రజాస్వామ్య భావనలు అంబేద్కర్‌ను ప్రభావితం చేశాయి. దీంతో హిందూ మతాన్ని వీడాలని ఆయన నిర్ణయించుకున్నారు. అలా నిర్ణయించుకున్న తరువాత 1935 యోలా మహాసభలో 'నేను హిందువుగా పుట్టాను. కానీ హిందువుగా మాత్రం మర ణించను' అంటూ సంచలనాత్మక ప్రకటన చేశారు. 1936లో కుల నిర్మూలన గ్రంథంలో "కులం పునాదుల మీద మీరు దేనినీ నిర్మించలేరు. ఒక జాతిని, నీతిని నిర్మించలేరు" అంటూ ఆయన శంఖారావం పూరించారు.

### ఏయే మతాలు ఆహ్వానించాయి ? ఎందుకు తిరస్కరించారు!

యోలా డిక్లరేషన్(1935) తర్వాత, అంబేద్కర్ తన ఆలోచన లకు, ఆశయాలకు తగిన మతం కోసం అన్వేషణ చేయడం ప్రారంభించాడు. అన్ని మతాలను కూలంకషంగా అధ్యయనం చేశాడు. ఈ క్రమంలో హిందూ మత పెద్దలతోబాటు ఇస్లాం, క్రైస్తవ, సిక్కు మతాల పెద్దలు అంబేద్కర్‌ను సంప్రదించారు. వారు ఆయనను తమ మతంలో చేరమని ఆహ్వానించారు. ఆర్య సమాజం, ప్రార్థన సమాజం నాయకులు ఆయనను హిందూ సంస్కరణ ఉద్యమానికి నాయకుడిగా ఉండాలని, హిందూ మతంలో కొనసాగాలని కోరారు. హిందూ మతానికి కులం పునాది అయినప్పుడు, అక్కడ సమానత్వానికి స్థానం లేదని చెబుతూ ఆయన తిరస్కరించాడు. అగాఖాన్ వంటి నాయకులు ఇస్లాంలో చేరమని ఆహ్వానించారు. దళితులకు సముచిత స్థానం కల్పిస్తామని, సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తామని హామీ వారు ఇచ్చారు. కానీ విభజన రాజకీయాలకు ఇస్లాం గుర్తింపుగా మారిందంటూ తిరస్కరించారు. చర్చి మిషన్ సొసైటీతో పాటు కొంతమంది క్రైస్తవ పెద్దలు అంబేద్కర్‌ను క్రైస్తవ మతంలోకి ఆహ్వానించారు. అయితే, భారతీయ క్రైస్తవం లో కూడా కుల ఆధారిత విభజన ఉండడంతోపాటు విశ్వాసం ఆధారంగా ఉన్న మతంలో తార్కికత ఉండదని చెబుతూ ఆయన ఈ ఆహ్వానాన్ని తిరస్కరించాడు. సిక్కు మతం ఒక మార్గంగా అనిపించినా, దానికి భౌగోళిక పరిమితులు ఉండడం వలన తిరస్కరించాడు.

### బౌద్ధమతమే ఎందుకు ?

కొలంబియా విశ్వ విద్యాలయంలో ఉన్నప్పుడే అనేక బౌద్ధ గ్రం థాలను అంబేద్కర్ అధ్యయనం చేశాడు. కొలంబియా యూని వర్సిటీ గ్రంథాలయంలోని పాళీ భాష నుండి ఇంగ్లీషులోకి అను వదించిన బౌద్ధ సాహిత్యాన్ని విస్తృతంగా చదివాడు. హిందూ మతంలోని కుల వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఒక తార్కిక, నైతిక, మానవతా ధర్మంగా బౌద్ధాన్ని అంబేద్కర్ గుర్తించాడు. టి.డబ్ల్యు.రైస్ డేవిడ్స్ రాసిన 'డైలాగ్స్ ఆఫ్ బుద్ధ' 'బుద్ధిజం, ఇట్స్ హిస్టరీ అండ్ లిటరేచర్' పుస్తకాలు బుద్ధుడిని ఒక మానవతా మూర్తిగా, సామాజిక విప్లవకారుడిగా పరిచయం చేశాయి. ఆ తరువాత, హెర్మన్ ఓల్డెన్ బర్గ్, ఇ.జె.థామస్, డైసట్జ్.టి.సుజుకి వంటి వారు రాసిన పుస్తకాలను అధ్యయనం చేసిన తర్వాత, భారతదేశ ప్రజలకు అవసరమైన చైతన్యపూరిత, నైతిక, ప్రజాస్వామ్య ధర్మంగా బౌద్ధాన్ని గుర్తించారు. అందునా బౌద్ధం పూర్తి భారతీయ మూలాలున్న మతం కావడం గమనార్హం.

### ధర్మ చక్ర ప్రవర్తనం

1955లో బౌద్ధ మహాసభ (బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా)ను నెలకొల్పి సామూహిక మత మార్పిడి ఏర్పాట్లను అప్పగించారు. నాగపూర్‌లోని 'దీక్షా భూమి'లో 1956 అక్టోబర్ 14న లక్షలాది మంది అనుచరులతో కలసి 'భిక్కు చంద్రమణి మనోస్థవీర' ద్వారా బౌద్ధాన్ని స్వీకరించారు. త్రిశరణాలు (బుద్ధం, సంఘం, ధమ్మం), పంచశీలను పఠించడం ద్వారా బౌద్ధంలో అడుగు పెట్టారు. తరువాత '22 ప్రతిజ్ఞలను' చదివి, అనుచరుల చేత చెప్పించారు. 'అసమానతలకు ప్రతీకగా ఉన్న హిందూ మతాన్ని విడనాడి, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కూడిన బౌద్ధ ధర్మం లోనికి వచ్చాను. నా మత మార్పిడి ధనం, అధికారం కోసం కాదు. మానవ గౌరవం, స్వాభిమానం కోసం' అని తన ప్రసంగంలో ప్రకటించారు. ఆ తరువాత ఒక సంవత్సరంలో అంబేద్కర్ స్ఫూర్తితో 50 లక్షల మందికి పైగా బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. 1956, డిసెంబర్ 6న అంబేద్కర్ మహా పరి నిర్యాణం చెందారు.

### అంబేద్కర్ బౌద్ధ ధర్మ స్వీకారం వెనుక ఇమిడి ఉన్న అంశాలు

- దేవునికి బదులుగా మనిషిని కేంద్ర బిందువుగా చేసిన మతం బౌద్ధం. అంధ విశ్వాసాలు, ఆచారాలకు బదులుగా హేతుబద్ధత, నైతికత, శాస్త్రీయ సూత్రాలపై ఆధారపడిన మతం అని భావించి అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించారు.
- బౌద్ధమతం కుల వ్యవస్థను వ్యతిరేకిస్తుంది. రాజులు, వ్యాపారులు, ధనవంతులు, పేదలు అందరూ కుల భేదాలు లేకుండా బౌద్ధ సంఘంలో సభ్యులు, బౌద్ధ మతం సమానత్వం, సోదరభావాన్ని ప్రబోధిస్తుంది
- ఇది దురాశ, దోపిడీకి వ్యతిరేకం. న్యాయబద్ధమైన ఆర్థిక పంపిణీ సూత్రాన్ని, సరైన జీవనోపాధిని ప్రబోధించడం ద్వారా ఆర్థిక న్యాయం సుగమమైనది. ఇది అంబేద్కర్‌ను ప్రభావితం చేసింది.
- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య భావనలను ప్రపంచానికి పరిచయం చేసింది బౌద్ధం. హక్కులు, అవకాశాలు లేని సమాజానికి బౌద్ధం సరైనదని అంబేద్కర్ భావించాడు. అందుకే అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడం. అవమానాలు, అసమానతలతో జీవిస్తున్న కోట్లాది మంది దళితులకు గౌరవం, స్వాభిమానంతో కూడిన జీవన గమనాన్ని ప్రసాదించింది. ❑

**రచయిత ఐ.పి.ఎస్ అధికారి** **(ప్రజాశక్తి సౌజన్యంతో)**

# తలవంచని గాన సరస్వతి తల వాల్చిన వేళ



- రాఘవ

**చల్లని కొండ గాలికి ఏటిలో కదలాడే అలల్లాగా ఆమె పాట సాగిపోతుంది. మనసు దూది పింజలై గాలిలో తేలిపోతుంది. నాలుగేళ్ల చిరు ప్రాయంలో మొదలెట్టిన ఆ గానం, ఇప్పటికి లలితంగానే సాగుతోంది. ఆమె పాటకు వయసు కూడా తలవంచింది. తన పేరులోనే సరస్వతిని ఇముడ్చుకున్నారు రావు బాలసరస్వతి దేవి. అక్టోబర్ 15వ తేదీ బుధవారం ఉదయం తన 98వ ఏట హైదరాబాదులో కన్నుమూసిన రావు బాలసరస్వతి దేవి, 2009 జులై 13 సోమవారం తిరుపతికి వచ్చిన సందర్భంగా తన గాన ప్రస్థానాన్ని నాతో ఇలా పంచుకున్నారు.**

"మా ఊరు గుంటూరు. ఇక్కడ మాకు లీలా మహల్ అనే డ్రామా థియేటర్ ఉండేది. మా నాన్న పార్థసారథి రావు గారికి సంగీత జ్ఞానం ఉండేది. వీణ, గిటార్ బాగా వాయించేవారు. మూడు సంవత్సరాల వయసులో వారితో కూర్చుని పాటలు, పద్యాలు వినేదాన్ని. దాంతో నాకు గాన కళ అబ్బింది.

కపిలవాయి రామనాథ శాస్త్రి గారు మా నాన్న గారికి సన్నిహితులు. ఆయన పాడిన గ్రామ్ ఫోన్ రికార్డులు మా ఇంట్లో ఉండేవి. వాటిని వినడం వల్ల నాకు సంగీత జ్ఞానం అబ్బింది. కానీ చదువు మాత్రం వంటబట్టలేదు. స్కూలుకు వెళ్లకుండా పాడుతూ కూర్చునే దాన్ని.

రామనాథశాస్త్రి గారు ఒకసారి గుంటూరులో డ్రామా వేశారు. 'నమస్తే నా ప్రాణ నాథా' అంటూ పాడుతున్నారు. అప్పుడు నా వయసు నాలుగు సంవత్సరాలు. ఆ పాట నాకొచ్చని, నేను కూడా పాడతానని మా నాన్న గారి దగ్గర మారాం చేశాను. అది గమనించిన శాస్త్రి గారు వెంటనే స్టేజి దిగి వచ్చి అసలు విషయం కనుక్కున్నారు. పాడతానంటే వద్దనకూడదని, మా నాన్న గారికి నచ్చచెప్పి నన్ను స్టేజిపైకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మొదలైంది నా పాటల ప్రస్థానం.

హెచ్.ఎం.వి. కంపెనీ వారు 1934లో చిన్న పిల్లల పాటలను రికార్డు చేస్తున్నారు. చిన్న పిల్లలు పాడితే బాగుంటుందని కొప్పరపు సుబ్బారావు గారు మా నాన్న గారిని అడిగారు.

**సంస్మరణ**

**ఒకనాటి ప్రత్యేక నేపథ్య గాయని రావు బాలసరస్వతి దేవి (97) అక్టోబరు 15వ తేదీన హైదరాబాద్‌లో కన్నుమూశారు.**



ముందు హార్మోనియం తీసుకుని వాయిస్తూ నన్ను పాడమన్నారు. నా పాట వారికెంతో నచ్చింది.

ఓగిరాల రామచంద్రరావు గారు హార్మోనియం వాయిస్తుంటే, నన్ను వంటరిగా పాడమన్నారు. ఆ పాటను హెచ్.ఎం.వి వారు రికార్డు చేశారు. మరో పాటను కూడా పాడాను. అప్పుడు నా వయసు ఆరు సంవత్సరాలు. దక్షిణాదిలో ఆ వయసులో ఎవరూ రికార్డింగుకు పాడలేదు.

పన్నెండు సంవత్సరాల వయసు పిల్లలతో సి.పుల్లయ్య గారు సతీ అనుసూయ సినిమా తీస్తున్నారు. ఆయన మా ఇంటికి వచ్చి, నన్ను సినిమాలో నటింపచేయటానికి మా నాన్న గారిని అడిగారు. అందుకాయన ఒప్పుకోవడంతో నా చేత గంగ వేషం వేయించారు. ఆ సినిమాలో నా పాటను నేనే పాడుకున్నాను. అప్పుడు నా వయసు ఎనిమిది సంవత్సరాలు.

ఆ బాల నటుల్లో అందరికంటే నేనే చిన్న దాన్ని. ఆ సమయంలోనే కె.సుబ్రమణ్యం గారి దర్శకత్వంలో బాలయోగిని సినిమా తీస్తున్నారు. ఆ సినిమా అంతా నాపైనే నడుస్తుంది. ఆ సినిమా బాగా విజయవంతం అయ్యింది. బంగారు పతకం

కూడా వచ్చింది. దాంతోనే నాకు మంచి గాయనిగా పేరొచ్చింది. అక్కడితో మా కుటుంబం గుంటూరు నుంచి మద్రాసుకు మారింది. ఆ రోజుల్లో ఎం.ఆర్.త్యాగరాజన్ భాగవతార్ పెద్ద నటులు. నా గొంతు విని, నాకు సంగీతం నేర్పించే బాధ్యతను ఆయన తలకెత్తుకున్నారు. సుబ్బయ్య గారి దగ్గర కర్ణాటక సంగీతాన్ని మూడు సంవత్సరాలు నేర్పించారు. కర్ణాటక సంగీతజ్ఞులలాగా గట్టిగా పాడడం నాకిష్టముండదు. లలితంగా పాడతానని నా పై అపవాదు. అలా పాడమంటేనే నాకిష్టం. కె.ఎల్.సైగల్ పాటలంటే నాకు చాలా ఇష్టం. నా చిన్నతనంలో ఆయన పాటలను ఎక్కువగా వినేదాన్ని. ఆయన విధానాన్నే అనుసరించేదాన్ని. సంగీతానికి ఒక పునాది కావాలి. సంగీత దర్శకులు నా గొంతుకు అనుగుణంగా మార్చుకుంటేనే పాడగలను. కొందరు సంగీత దర్శకులు కంపోజ్ చేసి ఇలాగే పాడాలని వత్తిడి చేయటం నాకిష్టముండేది కాదు. నేనలా పాడలేను.

నా పదహారవ ఏట కోలంకి రాజా వారితో నా వివాహమైంది. పెళ్లితో నా పాటలు ఆగిపోయాయి. అలా నాలుగేళ్ళు పాటలు పాడడం మానేయాల్సి వచ్చింది. పాటలు పాడకుండా పూర్తిగా బందీ అయిపోయాను. పాటలు పాడిన డబ్బులతోనే పోషణ జరగాలని లేదు. నా చేత పాడించాలని చాలా మంది ఆయనపై వత్తిడి తెచ్చారు. స్వప్నసుందరి సినిమాతో మళ్లీ పాడడం మొదలు పెట్టాను. అంతే, ఇహ వెనక్కి తిరిగి చూడలేదు.

మా నాన్న గారు నన్ను బొంబాయి తీసుకెళ్ళి, వసంత దేశాయ్ వద్ద హిందూస్థానీ సంగీతం నేర్పించారు. ఆ సంగీతంలో సంవత్సరంపాటు వాయిస్ మాడ్యులేషన్‌ను, మెళకువలను నేర్చుకున్నా. అంత శ్రమ పడితేనే ఇంత దాకా వచ్చాను. తెలుగు, తమిళం, మళయాళం, కన్నడం, సింహళి భాషల్లో చాలా పాటలు పాడాను.

నౌషాద్ దగ్గర పాడాలని నాకు ఎప్పటి నుంచో ఉండేది. అదృష్టం ఒక రోజు నా తలుపు తట్టింది. నౌషాదే నా దగ్గరకు ఒక మనిషిని పంపించారు. నేను పాడిన రికార్డును ఆయన తెప్పించుకున్నారు. నా పాట బాగుందని నన్ను పిలిపించారు. నౌషాద్ సంగీత దర్శకత్వంలో 'ఉడన్ కటొలా' సినిమాను హిందీ, తమిళ భాషల్లో ఒకేసారి తీస్తున్నారు.

హిందీలో పాడడానికి లతా మంగేష్కర్‌ను ఎంపిక చేయగా, తమిళంలో నన్ను ఎంపిక చేశారు. తొలుత నేను రెండు పాటలు పాడాను. చాలా గొప్పగా ఉన్నాయని అంతా మెచ్చుకున్నారు. ఆ పాటలను ఆ తరువాత హిందీలో లతా చేత పాడించారు. నేను పాడితే లత పాడనన్నారట. ఆ మాటే నౌషాద్ నాతో చెప్పారు. దాంతో నేను వచ్చేశాను. నేను పాడిన రెండు తమిళ పాటలు తప్ప అన్ని పాట లను లతా చేత నౌషాద్ పాడించాల్సి వచ్చింది. చివరికి తమిళంలో పాటలు కూడా.

కృష్ణా పిక్చర్స్ వారు అమ్మలక్కలు సినిమా తీస్తున్నారు. దానికి సుబ్బరామన్ సంగీత దర్శకులు. నా చేత ఒక పాట పాడించారు. వారికి చాలా బాగా నచ్చింది. ఆ సినిమా నిర్మాత సన్నిహితురాలైన పెరినాయకి కూడా పాడతారు. నా చేత పాడించడంతో ఆమెకు కోపమొచ్చింది. తానుండగా వేరే వారి చేత ఎలా పాడిస్తారని ఆగ్రహించిందట. దాంతో ఆయనకు కోపమొచ్చింది.

ఆ పాట పాడే దమ్ము ధైర్యం మరెవరికీ లేదని అందరి ముందర తేల్చి చెప్పారు. బాలసరస్వతితో కాకుండా ఆ పాట ఎవరితో పాడించినా ఆ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని కూడా మానేస్తానన్నారు. నేను ఫోన్ చేసి సుబ్బరామన్ గారిని ఇంటికి పిలిపించాను. అలా చేసి చెడ్డపేరు తెచ్చుకోవద్దని నచ్చచెప్పాను. ఎంతో నచ్చచెప్పాక ఆయన అందుకు అంగీకరించారు.

ఆ పాటను పెరినాయకి చేత పాడించారు. చాలా కాలం తరువాత నాకు తెలిసింది ఆ పాట సాకి పెరినాయకిది కాదని, అంతకుముందు నా చేత పాడించిన సాకీనే ఆ పాటకు అతికించారని. అది ఆమె గమనించలేకపోయింది. సుబ్బరామన్ పట్టుదలను చూసి ఆశ్చర్యమేసింది.

ఆ రోజుల్లో పాట పాడే చివరి వరకు ఎవరు పాడాలన్నది అనుమానమే. ఏ పాట ఎవరు పాడితే బాగుండేదో ఎన్నుకునే వారు. పాడలేని పాట ఆ గొంతులో ఇమడదు. ఆ పాట పాడగలుగుతానా అన్నది గాయకులే నిర్ణయించుకోవాలి. తమిళులు సంగీత ప్రియులు. నిజం చెప్పాలంటే సంగీతం వారి సొత్తు. ఎంత చిన్నవారైనా బాగా పాడితే ప్రాణం ఇస్తారు.

ఇప్పటి సినిమా సంగీతం గురించి చెప్పాలంటే కోట్లు ఖర్చు పెడుతున్నారు. కానీ, సంగీతంపైన, భాషపైన శ్రద్ధ చూపించడం లేదు. తెలుగులో ఎంత మంది గాయకులున్నా కానీ, బొంబాయి నుంచి ఉదిత్ నారాయణ్ లాంటి వారి చేత పాడిస్తున్నారు.

వారికి మన భాష రాదు. ఉచ్చారణ సరిగా ఉండదు. 'నీ కోసం' అని ఉచ్చరించడానికి బదులు 'ని కొసం' అని అంటారు. 'బాగుందా' అనడానికి బదులు 'బగుంద' అంటారు. ఎలా ఉచ్చరించాలో నిజానికి అతనికి తెలియదు. ఇలా ఉచ్చరించడం తప్పని తెలుగు వాళ్లు చెప్పాలి. పాటలో కొంత భాగం ఈ రోజు రికార్డు చేస్తే, మరి కొంత భాగం మరి కొన్ని రోజులాగాక చేస్తున్నారు. దాంతో అర్థం పర్థం లేకుండా పోతోంది.


ఈ రోజుల్లో కూడా కీరవాణి, ఇళయరాజా లాంటి వారు సంగీతం సమకూరిస్తే బాగుంటుంది. మేం పాడే రోజుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆరుద్ర, కొసరాజు, శ్రీశ్రీ వంటి వారు దగ్గర కూర్చుని ఇలా ఉచ్చరించాలని చెప్పేవారు." అంటూ తన విహంగావలోకనాన్నిలా ముగించారు. ❑

# శ్రమ విలువను చాటిన కవితా సిందూరం ఉన్నం, ఉష దంపతుల కావ్యగానం



- రాఘవ

మనిషి పుట్టుక నుంచి, నేటి ఆధునిక సమాజం వరకు జరిగిన మానవుడి నాగరికత పరిణామ క్రమాన్ని కవిత్వీకరించి చెప్పిన కావ్యం 'సిందూరం'. సీనియర్ జర్నలిస్టు ఉన్నం వెంకటేశ్వర్లు, ఉష దంపతులు సంయుక్తంగా ఈ ఆధునిక కావ్యాన్ని ఇలా రచించారు.




'వర్గ సమాజపు దుర్గం కూల్చి
విజయపతాకను ఎత్తండి
ధనిక పేదా తేడాలను కూల్చి
విద్య వైద్యం హక్కై పొందగ
కూడు నీడకు లోటే ఎరుగని,
సమతా దుర్గం నిర్మిద్దాం
రాజ్యభోజ్యం మనదే.. మనదే
అది శ్రమ హక్కేనని ప్రకటిద్దాం'

కారల్ మార్క్స్ 'క్యాపిటల్' స్ఫూర్తితో సాగిన ఈ రచనలో అటవిక, బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారి వ్యవస్థల్లో మానవుడి జీవన పోరాటాన్ని కళ్లకు కట్టినట్టు చెపుతారు.

ఉత్పత్తి, పంపిణీ విధానాన్ని వివరించే అర్థ శాస్త్రం 'క్యాపిటల్'. 'క్యాపిటల్'లో అసలు ఏముంది ? 'క్యాపిటల్'లో శ్రమ దోపిడీని ఎలా నిర్మూలించాలో ఉంది. యుద్ధాల నుంచి, సంక్షోభాల నుంచి, వర్గ విభేదాల నుంచి, హింస నుంచి, కష్టాల నుంచి, కన్నీళ్ళ నుంచి, అజ్ఞానం నుంచి శాశ్వతంగా ఎలా విముక్తి పొందాలో 'క్యాపిటల్' చూపిస్తుంది. ఆదిమ సమాజం మినహా, మిగతా సమాజాల్లో ఇప్పటివరకు సాగిన శ్రమ దోపిడీ ఎలా ఉందో వివరించి, దానిని ఎలా నిర్మూలించాలో చెపుతుంది. ఇప్పుడున్న సమాజానికి భిన్నమైన సమాజాన్ని ప్రతిపాదిస్తుంది.

మనిషి దాటుకుంటూ వచ్చిన ఒక్కొక్క సమాజాన్ని 'సిందూరం'లో వివరిస్తారు. జంతువుల నుంచి మనుషులుగా ఎలా పరిణామం చెందారో చెప్పే డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని 'తొలి చలనం'లో ఇలా గుర్తు చేస్తారు. 'జ్వలించిన జాతి సంఘర్షణలో, వెనుకటి కాళ్ళపై కాయం నిలిపి, ముందటి కాళ్ళను చేతుల్లా కదిపి, ప్రకృతి అవసరాలు తీర్చుకోవడం నేర్చిన రెండు కాళ్ళ జంతువే మనిషి' అంటారు.

### ఆదిమ సమాజం-వర్గరహిత ఆదర్శసమాజం

'ఆహారోత్పత్తులు సమస్తం అందరికీ సమంగా పంచడం ఆదిమ జీవనం నేర్పిన పాఠం.' అంటూ ఆదిమ సమాజంలో సమష్టి జీవనం సాగిందని, అదొక ఆదర్శ సమాజమని అంటారు. ఈ ఆదిమ సమాజంలో 'మనిషికి మనిషి తోడై, సైగలతో సంభాషిస్తూ, సమూహంగా జీవిస్తారు.' ఆహార సాధనలో రాళ్లు, తరువాత బరిసెలు, ఆ తరువాత విల్లంబులు ఆయుధాలుగా ఎలా పరిణామం చెందాయో చెబుతారు.

అటవిక దశలో అందరూ పనిచేయాలి. సమష్టి జీవనం సాగించాలి. ఈ దశలో ఆహారం నిల్వ చేయడం ఉండదు. పశువులను మచ్చిక చేసుకుని poto మనుషులు గుంపులు గుంపులుగా జీవించడం మొదలవుతుంది.

### బానిస సమాజం-తొలి వర్గ సమాజం

'సంపదైన పశువుల అపహరణకు, గుంపులపై గుంపులు దాడులు, ఓడిన గుంపులు కాపరులుగా, మనిషికి మనిషి బానిసను చేసిన తొలి రూపం' అంటూ తొలి వర్గ సమాజం, బానిస సమాజం ఎలా ఏర్పడిందో చెపుతారు. ఐరోపా దేశాల్లో ఉన్నట్టు మన దేశంలో బానిస సమాజం లేకపోయినప్పటికీ, మన దేశంలో యజమాని, శ్రామికుడు అనే వ్యవస్థ బానిస వ్యవస్థకు ఏ మాత్రం తీసిపోదు.

ఈ బానిస సమాజంలోనే 'వానకు తడిసి, నిప్పుకు దడిసి, ఉత్పాతాలకు భీతిల్లాడు. ఉందొక శక్తని ప్రణమిల్లాడు' అంటూ మొదలైన ప్రకృతి ఆరాధన క్రమంగా మతమై, మతమౌఢ్యంగా స్థిరపడింది. ఈ దశలోనే 'మూఢత్వపు చీకటి చీలుస్తూ, లేచిన నాటి చార్వాకం, పరిఢవిల్లిన బౌద్ధం' అంటూనే, 'అరుపుల్లో మాట మెరుపు మెరిసింది. మాట నోటి పలుకయ్యింది. అదే భాషగా తయారైంది' అంటూ భాష పుట్టుకని కూడా వివరిస్తారు. వ్యవసాయం మొదలవడంతో, సంచార జీవనం వదిలేసి, మైదాన ప్రాంతాల్లో స్థిర నివాసం ప్రారంభమైంది. 'ఉత్పత్తి క్రమంలో వర్గాలు పుట్టాయి. ఉత్పత్తి పంపిణీలో మోసాలు, మిగుళ్లు పొంగిన వ్యక్తి సంపద, దాని ముద్దు పేరే సొంత ఆస్తి'.

'అంతులేని పనిభారం మోస్తూ, ఆకలి తీరని దినాలు గడుపుతూ, బతుకే ఒక బందిఖానాగా, పైశాచిక హింసలు భరిస్తూ, బెదిరింపులను ఎదిరిస్తే, నడి వీధిలో నిర్దయగా శిరచ్ఛేదాలు జరిపించారు' అంటూ బానిస వ్యవస్థ ఎంత దుర్మార్గంగా ఉందో చెపుతారు.

## ఫ్యూడల్ వ్యవస్థ

ఇక్కడే ఫ్యూడల్ వ్యవస్థకు పునాదులు పడ్డాయి. బానిస వ్యవస్థ పోయింది కదా అనుకుంటే, మళ్లీ ఫ్యూడల్ వ్యవస్థ వచ్చి కూర్చుంది. "ఏనుగంత భారం దింపినంతలో, మళ్లీ కొండంత చాకిరీ ఎక్కితొక్కింది' అని ఆవేదన వ్యక్తం చేస్తారు.

ఈ ఫ్యూడల్ వ్యవస్థలోనే, ఋగ్వేదంలోని పురుషసూక్తం చాతుర్వర్ణ ధర్మాలను ప్రవచించింది. వాటి ఆధారంగానే మనువు రాసిన తొలి రాజ్యాంగం 'మను ధర్మం' పుట్టింది. ఇందులోని చాతుర్వర్ణ ధర్మాలకు రాజ్యవ్యవస్థ అధికార ఆమోద ముద్ర పడడంతో అది స్థిరపడిపోయింది. చాతుర్వర్ణ ధర్మాల స్థానంలో కుల వృత్తులు మొదలై, కుల వ్యవస్థ బలపడింది. కుల కట్టుబాట్లకు కులాచారాలు చుట్టేశారు. వస్తు మార్పిడి స్థానంలో డబ్బు మారకం మొదలైంది. పనికి చెల్లించే ధాన్యం బదులు, డబ్బులివ్వడం మొదలుపెట్టారు. ఫ్యూడల్ వ్యవస్థ కోరల్లో విలవిల్లాడలేక బైట పడిన కొందరు పట్టణాలకు వలస వెళ్లారు. అలా వెళ్లలేని వారు గ్రామాల్లోనే రోజు కూలీలయ్యారు.

## పెట్టుబడిదారీ వ్యవస్థ

'కొత్త ధనపతులు పెట్టుబడిదార్లు. పెట్టుబడి జగతినే ప్రగతిగ చూపారు. దోచి దాచిన 'సొంత ఆస్తి' కోటలను ధనం కట్టిన 'లాభంగా బొంకారు' అంటూ పెట్టుబడిదారీ వ్యవస్థకు దారి తీసిన పరిణామాలను వివరిస్తారు.

ఆధునికంగా తలెత్తిన కార్ఖానాలో ఉత్పత్తులు కొత్త కాంతులీనాయి. చేతి వృత్తులు దెబ్బతిన్నాయి. ఆధునిక పని విభజన మొదలైంది. సరుకుల మారకం బదులు కరెన్సీ వచ్చింది. రోడ్డు, విమాన, జల రవాణా మార్గాలు పెరిగాయి.

క్రమంగా మార్కెట్ రూపం మారింది. గ్రామ సంతలు దెబ్బ తిన్నాయి. సొంత అవసరాలకు కాకుండా, పరుల అవసరాలకు వస్తూత్పత్తి, ఎగుమతులు పెరిగాయి. తోలు నాణేల స్థానంలో కరెన్సీ వచ్చింది. ఉత్పత్తి పంపిణీలో తేడాలు వచ్చాయి. శ్రమ శక్తి వాటాను జీతంగా మార్చారు. మిగులు విలువను దోచుకుని, దాన్ని లాభంగా చూపారు. ఇది పెట్టుబడిదారీ సమాజ నికృష్ట రూపం.

'అలనాడు ఆవిరిలో లేచిన శక్తులు, యంత్ర భూతాలై బుసకొట్టాక, చేతి వృత్తులు కరిగి విరిగి పడ్డాక, పల్లెలో బతుకులు చిరుగులయ్యాక, ఏ దిక్కూ మొక్కూ లేని కూలిజనం, ఆ తల్లెదుట ఎంత కన్నీరు కార్చారో?' అంటూ ఉన్నం, ఉష ఆవేదన వ్యక్తం చేస్తారు.

ఉత్పత్తి అంతా అమ్మకం, కొనుగోలు సరుకైంది. అన్నిటిని డబ్బుతో కొలిచే పరిస్థితులు దాపురించాయి. సరుకు, డబ్బు యుగం మొదలైంది. పెట్టుబడిదారులకు రెక్కలను అమ్ముకునే వాళ్ళు, మేధస్సును అమ్ముకునే వాళ్లుగా కొత్త వర్గాలు తయారయ్యాయి. కాంట్రాక్టింగ్, ఔట్ సోర్సింగ్ వంటి చౌక వేతనాల వ్యవస్థను ఏర్పరిచారు.

అమెరికా, యూరప్‌లో ఫ్యూడల్ వ్యవస్థను పూర్తిగా తుద ముట్టించాక పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించింది. భారత దేశంలో అందుకు భిన్నంగా ఫ్యూడల్ వ్యవస్థను నాశనం చేయకుండానే పెట్టుబడిదారీ వ్యవస్థ వచ్చేసింది. ఇప్పుడు ఈ రెండు వ్యవస్థలూ కలిసి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నాయి.

సమాజం సంఘర్షణల రంగస్థలమైపోయింది. వర్గాల మధ్య ఘర్షణలకు రణభూమిగా తయారైంది. కార్మిక వర్గాలు తలెత్తి పోరాడకుండా, కులం, మతం, మద్యం వంటి సమస్త వికారాలను ప్రయోగించారు. ఈ వ్యవస్థలో కష్టాలపై పోరాడాలంటే, ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థల్లో మార్పుకోసం పోరాడాలి. అదే వర్గపోరాటం అంటారు ఉన్నం, ఉష. ఈ అర్ధ భూస్వామ్య, అర్ధ బానిసత్వం పాలనాధికారాన్ని కూల్చాలంటే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న భావనతో ముందుకు కదలాలని పిలుపునిస్తారు.

'అలనాడు ఆవిరిలో లేచిన శక్తులు, యంత్రభూతాలయి బుసకొట్టాక, చేతి వృత్తులు కరిగి విరిగి పడ్డాక, పల్లెలో బతుకులు చిగురులయ్యాక ఏ iZooto దిక్కూ మొక్కూలేని కూలి జనం, ఆ తల్లెదుట ఎంత కన్నీరు కార్చారో !?' అని ఆవేదన వ్యక్తం చేస్తారు.

## పెట్టుబడిదారి వికృత రూపాలు

చికాగాలో కార్మికులు అలనాడు రక్తం చిందించి ఎనిమిదిగంటల పనిదినాన్ని సాధించుకున్నారు. ఆ దినాన్నే మనం మేడేగా జరుపుకుంటున్నాం. కానీ, ఇప్పుడేమైంది? 'పనిగంటల ముల్లుకు స్కేటింగ్ చక్రాలు తొడిగి, ఎనిమిది పన్నెండుకు పెంచి, ఇబ్బడి ముబ్బడిగా దోచేశారు, వెట్టి చాకిరీ చేయిస్తున్నారు.' అంటారు. స్వేచ్ఛకు సంకెళ్ళేశారు. కార్మికుల కండలు పిండి, వారి నెత్తుటి మద్దలతో లాభాలు ఆర్జించారు. 'స్వేచ్ఛ ఒక పచ్చి అబద్ధమైంది. డబ్బును డబ్బు పొదిగిందంటే, అక్కడే లాభం పుట్టిందంటే, గుడ్డిగా ఏ తీరున నమ్ముతారు?' అని ప్రశ్నిస్తారు. 'ఆకలి కెలికిన కడుపు మంటలు, పోరే దారిలో మోగే గంటలు' ఉచితాలతో ఊరించారు, ఇదే ఉద్ధరణంటూ ఊరేగించారు.' అంటూ కుండబద్దలు కొడతారు.

### అంతర్జాతీయ పరిణామాలు

**'వర్గపోరు చరిత్రలో కరుకు తేలిన మార్క్సిజం, తప్పదన్నది సోషలిజం, కమ్యూనిస్టు శక్తులపై కత్తులు దూసినోళ్ళు, రష్యాలో జారైనా, చైనాలో చాంకైషేకైనా, ముస్సోలినీ హిట్లరైనా, కాలిపోయిన రాలిపోయిన కనిపించని తోక చుక్కలు.' అంటూ దెప్పిపొడుస్తారు.**

**'విదేశీ మార్కెట్టు లాభాల వేటతో పొడుచుకొచ్చిన సామ్రాజ్య వాదం' అంటారు. ఆధునిక కాలంలో సామ్రాజ్యవాదం వికృత యుద్ధ రూపం గురించి ఇలా వ్యాఖ్యానిస్తారు. 'ఇరాక్ పై అమెరికా విధ్వంసం, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాష్టీకం, ఓ వైపు అమెరికా నగ్న కిరాతకం, ఇంకో వైపు పశ్చిమ దేశాల ఘాతుకం'**

### విలువ - ధర - శ్రమ తర్కం

'శ్రమశక్తి ఖర్చుతో పుట్టిందే శ్రమ, శ్రమలో శ్రమశక్తిని సరుకు చేసి, నిరుద్యోగ మార్కెట్ లో రేటుకు కొనేసి, దాన్నుంచి శ్రమ విలువను పిండేసి, వాల్చుకున్నదే అదనపు పెట్టుబడి' అని పెట్టుబడి ఎలా శ్రమ దోపిడీ నుంచి పుట్టిందో తేలిగ్గా వివరిస్తారు. మార్క్స్ 'క్యాపిటల్' ప్రభావంతో రాసినదే 'సిందూరం'లోని ఈ కవితా విశ్లేషణ.

నిజానికి 'క్యాపిటల్' అంత తేలిగ్గా అర్థం అయ్యేది కాదు. 'క్యాపిటల్'ను అర్థం చేసుకుని, సులభ శైలిలో పరిచయం రాయడానికి రంగనాయకమ్మకు పదిహేనేళ్ళు పట్టింది. తన జీవిత సహచరుడు, భాషా శాస్త్ర ఆచార్యులుగా పనిచేసిన బాపూజీ సహకారంతో అది సాధ్యమైంది. ఇంత గొట్టు విషయాన్ని ఉన్నం, ఉష దంపతులు కవిత్వీకరించబూనడం నిజంగా గొప్ప సాహసం.

### అలవాటులో జరిగే పొరపాట్లు

ఎంతో గొట్టుగా ఉండే ఆర్థిక, సామాజిక విషయాలను ఉన్నం, ఉష దంపతులు 'సిందూరం'(పెట్టుబడికి కవితల కట్టుబడి)లో చాలా సరళమైన భాషలో చక్కగా కవిత్వీకరించారు. 'మన ఆలోచనలు, అభిప్రాయాలు ఆధునికమైనప్పుడు మనం ఉపయోగించే భాష కూడా ఆధునికం కావాలి.' అంటారు ప్రముఖ భాషా శాస్త్రవేత్త ఆచార్య జి.ఎన్. రెడ్డి.

'వాళ్ళమ్మ మొగుడి సొమ్ములా' (పేజీ33), 'రాజకీయ రంకులు దెప్పకుంటే'(పేజీ45) వంటి కాలం చెల్లిన జాతీయాలు వాడకుంటే మరింత బాగుండేది. 'పైశాచిక హింసలు భరిస్తూ' (పేజీ33), 'అప్పటి వరకు కిరాతకులకు' (పేజీలు 35,74,124) వంటి వాక్యాల్లో పైశాచికులు, కిరాతకులు అనేవి కొన్ని జాతుల పేర్లు. ఆయా జాతులను దుర్మార్గానికి పర్యాయపదంగా వాడడం సరికాదు.

'కిరాతకులు' అనేది పక్షులను వేటాడి జీవించే ఒక గిరిజన జాతి. అలాగే 'పైశాచికులు' అనేది ఆఫ్రికా నుంచి భారత దేశానికి వలస వచ్చి స్థిరపడిన ఒక జాతి. 'పైశాచికులు' మాట్లాడే భాషను 'పైశాచిక భాష' అనే వారు. 'పైశాచిక భాష'కు లిపి లేదు. కానీ, వారు గొప్ప మౌఖిక సాహిత్యాన్ని సృష్టించారు. 'పైశాచికుల' కథాసర్వస్వం బృహత్కథ నుంచే కాళిదాసు 'మేఘసందేశం', బాణుడి 'కాదంబరి' వంటి అనేక రచనలు వచ్చాయని 'కాదంబరి'కి రాసిన ముందుమాటలో పండిత పాత్రికేయుడు విద్వాన్ విశ్వం అంటారు.


ఇలాంటి పొరపాట్లు ఉద్దేశ్యపూర్వకంగా జరిగినవని నేను అనడం లేదు. అలవాటులో పొరపాట్లుగా దొర్లినవే. 'సిందూరం'లో ఉపయోగించలేదు కానీ పత్రికల్లో 'కసాయి' పదాన్ని దుర్మార్గానికి మారుగా వాడుతున్నారు. 'కసాయి' కూడా వ్యవసాయం లాగానే (మాంసం) ఆహారాన్ని తయారుచేసే వృత్తి. ఏ వృత్తినీ కించపరచకుండా ఉండడమే భాషలో సామాజిక ఆధునికత. గతంలో శ్రీశ్రీ కూడా, దుర్మార్గానికి పర్యాయపదంగా 'కసాయిబు' అన్న పదాన్ని ప్రయోగించారు. దీని వల్ల అనేక విమర్శలను ఎదుర్కోవలసి వచ్చింది. 'కసాయిబు' పద ప్రయోగం వల్ల కసాయి వృత్తినే కాదు, సాయిబు పదం వల్ల ముస్లింలను కూడా కించపరచడమే అవుతుంది. గతంలో సి.వి. 'ప్యారిస్ కమ్యూన్' కూడా కవితాత్మకంగా రాశారు. అది తెలుగు పాఠకులను ఉర్రూతలూగించిన రచన. ఆ దిశగా ఉన్నం వెంకటేశ్వర్లు, ఉష దంపతులు రాసిన 'సిందూరం' కూడా పాఠకాదరణ పొందుతుందని ఆశించవచ్చు. ❑

# 'మృతజీవులు' నవలా పరిచయం



- పి.యస్.ప్రకాశరావు

ఇది ఒక వ్యంగ్య రచన. రష్యన్ భాషలో తొలి నవల. రష్యా విప్లవానికి ఏడు దశాబ్దాల ముందు రాసినది. 1846లో వెలువడింది. గొగోల్ నాటి రష్యన్ సమాజంలోని కుళ్ళునూ కశ్మలాన్నీ ఈ నవలలో మన కళ్ల ముందుంచాడు. జార్ ప్రభుత్వ విధానాలను అవహేళన చేశాడు. ఇందులోని ప్రధాన పాత్ర చిచీకవ్. తానొక 'భూస్వామిని' అని చెప్పుకుంటాడు. సెలిఫాన్ అనే బండి తోలే వాణ్ణీ, పెత్రూష్క అనే ఒక సేవకుణ్ణీ వెంట పెట్టుకుని తన మూడు గుర్రాల బండిలో బయలుదేరి వెళ్లి భూస్వాములను కలుస్తాడు. వారి కింద పని చేసే కమతగాళ్ల గురించి ఆరా తీస్తాడు. గవర్నర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వంటి ప్రముఖులపై ప్రశంసల జల్లు కురిపిస్తూ వాళ్లు తనకు ఆతిథ్యమిచ్చేలా మాట్లాడతాడు. తన గురించి ముక్తసరిగా చెప్పుకుంటాడు.




రచన : నికొలాయ్ గొగోల్ - తెలుగు: కొ. కు
సంక్షిప్తం: ఎ.గాంధీ - ప్రచురణ : పీకాక్ బుక్స్

ఇతను గిరీశం వంటివాడు. గుర్రాలు, కుక్కలు, కోర్టు వ్యవహారాలు, పాపపుణ్యాలు ఒకటేమిటి దేని గురించైనా అనర్గళంగా మాట్లాడుతాడు. ఇతను ఒక 'నిఖార్సైన పెద్దమనిషి' అని అందరూ అనుకుంటారు.

చిచీకవ్ భూస్వాములను సందర్శించడానికి సరైన కారణమే ఉంది. ఆ కాలంలో ప్రతి భూస్వామి దగ్గరా కమతగాళ్లు ఉండేవారు. ఐదేళ్లకోసారి ప్రభుత్వం కమతగాళ్ళ సంఖ్యను నమోదు చేస్తుంది. ఆ సంఖ్యను బట్టి భూస్వాముల దగ్గర పన్ను వసూలు చేస్తుంది. గణన తర్వాత ఆ జాబితాలో ఉన్న కొంత మంది కమతగాళ్లు చనిపోవచ్చు. అయినా సరే ఆ భూస్వామి మళ్లీ ప్రభుత్వం లెక్కలు చూసే వరకు తన కమతగాళ్లకు (చనిపోయిన వారితో సహా) పన్ను కట్టాల్సిందే. ఇప్పుడు చిచీకవ్ అలాంటి చనిపోయిన కమతగాళ్లను కొనడానికి బయలుదేరాడన్నమాట. భూస్వాముల దగ్గర ఆ కమతగాళ్లను కొంటాడు. వారికి పన్ను ఇకపై నేనే కడతాను' అంటాడు. విక్రయ పత్రాలు రాయించుకుంటాడు. ఆ కమతగాళ్ళ బతుకులు బానిసల బతుకుల్లాగే దుర్భరంగా ఉంటాయి. యజమానికి వాళ్ళను అమ్ముకునే అధికారం ఉంటుంది. పనిచేయకపోతే వారిని కొట్టే హక్కు ఉంటుంది. అసలు కొట్టే శ్రమ అతనికెందుకు? మేనేజర్‌తో కొట్టిస్తాడు. 'ఎందుకంటే కొట్టకపోతే వాళ్ళు మాట వినరు'. కమతగాళ్ల గుడిసెలు అడ్డదిడ్డంగా కోళ్ల గూళ్లలాగ ఉంటాయి. భూస్వాముల దృష్టిలో 'ఈగలెంతో కమతగాళ్లూ అంతే! వర్తకులు కమతగాళ్ల పిల్లలను ఎత్తుకుపోయే సందర్భాలు ఉంటాయి.

చిచీకవ్ గురించి నగరంలో పలు విధాలుగా మాట్లాడుకుంటారు. 'ఇతను కొన్న కమతగాళ్లు దొంగలూ తాగుబోతులూ సోమరులూను' 'చిచీకవ్ కోటీశ్వరుడన్నమాట' 'చనిపోయిన కమతగాళ్ల వివరాలను రహస్యంగా సేకరించడానికి గవర్నర్ ఇతన్ని పంపించి ఉంటాడు' 'దొంగ నోట్లు అచ్చేసేవాడు ఒకడు రకరకాల పేర్లతో ఈ ప్రాంతంలో తిరు గుతున్నట్టు సాక్ష్యాలు ఉన్నాయి'. 'ఒక బందిపోటు దొంగ తప్పించుకు పారిపోయాడు, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే తక్షణం అరెస్టు చేయమని పక్క రాష్ట్రం గవర్నర్ కబురు'. ఇలాంటి హెచ్చరికలు, పుకార్లు అధికారులకు ఆందోళన కలిగించాయి. చిచీకవ్‌కి ఈ గొడవలేవీ తెలియదు. కానీ అధికారులంతా అతన్ని దూరం పెడతారు. ఇంతకీ మన చిచీకవ్ ఘనచరిత్ర ఏమిటి? ఇతను పుట్టినప్పుడే 'వీడు తండ్రి పోలికా కాదు, తల్లి పోలికా కాదు దారిన పోయే దానయ్య పోలిక' అంది మంత్రసాని. చిన్నప్పుడే తండ్రి 'ఒరేయ్ ! కష్టపడి చదువుకో. పైవాళ్లను సంతృప్తిపరుచు. బడి పిల్లలతో తిరగకు, తిరగాలనుకుంటే గొప్పవాళ్లతో

తిరుగు. ఒకరికి పెట్టకు. చేతనయితే ఎదుటి వారి నుంచి పుచ్చుకో! కష్టం వస్తే నిన్ను ఆదుకునేది మనుషులు కాదు డబ్బే' అని హితబోధ చేశాడు. అది చిచీకవ్ మనసులో దృఢంగా నాటుకు పోయింది. తోటి కుర్రాళ్ళు తనకు కానుకలు ఇచ్చేలా చేసుకున్నాడు. వాటిని భద్రంగా దాచి తిరిగి వారికే అమ్మేవాడు. తినుబండారాలు కొను క్కొచ్చి క్లాసులో గొప్పింటి పిల్లలకి ఆకలేసిన సమయంలో చూపి వాళ్లకు నోరూరించి వాటిని లాభానికి అమ్మేవాడు. ఎలా గోలా బడిపంతులుని ఆకట్టుకుని మంచి మార్కులతో పాస్ అయ్యాడు. తండ్రి పోయాక చిచీకవ్ ఉద్యోగ వేటలో పడ్డాడు. కానీ అతనికి నాసిరకం ఉద్యోగమే దొరికింది. అక్కడ పెద్ద గుమస్తా కూతుర్ని బుట్టలో వేసుకుని, అతనికి చేరువయ్యాడు. పెద్ద ఉద్యోగం సంపాదించాడు. ఒక్కో మెట్టు ఎదిగాడు. కానీ పెళ్లి విషయం దాటవేశాడు. అడ్డదారుల్లో ధనవంతుడయ్యాడు. కొన్నాళ్ళకు పెద్ద గుమాస్తా స్థానంలో ఒక కిరాతక అధికారి వచ్చి చిచీకవ్‌ని పాతాళానికి తొక్కాడు. చిచీకవ్ ఇంకో నగరానికి వెళ్లి కష్టమ్స్ ఆఫీసులో ఉద్యోగం సంపాదించాడు. కానీ క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని బికారి అయ్యాడు. ఆ తర్వాత హీనమైన ఉద్యోగాలు చేశాడు.

అలాంటి పరిస్థితిలో చిచీకవ్‌కి ఒకరోజు హఠాత్తుగా వెట్టి కమతగాళ్లను ట్రస్టీ కమిటీకి తాకట్టు పెట్టించాలనే ఆలోచన వచ్చింది. ఎస్టేట్‌లో ఉండే కమతగాళ్ల సంఖ్యను బట్టి ఈ రుణం దొరుకుతుంది. బతికిన కమతగాళ్లతోపాటు చచ్చిన కమత గాళ్లను కలిపేసి లెక్క చూపించి రుణం తీసుకోవచ్చు. మళ్లీ జనాభా లెక్కలు జరిగే దాకా అడిగే వాళ్ళు ఉండరు. ఒక ఎస్టేట్ సంపాదించి, కొత్త జనాభా లెక్కలు జరిగే లోపు వెయ్యి మందిని నేనే కొని తాకట్టు పెట్టవచ్చు. 'దేవుడు మేలు చేసి' అంటు వ్యాధుల వల్ల కమతగాళ్లు చాలా మంది చచ్చారు. పన్నులు తగ్గించుకోవడానికి భూస్వాములు కమతగాళ్లను నాకు సంతోషంగా ఇచ్చేస్తారు' అనుకున్నాడు. అప్పుడే అతని శవాల వేట ప్రారంభమైంది.

రకరకాల మనస్తత్వాలున్న భూస్వాముల్ని కలుస్తాడు. వారి ఇళ్ళలో రకరకాల మద్య మాంసాలు అతనికి లభిస్తాయి. భూస్వాముల్లో సాధుస్వభావులూ క్రూరులూ పిసినారులూ మొరటు వాళ్ళూ, తెలివితక్కువ దద్దమ్మలూ తిండిపోతులూ సోమరులూ దుబారా వల్ల దివాలా తీసిన వాళ్లూ ఉన్నారు. కమతగాళ్లను కొనడానికి వాళ్లకు రకరకాల కథలు కల్పించి చెప్పాడు. ఒక సైనిక జనరల్‌ని కలిసి "నాకు 80 ఏళ్ల ఒక పెద్ద తండ్రి ఉన్నాడండి. ముసలాడు. ఆయన కింద 300 మంది కమతగాళ్ళు ఉన్నారు. ఆయన ఆస్తికి నేనొక్కడినే వారసుడిని. నా తెలివితేటలతో 300 మంది కమతగాళ్ళను సంపాదిస్తే, అప్పుడు తన 300 మందిని నా పరం చేస్తానన్నాడు" అంటాడు.


మొత్తం మీద చిచీకవ్ క్రయపత్రం ద్వారా 400 మంది కమతగాళ్లను కొన్నాడు. ప్రభుత్వ కార్యాలయానికి చేరుకున్నాడు. అక్కడున్న అధికారులందరికీ మామూళ్లు ఇచ్చేసరికి వారికి అతను సుగుణాలరాశిలా కనిపించాడు. దస్తావేజులు రాసేపని పూర్తయింది. కొన్న కమతగాళ్లను తాకట్టు పెట్టాడు. పంటలేవీ పండించకుండానే తన పెట్టుబడికి అనేక రెట్ల డబ్బు క్షణాల్లో పోగేశాడు. కానీ అతని కలలు పగటి కలలయ్యాయి. చిచీకవ్ తన పెద్దమ్మ రాసినదని చెబుతున్న విల్లు నకిలీదని గవర్నర్‌కి తెలి సింది. న్యాయస్థానానికి అర్జీలు వెళ్లాయి. ఎక్కడలేని బంధువులు వచ్చి చేరారు. చచ్చిపోయిన కమతగాళ్లను కొనడం గురించి, కస్టమ్స్‌లో సరుకుల దొంగ రవాణా గురించి సాక్ష్యాలు దొరికాయి. జైలు శిక్ష తప్పదని తెలిసి చిచీకవ్ గవర్నర్ జనరల్ కాళ్ల మీద పడ్డాడు. ప్రయోజనం లేకపోయింది. సాయుధ పోలీసులు అతన్ని జైలుకు లాక్కుపోయారు. ఒక ప్రభుత్వ అధికారికి 30,000 లంచం ఇచ్చి కేసుల నుంచి బయట పడ్డాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. 'నేను అంత నిస్పృహ చెందాల్సింది కాదు' అనుకున్నాడు. మానసిక సంస్కరణతో రష్యాను బాగు చేయవచ్చనే సూచనతో నవల ముగుస్తుంది. ❑

# ప్రత్యేక మతం కోసం కదంతొక్కిన లింగాయత్‌లు


(22వ పేజీ తరువాయి)

ఆయన చెప్పారు. భౌతిక శాస్త్ర ఆచార్యుడు సోమశేఖరప్ప గతంలో చెప్పినట్లుగా, లింగాయతుల్లో పెరుగుతున్న పురోగామి అభిప్రాయాలు రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర ప్రభావం కలిగించవచ్చు. అభియాన్ ఒక సైద్ధాంతిక ఉద్యమ గుండెకాయగా ఉంది. లింగాయత్‌లు ఉన్నత మైన ప్రజాస్వామిక సమూహంగా ప్రారంభమయ్యారు. అయితే, కొంత కాలం తరువాత వెనుకపట్టు పట్టారు. "మేము ఇప్పుడు బహుతావాదాన్ని పునరుద్ధరించేందుకు, సమాజంలో విద్వేషం విస్తరించకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నాం" అని ఆయన చెప్పారు. ఆచార్యులు తన వ్యక్తిగత అనుభవాన్ని పేర్కొ న్నారు. "చిత్రదుర్గలో యాత్ర సందర్భంగా ముస్లిం మహిళల బృందం ఒకటి లింగాయత్ సమాజ అతి పెద్ద సంస్థలలో ఒకటి, పురాతనమైన మఠాన్ని వెతుక్కుంటూ రావటాన్ని నేను గమనించాను. వారు పట్టణ సందర్శకులుగా వచ్చారు. వారికి ఆతిథ్యమిచ్చిన వ్యక్తి లింగాయతుల ప్రముఖ ఆరాధన స్థలం బయటా లోపలా ఉన్న వాటిని చూపటాన్ని చూశాను. అలాంటి వారసత్వ పరిరక్షణ కోసం మేం పోరాడుతున్నాం" అని చెప్పారు. ❑

**విశ్లేషణాత్మక అనువాదం: ఎం కోటేశ్వరరావు**




లొంగే వరకు.. ఉతుకుతా




మీరెలాగంటే.. అలా





రాజును మించిన భక్తి

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 4 - Issue No : 1 October 2025

## కొత్త పుస్తకాల స్వీకారం




ప్రతులకు..
ప్రజాశక్తి బుక్ హౌస్,
విజయవాడ




ప్రతులకు..
ప్రజాశక్తి బుక్ హౌస్,
విజయవాడ




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.